తెలుగు దినపత్రిక

epaper.ninadamnews.com

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, జులై 28, 2026 | సంపుటి - 22 | సంచిక 300 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



ఆ విమాన ప్రమాదం

## చిన్న ఘటన కాదు

- నివేదిక ఎప్పుడు అందేది ఇప్పడే చెప్పలేం
- అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై రాజ్యసభలో కేంద్రం

వివరాలు 2

సీఎం విజయ్‌కి మద్రాస్ హైకోర్టులో

## ఎదురుదెబ్బ

- ప్రభుత్వ ఉద్యోగాలు అంగడి సరుకు కాదు
- కరూరు బాధితులకు ఉద్యోగాల కల్పనపై ఆక్షేపణ



# రాజీనామాతో తెరపడిందా కేసులతో కొత్త అధ్యాయమా?

నీట్ లీక్ ఉద్యమం తర్వాత విద్యార్థులపై కేసుల కలకలం | ప్రజాస్వామ్యంపై కొత్త ప్రశ్నలు



**నీట్ ప్రశ్నాపత్రం లీక్ దేశవ్యాప్తంగా రగిలించిన విద్యార్థి ఉద్యమం రాజకీయంగా కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్ర ఒత్తిడికి గురిచేసింది. ఆందోళనలు ఉద్ధృతం కావడం, ప్రతిపక్షాలు పార్లమెంట్ నుంచి వీధుల వరకు నిరసనలకు దిగడం, విద్యార్థి సంఘాలు ఉద్యమాన్ని మరింత విస్తరించడం వంటి పరిణామాల నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం కీలక మలుపుగా మారింది.**

**న్యూఢిల్లీ/నినాదం ప్రత్యేక ప్రతినిధి:**

రాజీనామాతో వివాదానికి ముగింపు పలకక ముందే మరో అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై పెద్ద సంఖ్యలో కేసులు నమోదయ్యాయనే వార్తలు, ఆరోపణలు వెలుగులోకి రావడంతో కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరీక్షల్లో జరిగిన అక్రమాలపై ప్రశ్నించిన యువతనే ఇప్పుడు చట్టపరమైన కేసుల్లో ఇరికిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, అధికార పక్షానికి అనుకూలంగా ఉన్న కొన్ని సామాజిక మాధ్యమ ఖాతాలు ఈ ఉద్యమాల వెనుక విదేశీ శక్తులు, "డీప్ స్టేట్", ఉగ్రవాద సంస్థల ప్రభావం ఉందని ప్రచారం చేస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారిత ఆధారాలు ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడికాలేదు. అందువల్ల ఈ ప్రచారాలు కూడా తీవ్ర రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి.

### కేసులు.. భవిష్యత్‌పై ముద్ర పడుతుందా?

విద్యార్థులపై నమోదయ్యే క్రిమినల్ కేసులు వారి ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశీ విద్య, వీసాలు వంటి అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చివరికి కోర్టులు వారిని నిర్దోషులుగా ప్రకటించినా, కేసుల కారణంగా దీర్ఘకాలిక ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అందుకే, శాంతియుత నిరసనల్లో పాల్గొన్న విద్యార్థుల విషయంలో చట్ట అమలు సంస్థలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పలువురు సూచిస్తున్నారు.

### యువతలో పెరుగుతున్న అసంతృప్తి

నీట్ లీక్ ఒక్కటే కాదు. గత కొన్నేళ్లుగా వివిధ పోటీ పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల భద్రత, నియామకాల ఆలస్యం వంటి అంశాలపై యువతలో అసంతృప్తి పెరుగుతోందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ అసంతృప్తికి పరిష్కారం చూపకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఉద్యమాలకు దారితీయవచ్చని వారు హెచ్చరిస్తున్నారు.



### ప్రభుత్వం చేయాల్సింది ఏమిటి?

పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో తిరిగి విశ్వాసం కల్పించడం, ప్రశ్నాపత్రాల భద్రతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడం, తప్పు చేసిన అధికారులపై మరియు అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, అలాగే శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థుల హక్కులను కాపాడడం.. ఈ నాలుగు అంశాలపైనే ఇప్పుడు ప్రభుత్వ విశ్వసనీయత ఆధారపడి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### రాజీనామా... వ్యూహాత్మక ఎత్తుగడేనా?

మంత్రి రాజీనామాతో ప్రజల్లో ఉవ్వెత్తున ఎగిసిపడిన ఆగ్రహాన్ని తగ్గించి, ఆ తర్వాత ఉద్యమాన్ని బలహీనపరిచే చర్యలు ప్రారంభమయ్యాయా? అనే ప్రశ్నలను ప్రతిపక్షాలు లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వం మాత్రం చట్టాన్ని ఉల్లంఘించిన వారిపైనే చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది. అయితే, శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై కూడా కేసులు నమోదయ్యాయా? అనే అంశంపై స్పష్టత అవసరమని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

***ప్రశ్నాపత్రం లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ఎంత అవసరమో, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించిన యువత హక్కులను కాపాడటం కూడా అంతే అవసరం. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాన్ని చట్టవ్యవస్థతో అణచివేస్తున్నారనే భావన ఏర్పడితే, అసంతృప్తి మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం కేసుల్లో కాదు; పారదర్శక విచారణ, బాధ్యులపై నిష్పాక్షిక చర్యలు, పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణల్లోనే ఉంది.***







కేంద్రం హామీలు

## బుట్టదాఖలు

- కేసుల ఎత్తివేతపై కదలిక లేని ఉత్తర్వులు
- ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ ఆందోళనలు
- న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- కాక్రోచ్ జనతాపార్టీ నేతల వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై27(నినాదం):**

నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహరణపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశవ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. ▸▸తరువాయి2లో..

శాంతియుత నిరసనలు

## తెలిపే హక్కు ఉంది

నీట్ లీక్.. విద్యార్థులపై లాఠీచార్జ్ వ్యవహారంలో..

ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన భరోసా

చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం

2



భూ నిర్వాసితులకు

## పరిహారం చెల్లించండి

- రోడ్డు పనులను గడువులోగా పూర్తి చేయండి
- ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



▸▸వివరాలు 5లో..



విద్యార్థుల భవిష్యత్తే

## రాష్ట్ర భవిష్యత్

***ఉచిత పథకాలు అనేవి ఈ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టంగా ప్రకటించారు. మిడిమిడి జ్ఞానంతో తెలిసి తెలియక చాలామంది ఉచిత పథకాల పైన విమర్శ చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.***

- ఉచితాలు కావు... ప్రజా పెట్టుబడులు
- అర్హకలితో ఏ బిడ్డ బడికి వెళ్లొద్దు
- సానబెట్టిన వజ్రాల్లా మానవ వనరులు
- పాలన అంటే పెత్తనం కాదు.. సమాజ హితం
- 'పీపుల్స్ మార్చ్' నుంచే ప్రజాహిత ఇందిరమ్మ పథకాలు
- మధిరలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం బట్టి

**ఖమ్మం, జులై 27(నినాదం):**

పరిశ్రమలు ప్రాజెక్టులు ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరి పైన ప్రభుత్వం పెట్టుబడి పెడుతుందని ఆయన అన్నారు. ఈ పెట్టుబడి ఫలితాలు ప్రజలు అభివద్ధి చెంది ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేసేవిగా ఉంటాయని ఆయన అన్నారు. మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ ▸▸తరువాయి2లో..

గందరగోళం మధ్యే పేపర్ లీకేజ్

## సవరణ బిల్లు

పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

- మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు • బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ • బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్ • విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా • బిల్లుపై నేడు చర్చ

**న్యూఢిల్లీ,జూలై27(నినాదం):**

పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీ ఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా ▸▸తరువాయి2లో..



ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల

## సమావేశాలు

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

రాష్ట్ర శాసనసభ వర్షా కాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది.

▸▸వివరాలు 2లో..




## టోరంటోలో దారుణ ఘటన

భారత సంతతి యువతిపై కాల్పివేత

2

మాజీ ఎమ్మెల్యే పెద్దికి

## కెసిఆర్ పరామర్శ

ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

3



ఫీజు రియంబర్స్‌మెంట్

## చెల్లింపులో విఫలం

- విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం
- యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్



**హైదరాబాద్,జులై 27(నినాదం):**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. ▸▸తరువాయి2లో

హైడ్రా కమిషనర్‌ను

## తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్

**హైదరాబాద్,జూలై27(నినాదం):**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ▸▸తరువాయి2లో



## రంగనాథ్‌కు సర్కార్ అండ?



- న్యాయపరమైన పోరాటానికి సిద్ధం అవుతున్న ప్రభుత్వం
- న్యాయ కోవిదులతో చర్చించి అప్పీల్ చేసే అవకాశం
- హైడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్

▸▸వివరాలు2లో..

# కేంద్రం హామీలు బుట్టదాఖలు

నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని మరియు వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోందని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు. బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయసహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించు కుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళన కారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించు కోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని




కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం నాడు సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది మరియు ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాత జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

**న్యూఢిల్లీ,జులై 27(నినాదం):**



నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతో లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

## విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

**చెన్నై,జూలై27(నినాదం):**

తమిళనాడు సిఎం విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియమాక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

## ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

**హైదరాబాద్,జూలై27(నినాదం):**

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజుల పాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ విడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సవి క్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

## ఆ విమాన ప్రమాదం చిన్న ఘటన కాదు

**న్యూఢిల్లీ,జూలై27(నినాదం):**

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై రాజ్యసభలో కేంద్రం కీలక వ్యాఖ్యలు చేసింది. తుది నివేదికల విడుదలపై తలెత్తుతున్న ప్రశ్నలపై బదులిస్తూ.. ఈ కేసు దర్యాప్తులో ఎటువంటి ఆలస్యం జరగలేదని స్పష్టంచేసింది. అదేమీ చిన్న సంఘటన కాదని.. అటువంటి భారీ ప్రమాదాల దర్యాప్తును పూర్తి చేయడానికి సమయం పడుతుందని తెలిపింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తు అనేక అంశాలు.. వేర్వేరు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని.. అందువల్ల తుది నివేదిక కోసం ఎంత సమయం పడుతుందనే విషయాన్ని ముందుగానే అంచనా వేయడం సాధ్యం కాదని వెల్లడించింది.ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందని పౌర విమానయానశాఖ పేర్కొంది. నిర్దేశిత విధానాల ప్రకార దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు ఎటువంటి తుది నిర్ణయానికి రాలేదని వెల్లడించింది. ప్రస్తుతం విమాన 'థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల' ను తనిఖీ చేసే పక్రియ జరుగుతోందని తెలిపింది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే.

## ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా..? అని ప్రశ్నించారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాట మాడు తున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

## రంగనాథ్‌కు సర్కార్ అండ?

హైదరాబాద్,జూలై27(నినాదం): హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీ పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయ పడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ సలహాలు తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. ఇదిలావుంటే హైదరాబ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్ చేసింది. రంగనాథ్‌ను బలిపశువు చేశారని చెప్పారు. రేవంత్, ఎంఐఎం కనుసన్నల్లో హైడ్రా నడిచిందని విమర్శించారు. ఫాతిమా కాలేజీ, బడాబాబుల జోలికి హైడ్రా వెళ్లడంలేదని గుర్తు చేశారు. తొలి నుంచి పేదల ఇళ్లే హైడ్రా టార్గెట్ చేసిందని మండిపడ్డారు. హైడ్రాను రద్దు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాలను ప్రతిపక్ష బీఆరఎస్, బీజేపీలు స్వాగతించాయి.

## టోరంటోలో దారుణ ఘటన

టోరంటో: కెనడాలోని టొరంటో నగరంలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. 26 ఏళ్ల భారత సంతతికి చెందిన నవ్‌నీత్ కౌర్ అనే యువతిని ఓ వ్యక్తి దారుణంగా కాల్చి చంపాడు. ఇది ఒక పథకం ప్రకారం జరిగిన దాడి అని టొరంటో పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. శుక్రవారం ఉదయం 7:23 గంటల ప్రాంతంలో హంబర్‌వుడ్ బౌలేవర్డ్, రెక్స్‌డేల్ బౌలేవర్డ్ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రత్యక్షసాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. నవ్‌నీత్ కౌర్ వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, సదరు వ్యక్తి ఆమెను అనుసరించాడు. అతడు ఏదో మాట్లాడటంతో నవ్‌నీత్ వెనక్కి తిరిగి చూసింది. వారిద్దరి మధ్య స్వల్ప సంభాషణ జరిగింది. ఎలాంటి గొడవ లేదా వివాదం జరిగిన సూచనలు కనిపించకుండానే, అతడు వెంటనే తుపాకీ తీసి ఆమెపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన నవ్‌నీత్‌కు అత్యవసర వైద్య సాయం అందించినప్పటికీ, ఆమె అక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన టొరంటో పోలీసులు, నిందితుడిని పట్టుకోవడానికి డ్రోన్లు, ప్రత్యేక డాగ్ స్క్వాడ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

# గందరగోళం మధ్యే పేపర్ లీకేజ్ సవరణ బిల్లు



విపక్షాలు ముందుకు రాలేదు. నీట్ యుజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్టం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్

కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను డిప్యూటీ సీఎం సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఆశయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన, శుచి–శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బడ్జెట్‌లో ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు.

ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదు.. ఇక్కడ పుట్టిన ప్రతి బిడ్డ.. రాష్ట్ర భవిష్యత్తు అని ఆయన అన్నారు. వారి భవిష్యత్తే మన భవిష్యత్తు.అటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంత ప్తికరంగా ఉదయం పూట బ్రేక ఫాస్ట్ చేసి చదువుకోవాలని అన్నారు. రుచికరమైన, శుచి శుభ్రతతో కూడిన న్యూట్రిషియస్ ఫుడ్ ని మనం అందించాలని చెప్పిఈ క్యాబినెట్ చేసిన నిర్ణయం మేరకు బడ్జెట్లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అర్ధాకలితో పాఠశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలను సరిగ్గా వినలేక, ఆకలితో సతమతమవుతూ చదువు మీద ద ష్టి పెట్టలేని పరిస్థితి ఏ విద్యార్థికి రాకూడదనే ఆలోచనతో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఈ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. మానవ వనరులుమన రాష్ట్ర సంపదని, ఏ రాష్ట్ర అభివ ద్ధికైనా సహజ వనరులు ఎంత అవసరమో.. సమర్థవంతమైన మానవ వనరులు కూడా అంతే అవసరమని భట్టి విక్రమార్క నొక్కి వక్కాణించారు. అత్యంత ప్రతిభావంతులుగా తయారైనటువంటి మానవ వనరులు ఉన్నటువంటి రాష్ట్రం గాని, దేశం గాని ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా మారుతుందని ఆయన అన్నారు.రాష్ట్రానికే కాదు దేశానికి,ప్రపంచానికి కూడా దశా దిశా నిర్దేశం చేయగలిగినటువంటి మానవ వనరుల్ని సానబెట్టిన వజ్రాల్లాగా ప్రపంచం మీదికి మనం వదిలిపెట్టగలగాలని, అటువంటి వజ్రాల్ని తయారు చేసుకోవాల్సిన తరుణంలో మార్నింగ్ బ్రేక ఫాస్ట్ పథకాన్నిరాష్ట్రవ్యాప్తంగా మొదలుపెట్టే కార్యక్రమానికి నాంది పలికామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకి ఒకటే సమయానికి వేడిగా అల్పాహారం అందించడం అంటే ఇది ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమని, ఈ దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లెక్కించాల్సిన అంశమని అన్నారు. సాధారణంగా ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలకు సమయానికి టిఫిన్ కట్టడమే తల్లిదండ్రులకు కష్టంగా మారిన రోజులివి. అలాంటిది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షల మంది, రెసిడెన్షియల్ స్కూళ్లలోని 7 లక్షల మంది పిల్లలతో కలిపి మొత్తం 27 లక్షల మందికి ఒకే సమయానికి వేడివేడిగా అల్పాహారం అందించడం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున అల్పాహారం అందించే వ్యవస్థ లేదని ఆయన పేర్కొన్నారు. సంకల్పం మంచిదైతే భగవంతుని ఆశీస్సులు ఉంటాయని, అందుకే సాధ్యం కాదనుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రభుత్వం సాధ్యం చేసి చూపిందని డిప్యూటీ సీఎం హర్షం వ్యక్తం చేశారు.

హరే క ష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా, అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకనైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మధిరలోని తాత్కాలిక సెంట్రలైజ్ కిచెన్ ద్వారా 16 మండలాల స్కూళ్లకు వాహనాల్లో అల్పాహారం అందిస్తున్నామని అన్నారు. రాబోయే 3 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని అందించనున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. పిల్లలకు అందించే అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి 3 రోజులు పాలు, మరో 3 రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశానని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమయంలో బడుల దుస్థితి, నిరుద్యోగుల ఆవేదన, ఇల్లు లేని పేదల బాధలను విన్నానని చెప్పారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ. 22,500 కోట్లతో మొదటి విడతలోనే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు.మహాలక్ష్మి పథకంతో సగం జనాభా ఉన్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆర్థికంగా తోడ్పాటునందిస్తున్నామన్నారు.మహిళలను కోటీశ్వరులను చేసేందుకు బ్యాంక లింకేజీ ద్వారా ఇప్పటికే రూ. 67,000 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నారు.పేద కుటుంబ వైద్య పరిమితిని ఏకంగా రూ. 10 లక్షలకు పెంచామన్నారు.కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు మనిషికి 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. కేవలం 9 రోజుల్లోనే రూ. 9,000 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ఇది మంచి కార్యక్రమమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఆకలితో వస్తే ఏం వింటారనే మధ్యాహ్న భోజనం పథకం వచ్చిందని, దానికి కొనసాగింపుగా అల్పాహార పథకం వచ్చిందన్నారు. ప్రభుత్వ సౌకర్యాలు అందిపుచ్చుకుని పిల్లలు ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, పిల్లలకు శారీరక ద ధత్వం వున్నప్పుడు చదువు అబ్బుతుందని అన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అల్పాహార పథకం దోహదపడుతుందని తెలిపారు. ఇది మంచి కార్యక్రమమని, ఎల్లకాలం కొనసాగాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్సీఅన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక మాట్లాడుతూ, పిల్లలు ఆరోగ్యాంగా



ఉండాలని ప్రభుత్వం అల్పాహార పథకం అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో హరే క ష్ణ వ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, ది అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షులు సత్య గౌర చంద్ర దాస స్వామిజీ మాట్లాడుతూ, ఇది అద్భుత పథకమని అన్నారు. ప్రతిరోజు విద్యార్థిని పాఠశాలకు రప్పించేలా అల్పాహారం ఉంటుందన్నారు. అల్పాహారం తో పాటు పాలు అందిస్తామని తెలిపారు. అల్పాహారం అందజేసే ప్రక్రియను, సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ పనితీరును ఈ సందర్భంగా స్వామీజీ వివరించారు. ఈ కార్యక్రమంలో సింరేణి సిఎండి బుద్ధప్రకాశ్ జ్యోతి, హరే క ష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సీఈఓ కౌంతేయ స్వామీజీ, కార్పొరేషన్ చైర్మన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వర రావు, డిఇఓ సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాస చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సిపిఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 27(నినాదం):** ఎల్ నినో వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ?సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మరియు తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్తలతో జిల్లా కలెక్టర్ ప్రత్యాన్మయ పంటల సాగుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదు అవుతున్న పరిస్థితుల దృష్ట్యా ఏర్పడే ప్రతికూల పరిస్థితులను రైతులకు సమగ్రంగా వివరించాలని ఆదేశించారు. ఏ రకమైన పంటలు వేయాలి, తక్కువ నీటితో ఎలాంటి పంటలలో యాజమాన్య పద్ధతులు పాటించాలనే అంశాలపై క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. తక్కువ నీటి అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను, ఎరువులను సిద్ధంగా ఉంచాలని, వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులకు ఎప్పటికప్పుడు సకాలంలో సాంకేతిక సలహాలు, సూచనలు అందించడంలో రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్తలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి రోజు తనకు పంటల సాగు నివేదికలు అందచేయాలని ఆదేశించారు. పంట సాగు చాలా తక్కువ జరుగుతుందని అవగహన పెంచి సాగును పెంచాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇరిగేషన్ వనరులలోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ నిబంధనలను జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావ ప్రస్తుత పరిస్థితులలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. నీటి నిల్వల దృష్ట్యా పంట పొలాలకు ఎలాంటి పరిస్థితిలోనూ నీటిని విడుదల చేయకూడదని తెలిపారు. రిజర్వాయర్లు, కాలువలు మరియు ఇతర ఇరిగేషన్ వనరుల వద్ద నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఎల్ నినో వల్ల తాగునీటి అవసరాల కోసం ఉద్దేశించిన నీరు ఇతర అవసరాలకు మళ్లించకుండా అధికారులు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమర్థవంతంగా ప్రణాళికలు రూపకల్పన చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన అధికారి తిరుపతి, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త డా మదన్ మోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖ భూపాలపల్లి, మహాదేవపూర్ ఏడీఏలు రమేష్, శ్రీ పాల్, అన్ని మండలాల మండల వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఆక్సిజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : సర్వే నెం.252/1, ఆరూర్ గ్రామం, సదాశివ్‌పేట్ మండలం, మెదక్ జిల్లా, మెదక్, తెలంగాణ, ఇండియా. కార్పొరేట్ కార్యాలయం : లెవల్-1, ప్లాట్ నెం.బి1 మరియు బి2, ఐడిఎ గాంధీనగర్, బాలానగర్ టౌన్‌షిప్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా. ఫోన్ నెం.040-23355938, CIN: L24110TG1990PLC012038.
ఇ-మెయిల్ ఐడిలు: md@oxygentapharma.com, cs@oxygentapharma.com, వెబ్‌సైట్ : www.oxygentapharma.com

### 30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు ఆడిట్ కాని స్వతంత్ర ఆర్థిక ఫలితాల స్టేట్‌మెంట్

(రూ. లక్షలలో)

| వివరములు | త్రైమాసికపు ముగింపు | | | సంవత్సరపు ముగింపు |
|---|---|---|---|---|
| | జూన్ 30, 2026 (ఆడిట్ కానివి) | మార్చి 31, 2026 (ఆడిట్ అయినవి) | జూన్ 30, 2025 (ఆడిట్ కానివి) | మార్చి 31, 2026 (ఆడిట్ అయినవి) |
| మొత్తం ఆదాయం | 3,702.02 | 4,978.69 | 1,530.37 | 11,326.77 |
| నికర లాభము/(నష్టము) (పన్నుకు, మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ పూర్వము) | (250.73) | (127.97) | (813.62) | (2,218.02) |
| నికర లాభము(నష్టము) పన్నుకు పూర్వము (మినహాయించిన మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్‌కు తరువాత) | (250.73) | (127.97) | (814.80) | (2,218.02) |
| నికర లాభము/(నష్టము) పన్నుకు తరువాత (మినహాయించిన మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్‌కు తరువాత) | (210.37) | (170.39) | (610.61) | (1,757.17) |
| మొత్తం ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత లాభం కలిగియుండి మరియు ఇతర సమగ్ర ఆదాయము (పన్ను తరువాత). | (210.37) | (117.86) | (610.61) | (1,704.63) |
| చెల్లించిన ఈక్విటీ షేర్ క్యాపిటల్ (ఒక ఈక్విటీ షేర్‌కు రూ.10/- చొప్పున) | 3,698.35 | 3,698.35 | 3,698.35 | 3,698.35 |
| రిజర్వులు (ఇంతకు ముందు సంవత్సరంలో ముగిసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపించిన విధంగా రీ వ్యాల్యూయేషన్ రిజర్వు మినహా) | | | | |
| ఒక్కొక్క షేర్ నుండి ఆదాయములు (ఒక్కొక్కటి రూ.10/- చొప్పున) (వార్షికము కానిది) | | | | |
| ఎ) బేసిక్ | (0.57) | (0.45) | (1.65) | (2.86) |
| బి) డైల్యూటెడ్ | (0.57) | (0.45) | (1.65) | (2.86) |

1. పైన తెలిపినట్లు 30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు కంపెనీ యొక్క ఆడిట్ కాని, ఆర్థిక ఫలితాల పైన తెలిపిన స్టేట్‌మెంట్ ఆడిట్ కమిటీ ద్వారా సమీక్షించి, మరియు **తేది : 27 జూలై, 2026**న జరిగిన సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించడమైనది.
2. కంపెనీలు (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) సవరణ రూల్స్,2016 మరియు కంపెనీలు (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) రూల్స్, 2015లోని రూల్ 3తో చదువబడుతూ కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 క్రింద సూచించినట్లు ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను (Ind-AS) అనుసరించి పైన తెలిపిన ఆర్థిక ఫలితాల స్టేట్‌మెంట్ తయారు చేయడమైనది.
3. కంపెనీ వారు సింగిల్ సెగ్మెంట్‌లో ఆపరేట్ చేస్తూ మరియు సింగిల్ సెగ్మెంట్‌కు సంబంధించిన ఫలితాలను ప్రకటించినారు.
4. Ind-AS ఆర్థిక ఫలితాలు సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్క్లోజర్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 ప్రకారం కంపెనీ చట్టబద్ధ ఆడిటర్ల ద్వారా ఆడిట్ చేయబడినవి.
5. పోల్చుకొని చూచు ప్రయోజనం కొరకు ఎక్కడైతే అవసరమైనచో, అక్కడ క్రితం సంవత్సరం/ కాలమునకు సంఖ్యలను రీగ్రూప్ చేయడమైనది.

ఆక్సిజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరపున మరియు ద్వారా
సం/-
బాలసుబ్బా రెడ్డి మామిళ్ళ
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
DIN: 01998852

ప్రదేశం : హైదరాబాద్
తేది : 27.07.2026


# మణికొండ జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థుల క్రీడా ప్రతిభ

గ్రేటర్ హైదరాబాద్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకాల పంట

**రాజేంద్రనగర్, జూలై 27 (నినాదం):** ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా జూలై 25న నిర్వహించిన 'గ్రేటర్ హైదరాబాద్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్'లో మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన ఎస్. హరినాథ్ రెడ్డి ఏకంగా నాలుగు పతకాలు సాధించి తన క్రీడా పటిమను చాటుకోగా.. ప్రవీణ్, కె. విజయ్, వై. అభిలాష్ కూడా విశేష ప్రతిభను ప్రదర్శించి పతకాలు కైవసం చేసుకున్నారు. సోమవారం విజేతలైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి నగదు బహుమతిని అందజేశారు. అలాగే గంగాధర్ రావు నాలుగు పతకాల విజేత హరినాథ్ రెడ్డికి ట్రాక్ సూట్లు, ఇతర క్రీడా సామాగ్రిని బహుకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణికొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు , శివగంగ విజేతలను ఘనంగా సత్కరించారు.




# ప్రజావాణి ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

వసతి గృహాల ఇన్స్పెక్షన్ అధికారులు నివేదికలు సమర్పించాలి
శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అందుకు అనుగుణంగా ముందుకు సాగాలి
జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**డోర్నకల్ /మరిపెడ జులై 27(నినాదం ):** ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, జిల్లాలోని అన్ని విభాగాల ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ అమలుకు యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో. అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డి.ఆర్.ఓ నాగలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్ ల తొ కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సంది మహబూబ్ రెడ్డి తనకు ఉన్న భూమిలో గల సర్వే నెంబర్ లో ఈ మధ్య జరిగిన భూభారతి డిజిటల్ సర్వేలో తొమ్మిది గుంటలు తక్కువగా చూపిస్తుందని, అట్టి భూమి సర్వేయర్ ద్వారా తిరిగి సర్వే చేపించి సరిచేసి ఇవ్వగలరని కోరారు. మహబూబాబాద్ పట్టణం సిగ్నల్ కాలనీ కి చెందిన శ్రీ రామ మౌనిక తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని, ఇందిరమ్మ ఇల్లు మొదటి జాబితాలో ఇల్లు మంజూరు అయింది కానీ రేషన్ కార్డు లేక పోవడంతో ఇందిరమ్మ ఇవ్వడానికి నిరాకరించారని రెండవ విడతలో నైనా ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన రుద్ర భాస్కర్ తన పాత పాస్ బుక్ లోని పట్టా భూమి ప్రభుత్వం జారీ చేసిన కొత్త పాస్ బుక్ నమోదుకు వచ్చే సరికి మొత్తం భూమి రికార్డు కాలేదని కార్యాలయాల చుట్టూ ఎంత తిరిగిన సమస్యకు పరిష్కారం అవట్లేదని దయచేసి తన సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో (184) దరఖాస్తులు వచ్చిన వినతులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారం కొరకు ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విభాగాల వారు ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో నిర్వహించబోయే కార్యక్రమాలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు శాఖలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలని తద్వారా నిర్దిష్టమైన వేగమైన పనులు జరుగుతాయని అట్టి నివేదికలను ప్రతి తనకు సమర్పించాలని కలెక్టర్ సంబంధిత విభాగాలను ఆదేశించారు, ముఖ్యమంత్రి గ్రీవెన్స్, జిల్లా గ్రీవెన్స్ లపై శాకలవారీగా సమీక్ష సమావేశం నిర్వహించి దరఖాస్తుదారులకు వెంటనే లిఖితపూర్వకంగా సమాధానాలు పరిష్కారాలు చూపాలని, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, వారు క్షేత్రస్థాయిలో పిల్లలతో కలిసి భోజనం చేసి వసతి గృహం లోని సౌకర్యాలను తనిఖీ చేయాలని అట్టి నివేదికను వెంటనే తమకు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

MANAPPURAM HOME FINANCE LTD.
రిజిస్టర్డ్ ఆఫీస్: 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి టెంపుల్ దగ్గర, చేర్పు- త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567

### డిమాండ్ నోటీసు

భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారిచే జారీ చేయబడిన నోటిఫికేషన్ నెం. S.O. 3466 (E) తేది: 18 డిసెంబర్, 2015తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట చట్టముగా వ్యవహరించబడును) లోని సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్(1)లోని క్లాజ్ (m)లో సబ్-క్లాజ్ (iv) పరిధిలో ఆర్థిక సంస్థగా మరియు కంపెనీల చట్టము 1956 క్రింద నమోదైన కంపెనీగా భారత దేశములోని వివిధ ప్రదేశాల వద్ద బ్రాంచ్‌లు మరియు నమోదిత కార్యాలయము, 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి టెంపుల్ దగ్గర, చేర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567. మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకమీదట 'MAHOFIN'గా వ్యవహరించబడును) వారి అధీకృత అధికారి ఇతర విషయాలతో పాటు నివాస యూనిట్ల కొనుగోలు మరియు/లేదా నిర్మాణం కొరకు ముందస్తు రుణముల యొక్క వ్యాపారమును చేపట్టినారు. దిగువ తెలిపిన చార్ట్‌లోని కాలమ్ నెం.2లో తెలిపిన విధముగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు MAHOFIN నుండి రుణమును పొందినారు. SARFAESI చట్టము క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన MAHOFIN సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడు సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ నోటీస్‌లలో తెలిపిన మొత్తము మరియు దానిపై తదుపరి వడ్డీతో సదరు నోటీస్ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీస్ జారీ చేసినారు. కానీ నోటీసులు వివిధ కారణముల వలన వారిలోని కొందరికి అందజేయబడలేదు. అదనముగా దిగువ తెలిపిన సదరు రుణగ్రహీతల సమాచార ప్రయోజనార్థం కొరకు సదరు రుణగ్రహీతలకు ఈ బహిరంగ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

| క్ర. సం. | రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/ LAN/ బ్రాంచ్ | ఇంటరెస్ట్ కల్పించబడిన వాటికి సంబంధించి సెక్యూర్డ్ ఆస్తుల వివరణ | ఎన్‌పిఎ తేది | నోటీస్ పంపిన తేది & బకాయి మొత్తం |
|---|---|---|---|---|
| 1 | జల్ల లలిత, బానోత్ సుధాకర్, జీడికంటి పుష్పలీల/ NHL01110012480/ తిరుమల టాకీస్ క్రాస్ రోడ్ | తెలంగాణ-పిన్: 506112, మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం గ్రామం మరియు మండలం, గ్రామ పంచాయతీ దగ్గర, 133.33 చ.గ.ల విస్తీర్ణము, ఇ.నెం. 2-165/1 అందులోని కట్టడాల స్థలంలో బిల్టప్ ఏరియా 408 చ.అ.లు ఆర్‌సిసి యావత్తు. సరిహద్దులు: తూర్పు: దుర్గం వెంకన్న ఇల్లు, పడమర: కాలువ, దక్షిణం: వల్లకొండ మదార్ స్థలం, ఉత్తరం: జీపీ రోడ్. | 18.06.2026 | 13-07-2026 & Rs. 226572/- |
| 2 | పులిపాక పున్నమ్మ, పులిపాక సురేష్, పులిపాక మౌనిక/ MHL01090024629/ కరీంనగర్ | తెలంగాణ-పిన్ 505162, రిజిస్ట్రేషన్ జిల్లా కరీంనగర్ మరియు సబ్ జిల్లా పెద్దపల్లి పరిధిలో పెద్దపల్లి జిల్లా, ఓదెల మండలం, ఉప్పరపల్లి గ్రామం, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలోని 518.22 చ.గ.లు లేదా 433.28 చ.మీ.లకు సమానమైన విస్తీర్ణము ప్రస్తుత ఆర్‌సిసి రూఫ్ ఇంటి ప్లింత్ ఏరియా 339.50 చ.అ.లు & ఎసి షీట్ రూఫ్ ఇంటి ప్లింత్ ఏరియా 315.25 చ.అ.లు ఆర్‌సిసి రూఫ్ ఎసిసి షీట్ రూఫ్ ఇ.నెం. 3-1/ఎ (అసెస్‌మెంట్ నెం. 200) గల ఆస్తి యావత్తు. సరిహద్దులు: తూర్పు: పి. రేఖ ఖాళీ స్థలం, పడమర: 10' వెడల్పు రోడ్డు, దక్షిణం: ఎం. రాజ్‌కుమార్ ఇల్లు, ఉత్తరం: 10' వెడల్పు రోడ్డు. | 20.06.2026 | 13-07-2026 & Rs. 529296/- |
| 3 | గుగులోతు రాము, గుగులోతు నాగరాజు, బానోత్ రాము/ MLAP0112054769/ ఖమ్మం | తెలంగాణ, పిన్: 506112, వరంగల్ మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మున్సిపాలిటీ, సబ్ స్టేషన్ తండాలోని 126.66 చ.గ.లు ఇ.నెం. 3-25/1 యావత్తు. సరిహద్దులు: తూర్పు: జి. రేష్మి ఇల్లు, పడమర: ఆర్&బి రోడ్, దక్షిణం: బి. పవన్ కళ్యాణ్ ఇల్లు, ఉత్తరం: జిపి రోడ్. | 23.06.2026 | 13-07-2026 & Rs. 538526/- |

కావున ఈ నోటీస్ ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ నోటీస్ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీతకు వ్యతిరేకముగా పైన చూపించిన విధముగా రావల్సిన పూర్తి బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించమని పైన తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరడమైనది. పూర్తి బకాయి మొత్తము మరియు తదుపరి వడ్డీతో సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత చెల్లించుటలో విఫలమైతే, MAHOFIN వారు పైన తెలిపిన విధముగా ఆస్తులపై సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చేయుట కొరకు సెక్షన్ 13(4) క్రింద ముందుకు సాగెదరు, చట్టము మరియు అందులో ఏర్పడిన రూల్స్ క్రింద పేర్కొన్న విధముగా ఇతర పద్ధతులలో నోటీస్ సర్వీస్ కొరకు చర్యలు తీసుకొనబడును. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(8)లో వివరించిన విధముగా అమ్మకం రూపములో బదిలీ కొరకు ప్రైవేట్ ఒప్పందం లేదా బహిరంగ వేలం కొరకు నోటీస్ ప్రచురణ తేదీలోగా ఏ సమయంలోనైనా పూర్తి బకాయి మొత్తము మరియు వ్యయాలు, చార్జీలు, ధరలు & MAHOFIN వారిచే చెల్లించిన ఖర్చులతో మీరు చెల్లించినచో సదరు తనఖాను విడిపించుకొనగలరని మీకు ఈ నోటీస్ ద్వారా తెలియజేయడమైనది. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(13) ప్రకారం అమ్మకం, లీజు లేదా వేరే ఇతర పద్ధతులలో సెక్యూర్డ్ ఆస్తులను బదిలీ చేయుట మరియు/లేదా వ్యవహరించుట నుండి మీరు నిషేధించబడినారని గమనించగలరు.

తేది: 28.07.2026, ప్రదేశం: తెలంగాణ
సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్



## పుట్టినరోజు వేడుకలు... బంగారు భవిష్యత్‌కు ఆలంబనలు

ప్రేమ భావంతో ముందు కెళ్తే అన్ని విజయాలే
ఘనంగా నితిన్ ముదిరాజ్ పుట్టినరోజు వేడుకలు
మాజీ మంత్రి.. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



**జవహర్ నగర్, జులై 27 (నినాదం):** పుట్టినరోజు వేడుకలు బంగారు భవిష్యత్తుకు ఆలంబనలు అని ప్రేమ భావంతో ముందుకెళ్తేనే జీవితంలో అన్ని విజయాలు మన దరికి చేరుతాయని మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ తనయుడు నితిన్ ముదిరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మాజీ మంత్రి మల్లారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన నితిన్ ముదిరాజుని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారితో మల్లారెడ్డి మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు బంగారు భవిష్యత్తునకు ఆలంబనలని ఏదైనా ప్రేమ భావంతో ముందుకెళ్తేనే విజయాలు మన దరికి చేరతాయి అన్నారు. మనిషి జీవితంలో కష్టపడినప్పుడే విజయాలు తనంతట తానే వస్తాయని నితిన్ ముదిరాజ్ ఇలాంటి మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకొని జీవితంలో ఉన్నత స్థానంలోకి ఎదగాలని దీవించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల ముదిరాజు మాట్లాడుతూ పెద్దల ఆశీర్వాదంతో తన కుమారుడు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి జవహర్ నగర్ ప్రజలకే కాక జిల్లా ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం దక్కాలని ఆ భగవంతుని వేడుకున్నట్టు తెలిపారు. మాజీ మంత్రివర్యులు మల్లారెడ్డి ఆశీస్సులు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొండల ముదిరాజ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌జీ టీవీ ఎన్‌పిఐ 2026 శ్రేణి ఆవిష్కరణ




**హైదరాబాద్ బ్యూరో , జూలై 27(నినాదం) :** ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తన నూతన టీవీ ఎన్ పి ఐ 2026 శ్రేణిని హైదరాబాద్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ఆవిష్కరించింది. ఏఐ ఆధారిత స్మార్ట్ ఫీచర్లు, అత్యుత్తమ చిత్ర నాణ్యత, అధునాతన సౌండ్ టెక్నాలజీ, తదుపరి తరం గేమింగ్ సామర్థ్యాలతో రూపొందిన కొత్త టీవీ మోడళ్లను ఈ సందర్భంగా పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎల్‌జీ రీజినల్ మార్కెటింగ్ మేనేజర్ కె. హరికృష్ణన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ బిజినెస్ హెడ్ హబీబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతతో ఈ శ్రేణిని రూపొందించినట్లు హరికృష్ణన్ తెలిపారు.

## వృద్ధుల సంరక్షణకు మూడు కొత్త సేవలు ప్రారంభించిన అన్వయా కిన్ కేర్

**హైదరాబాద్ బ్యూరో, జులై 27 (నినాదం) :** అన్వయా కిన్ కేర్ తన 10వ వార్షికోత్సవం సందర్భంగా 'కృతజ్ఞ' పేరుతో కార్యక్రమం నిర్వహించి వృద్ధుల కోసం మూడు కొత్త సేవలను ప్రారంభించింది. క్యూరాపాడ్ నొప్పి నివారణ పరికరం, 3000 బీసీ థెరప్యూటిక్స్ ఆరోగ్య ఉత్పత్తులు, పుణ్యక డిజిటల్ ఆధ్యాత్మిక సేవలను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా శౌర్య పురస్కారాలు, పద్మశ్రీ గ్రహీతల కుటుంబాలను సత్కరించి, జీవితకాల ఉచిత అత్యవసర స్పందన సేవలను ప్రకటించింది. ప్రస్తుతం అన్వయా దేశంలోని 38 నగరాల్లో 1.5 లక్షలకుపైగా వృద్ధులకు సేవలు అందిస్తోంది.




## రహదారి నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కుత్బుల్లాపూర్, జులై 27 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రధాన రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొంపల్లి--బహదూర్‌పల్లి రహదారి విస్తరణకు రూ.130 కోట్లు, గండిమైసమ్మ--మియాపూర్ రహదారి నిర్మాణానికి రూ. 140 కోట్లు, మొత్తం రూ. 270 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం స్థానిక పార్టీ ముఖ్యఅతిలతో కలిసి పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా అటవీ శాఖ అనుమతులు లభించక ఈ రహదారి పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అవసరమైన అనుమతులను వేగంగా సాధించి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక కృషితో ఈ రహదారి అభివృద్ధి పనులు వేగవంత మయ్యాయని మంత్రి తెలిపారు. అనంతరం బౌరంపేట్ రోడ్డులో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ కమిషనర్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మీ, టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి, రహదారి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం కొంపల్లి, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, బాచుపల్లి, మియాపూర్ ప్రాంతాల మధ్య ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

equitas Small Finance Bank
నమోదిత కార్యాలయం: నెం. 769, స్పెన్సర్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-2, అన్నా శాలై, చెన్నై - 600002.

### స్వాధీనతా ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (1)) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ **ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్,** కంపెనీల చట్టం 1956 క్రింద మరియు కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 2 (20)ను అనుసరించి, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949 క్రింద సెక్షన్ 5(సి) ను అనుసరించి ఇన్‌కార్పొరేట్ అయిన కంపెనీ, నమోదిత కార్యాలయం 4వ అంతస్తు, ఫేజ్-2, స్పెన్సర్ ప్లాజా, నెం. 769, అన్నాశాలై, చెన్నై - 600002 మరియు భారత దేశ వ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో బ్రాంచ్ ఆఫీస్‌లు కలిగి ఉన్న కంపెనీ యొక్క అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు **తేది: 16.05.2026తో** జారీచేసిన **డిమాండ్ నోటీసు** ప్రకారం **రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారులు/ తనఖాదారులైన 1. శ్రీమతి దుర్గా నార్లా, 2. శ్రీ ఆర్. శివప్రసాద్, (రుణం నెం. 700008918891 & 700008918909)** వారిని నోటీసులో తెలిపిన బకాయి మొత్తము **తేది: 15.05.2026 నాటికి రూ. 75,78,922/- (రూపాయలు డెబ్బై ఐదు లక్షల డెబ్బై ఎనిమిది వేల తొమ్మిది వందల ఇరవై రెండు మాత్రమే)** ను ఒప్పందాల ప్రకారం తదుపరి వడ్డీ, అపరాధ వడ్డీ, చార్జీలు, ఖర్చులు, మొ॥లగు వాటితో సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

సదరు రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదార్లు/తనఖాదారులు రుణ బకాయి మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ 8 తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ ఈ క్రింద వివరించబడిన ఆస్తిని క్రింది సంతకందారు స్వాధీనం చేసుకోవడమైనదని ప్రత్యేకించు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/హామీదార్లు/తనఖాదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటలో లభ్యతనందు గల సమయమునకు సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 ఉప సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించవలసిందిగా రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదార్లు/ తనఖాదారులను కోరడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/హామీదార్లు/తనఖాదారులకు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు ఒకవేళ జరిపినట్లయితే **ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** వారికి రుణగ్రహీతల నుండి రావల్సిన బకాయి మొత్తము మరియు దానిపై వడ్డీ క్రింద వర్తించును.

#### సెక్యూర్డ్ ఆస్తుల షెడ్యూల్

**శ్రీమతి దుర్గా నార్లా కు స్వంతమైన నివాస ఆస్తి :** తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మేడిపల్లి మండలం, బోడుప్పల్ మున్సిపాలిటి పరిధిలో బోడుప్పల్ గ్రామం వద్దగల ఆర్‌సిసి గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 740 చ.అ.లతో 130 చ.గ..లు లేదా 108.68 చ.మీ.ల. మొత్తం విస్తీర్ణం సర్వే నం. 206 నుండి 210, 212 లో ప్లాట్ నం. 153పై నం. 8-41/23/1 గల గృహము యావత్తు. **సరిహద్దులు: ఉత్తరము:** ప్లాట్ నెం. 152, **దక్షిణం:** పొరుగు వారి భూమి, **తూర్పు:** 25'-0" వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నం.118. ప్రస్తుత మరియు భవిష్యత్తు రెండింటిలో భూమికి కలుపబడిన లేదా భూమికి జతచేయబడిన, దేనికైనా శాశ్వతంగా భిగించబడిన అన్ని భవనాలు మరియు నిర్మాణాలు మరియు దానిలోని దానికి అనుబంధంగా ఉన్న అన్ని అనుభోగ హక్కులు/ మామూలు హక్కులతో కలిపి ఉంటుంది.

**తేది: 27.07.2025**
**ప్రదేశము:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, విజయనగరం జిల్లా,
అధీకృత అధికారి
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


# మీరు ఏం చేస్తారో చేయండి.. మా పెద్దిని కాపాడండి

- వైద్యులకు చేతులెత్తి నమస్కరించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- దేవుడున్నాడు.. డాక్టర్లున్నారు అన్నీ సవ్యంగానే జరుగుతాయి
- గుండె చెదరొద్దు.. ధైర్యంగాఉండండి
- పెద్ది సుదర్శన్ రెడ్డి భార్యా పిల్లలు, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పిన కేసీఆర్





**నర్సంపేట, జులై 27 (నినాదం) :** తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి సికింద్రాబాద్ యశోదా దవాఖానకు చేరుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అందుతున్న చికిత్స గురించి డాక్టర్లతో వాకబు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి చికిత్స అందుతున్న ఐసీయూ వార్డుకు చేరుకొని, డాక్టర్లతో కలిసి అక్కడ పెద్దికి అందుతున్న చికిత్స విధానాన్ని పరిశీలించారు. దాదాపు అరగంట సేపు అక్కడే నిలుచని డాక్టర్లతో చికిత్స అందుతున్న తీరును గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కాగా పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యుత్తమ చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని గుండె ఊపిరితిత్తులు మిగతా అవయవాలు అన్ని పనిచేస్తున్నాయని కాకపోతే కొంత బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని అందుకు మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు కెసిఆర్ కు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో, స్పష్టమైన నిర్దిష్ట సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. కాగా ఖర్చుకు వెనకాడకుండా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం, కుటుంబ సభ్యుల వద్దకు చేరుకున్న కేసీఆర్, భరోసాను, ధైర్యాన్ని అందించారు. డాక్టర్ల కృషితో, దేవుని దయతో, ప్రజల ఆశీర్వాదంతో పెద్ది కోలుకుంటాడని కేసీఆర్ విశ్వాసాన్ని ప్రకటించారు. ఆందోళన చెందవద్దని భార్యాపిల్లలకు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి గుండె ధైర్యం నింపారు. అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. దాదాపు 45 నిమిషాల పాటు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన కేసీఆర్ ఈసందర్భంగామాట్లాడుతూ "మీరేం చేస్తారో చేయండి కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ డాక్టర్లకు కేసీఆర్ చేతులెత్తి నమస్కరించారు. ఎప్పటికప్పుడు ఎంఆర్ఐ తదితర అవసరమైన పరీక్షలు చేస్తూ, డాక్టర్ల బృందం చేత సమావేశాలు నిర్వహించుకుంటూ నిర్ణయాలు తీసుకుంటూ, ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచే దిశగా అత్యున్నత చికిత్స అందిస్తున్నామని, డాక్టర్లు తెలిపారు. తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, దవాఖాన డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండి ఏఎస్ రావు, జెఎస్ రావు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు భార్య స్వప్న, కొడుకు నిదర్శన్ రెడ్డి, కూతురు ధర్మిష్ట, అన్నలు శ్రీనివాసరెడ్డి, రవీందర్ రెడ్డి, చెల్లెలు స్వాతి తదితరులతో మాట్లాడిన కేసీఆర్ ధైర్యాన్ని భరోసాను నింపారు. ఈ సందర్భంగా కేసీఆర్ తో పార్టీ ముఖ్యులు మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు మాలోత్ కవిత, బాల్క సుమన్, గ్యాదరి బాలమల్లు, సతీష్ రెడ్డి, రజిని సాయి చంద్, పల్లె రవికుమార్, రాజాం యాదవ్, వాసుదేవరెడ్డి, గజ్జెల నగేష్, చిరుమల్ల రాకేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విత్తన విక్రయాలు



**కొల్చారం, జులై 27 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టు కొని రాష్ట్ర ప్రజల కు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టినది. ఎల్ నినో పరిస్థితుల కారణంగా ఏర్పడిన వర్షాభావం వల్ల వరిసాగు తగించి , ఆ స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు వీలుగా నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నేటి నుంచి ఈ నెల 29 వరకు మండల కేంద్రాల్లో విత్తనాలను విక్రయించనుంది. మొక్కజొన్న, కందులు, సజ్జ, కూరగాయలు తదితర విత్తనాలను అందుబాటులో ఉంచింది. రైతులంతా కొనుగోలు చేశాక బిల్లులు తీసుకోవాలి. ఈ రోజు కూల్చారం రైతు వేదికలో విత్తన మేళా కండక్ట్ చేయడం జరిగింది 28.7.26 రంగంపేట్ పాక్స్ వద్ద 29.8.2026 యేనగాండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుపబడును కావున రైతులు అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని అరుతడి పంటలు వైపు మొగు చూపాలి. కొల్చారం మండలం ఏవో శ్వేతా కుమారి తెలిపారు.

## యాగాల ద్వారా ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయి

### యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి దంపతులు



**కల్వకుర్తి జులై 27 (నినాదం):** కల్వకుర్తిలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వ శాంతి మహాయాగ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య 9 రోజు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళ శాసనాల మేరకు నిర్వహిస్తున్న ఆయుధ చండీ, అతిరుద్ర మహాయాగంలో భాగంగా పలు విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు శ్రీ రుద్ర సహిత మృత్యుంజయ పాశుపతస్రా హోమములు చంద్రగ్రహ హోమములు నిర్వహించారు. కార్యక్రమంలో మ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాధవి దంపతులు హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, యాగాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలంటూ రైతులు పాడి పంటలతో చల్లగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. అని నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు అన్నారు. సాయంత్రం 5 గంటలకు శత సహస్ర లక్ష పార్థీవలింగా లకు పంచామృత మరియు విశేష అభిషేక క్రమర్చనలు నిర్వహించడం జరిగింది. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని విశ్వశాంతి, లోకక్షేమం, కుటుంబ సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. ఈ మహాయాగ మహోత్సవాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు కోరారు. కార్యక్రమంలో, మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు,ఎస్సీ ఎస్టీ కమిషన్ జిల్లా సభ్యులు జిల్లెల్ల రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, రమాకాంత్ రెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకులు రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, గోవింద్ కృష్ణయ్య, సురేందర్ రెడ్డి, సురేష్, దొరమోని గణేష్, భాస్కర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మత్స్యకారులపై దాడి హేయమైన చర్య..

### నర్సాయిపల్లి సర్పంచును సస్పెండ్ చేయాలి
### నాగర్ కర్నూల్ జిల్లా మత్స్యకార సొసైటీ చైర్మన్ వాకిటి ఆంజనేయులు
### కేసరి సముద్రం అధ్యక్షుడు తెప్ప బాబు





**నాగర్ కర్నూల్ జులై 27 (నినాదం) :** నాగర్ కర్నూల్ మండలం నర్సాయపల్లి గ్రామంలో మత్స్యకారులపై దాడి చేయడం హేయమైన చర్య అని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు మత్స్యకార సొసైటీ చైర్మన్ వాకిటి ఆంజనేయులు నాగర్ కర్నూల్ కేసరి సముద్రం అధ్యక్షుడు తెప్ప బాబు ఆధ్వర్యంలో మత్స్యకారులు సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ మండలం గుడిపల్లి రిజర్వాయర్లో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ పొంది గుడిపల్లి, గౌరీదేవి పల్లి గ్రామాలకు చెందిన 171 మంది మత్స్యకారులతో సొసైటీ ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నామని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన ఇతర కులస్తులు రిజర్వాయర్ లో చేపల వేట చేస్తున్నారని వారిని అడ్డుకోబోయిన మత్స్యకారుల పై మారునాయధాలతో దాడులు చేసి భయభ్రాం తులకు గురి చేస్తూ జీవనోపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గ్రామస్తులు గత మూడు సంవత్సరాలుగా అడపాదడపా మా పై దాడులకు పాల్పడు తూనే ఉన్నారని కానీ నర్సాయిపల్లి గ్రామ సర్పంచ్ మత్స్యకారుల పై చేయి చేసుకోవడం సమంజసం కాదని ప్రజా ప్రతినిధిగా ఉంటూ దాడులకు పూనుకోవడం సరైనది కాదని సర్పంచ్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గుడిపల్లి రిజర్వాయర్లో మత్స్యకారుల హక్కులను కాపాడాలని కలెక్టరేట్ ఏ వో కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
## పాఠశాలలో మెడికల్ కిట్ల పంపిణీ



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 27 (నినాదం) :** శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. తిర్మన్ పల్లి, నల్లవెల్లి, సిర్నాపల్లిలోని జిల్లా ప్రభుత్వ పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెడికల్ కిట్లను అందజేశారు. పాఠశాలలో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సను అందించేం దుకు వీలుగా మెడికల్ కిట్స్ లను అందజేస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బృందం నరోత్తం రెడ్డి, ముత్యం, నరేష్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## నీటి వనరులను సంరక్షించుకోవాలి

### తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా చర్యలు
### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి.
### పీఎం ఇంటర్నె షిప్ పథకంపై అవగాహన అవసరం.



**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల బ్యూరో జులై 27( నినాదం):** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఉన్న నీటి వనరులను సంరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఐడిఓసి సమావేశపు మందిరంలో సోమవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ సమన్వయ సమావేశం, మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో వాటర్ మరియు శానిటేషన్ మిషన్ సమీక్ష సమావేశం, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్నె షిప్ పథకం గురించి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్, శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బాలల సంరక్షణకు ముందుండాలన్నారు. ఈనెల 29న ఎంపీడీవోలు చైర్మన్ గా తమ మండలాల్లో ఎల్ నినో, జలసిరి, విబిజి రాంజీ, విద్య, తదితర అంశాలపై మండల ప్రజా పరిషత్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి ఇంటర్నె షిప్ పథకంపై నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ఫలితంగా వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, శిక్షణ సమయంలో స్టైఫండ్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పథకానికి సంబంధించిన గోడపత్రికలను పలువురు జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, డిడబ్ల్యూఓ సునంద, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, మిషన్ భగీరథ ఈఈ పరమేశ్వరి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోసూరి రమేష్ గౌడ్ మృతి మాకు తీరని లోటు

### నివాళులర్పించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం జులై 27(నినాదం ):** సుడా మాజీ డైరెక్టర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కోసూరి రమేష్ గౌడ్ మృతి పట్ల రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆవేదన చెందారు . రమేష్ మృతి కాంగ్రెస్ పార్టీకే కాక తనకు వ్యక్తి గతంగా తీరనిలోటని తెలిపారు .ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రి టౌన్ ఏరియా పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్అ ధ్యక్షతన కోసూరి రమేష్ స్వగృహంలో సంతాప సభ జరిగింది . సంతాపసభ రమేష్ మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతిని , సంతాపాన్ని వ్యక్తం చేసింది . ఖమ్మం నగరంలోని కోసూరి స్వగృహానికి వెళ్లి నివాళులర్పించిన తుమ్మల మాట్లాడుతూ రమేష్ఆది నుంచి తన వెంటే ఉంటూ మంచి రాజకీయ నాయకుడిగా పేరుందారన్నారు . నిరాడంబర జీవితం గడిపిన రమేష్నిగర్వి అన్నారు. రమేష్ గౌడ్ మరణం పార్టీకి , స్థానిక ప్రజలకు తీరని లోటని ఆయన పేర్కొన్నారు . రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని

ఈ కష్ట సమయంలో భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు గుండె నిబ్బరాన్ని , మనో ధైర్యాన్ని ప్రసాదించాలని తుమ్మల ఆకాంక్షించారు. మంత్రి తుమ్మలతో పాటు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పలువురు నాయకులు, బంధు మిత్రులు అందరు లిరమేష్ గౌడ్ సంతాప సభలోలి ప్రసంగించారు . లిరమేష్ తోలి తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు . లిరమేష్లి మృతి తమ అందరికి తీరని లోటు తెలిపారు . ఈ కార్యక్రమంలో లిడిసిసి ఖమ్మం కార్పోరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా , మాజీ మేయర్ పూనకొల్లు నీరజలి మరియు లికాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దలి ఎత్తున పాల్గొన్నారు .

## సుజాతనగర్ మండల సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి

ప్రజా అవసరాలకు అనుగుణంగా
మౌలిక వసతుల కల్పిస్తున్నాం
కొత్తగూడెం నియోజకవర్గాన్ని
మోడల్‌గా తీర్చిదిద్దుతాం
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
రూ.1.95కోట్ల అభివృద్ధి పనులకు
ఎమ్మెల్యే శంకుస్థాపన




**కొత్తగూడెం,జులై27(నినాదం):** కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు తెలిపారు. సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్‌లో రూ. 1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుజాతనగర్ కార్పొరేషన్ ప్రాంతంగా మారిన తర్వాత మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రతీ గ్రామంలో తాగునీరు, వీధిదీ పాలు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సుజాతనగర్ నుండి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పా టుకు నిధులు అందుబాటులోకి తెచ్చామన్నా రు. సుజాతనగ ర్‌లో మున్సిపల్ సబ్ డివిజన్ కార్యాలయ ఏర్పాటుతోపాటు, సింగభూపాలెం చెరువుకట్ట అభివృద్ధి కోసం రూ. 5.5 కోట్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ (న్యాక్) కేంద్రం మంజూ రైందని, అదేవిధంగా నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొంది స్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రగతికి అవసరమైన నిధుల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజాసం క్షేమమే ధ్యేయంగా పనులు వేగవంతం చేస్తా మని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సొసైటీ అధ్యక్షులు మండే హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, తహసీ ల్దార్ కృష్ణప్ర సాద్, ఎంపీడీఓ భారతి, ఏఓ నర్మద, విద్యుత్ శాఖ ఏఈ కిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు భూక్య దస్రు, మండల కార్య దర్శి కుమారి హనుమంత రావు, నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు తాళ్ల వెంక టేశ్వర్లు, తాళ్లూరి పాపారావు మండల నాయ కులు వీర్ల మల్లేష్, దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు

### ఇద్దరు నిందితుల అరెస్ట్,రిమాండ్




**నారాయణపేట ప్రతినిధి, జులై 27, (నినాదం):** మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళ అదృశ్యం (మిస్సింగ్) కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. అప్పులు తీర్చుకోవడానికి పరిచయం ఉన్న మహిళను దారుణంగా హత్య చేసి, ఆమె వద్ద ఉన్న సొత్తును అపహరించిన ఇద్దరు నిందితులతో పాటు, ఆ సొత్తును కొనుగోలు చేసిన మరొకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను ఎస్పీ డా. వినీత్ పత్రికా సమా వేశంలో వెల్లడించారు. ఈ నెల 15వన మద్దూరుకు చెందిన శాంతమ్మ (45) అనే మహిళ కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఆమె కదలికలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులతో కలిసి పలు ప్రాంతాల్లో తిరిగినట్లు సమాచారం సేకరించారు. విచారణలో భాగంగా పెద్దరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తిని, అతనితో పాటు ఉన్న భాస్కర్ అనే మరొక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారని తెలిపారు. నిందితులిద్దరికీ శాంతమ్మతో గత 5-6 ఏళ్లుగా పరిచయం ఉన్నట్లు వెల్లడైందన్నారు. నిందితులకు తీవ్రమైన అప్పుల భారం ఉండటంతో, వాటిని తీర్చుకోవడానికి శాంతమ్మను హత్య చేయాలని పథకం పన్నినట్టు తమ విచారణలో వెల్లడైందని తెలిపారు. పథకం ప్రకారం ఆమెను ఒక నిర్మానుష్య (ఏకాంత) ప్రాంతానికి తీసుకెళ్లి, స్కార్ఫ్‌తో ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి, నారాయణపేటలోని ఒక బంగారు షాప్‌లో విక్రయించి నగదు పొంది ఆ డబ్బును వాడుకున్నారని తెలిపారు. నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా చెరువు వద్ద పడేసిన శాంతమ్మ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించారు. హత్యకు గురైన మహిళ నుంచి దోచుకున్న సొత్తును, విక్రయించగా వచ్చిన నగదును పోలీసులు రికవరీ చేసి మీడియా ముందు ఉంచారు. హత్య చేసిన ఇద్దరు నిందితు లతో పాటు, ఎలాంటి రశీదు లేకుండా దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన షాపు యజమాని పై కూడా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన కొడంగల్, కోస్గి సిఐ, మద్దూరు ఎస్ హెచ్ ఓ, పర్యవేక్షించిన డీఎస్పీతో పాటు పోలీస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు. లిప్రజలకు, వ్యాపారులకు ఎస్పీ హెచ్చరికలు, సూచనలులి,మహిళలు ఎంతటి పరిచయస్తులైనా సరే, ఇంటి సభ్యులకు చెప్పకుండా నిర్మానుష్య ప్రాంతాలకు లేదా దూర ప్రాంతాలకు వెళ్లకూడదు. బయటకు వెళ్లే సమయంలో ఇంట్లో కచ్చితంగా సమాచారం ఇవ్వాలని సూచించారు. స్వర్ణకారులు, షాపుల యజమానులు బిల్లులు లేదా సరైన పత్రాలు లేకుండా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బంగారం, వెండి లేదా ఇతర వస్తువులను కొనుగోలు చేయకూడదు. అలా కొనుగోలు చేస్తే నేరంలో భాగస్వాములుగా భావించి చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గురుకుల పాఠశాలలపై ప్రభుత్వశీ నిర్లక్ష్యం వీడాలి..

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్.



**నాగర్ కర్నూల్ జులై 27 (నినాదం):** గురుకుల పాఠశాలలో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థంగా మారిందని ప్రమాదకర ఘటనలు నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.

రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో విద్యార్థులు తరచూ అస్వస్థకు గురవుతున్నారని ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి బాలుర గురుకుల పాఠశాలలో ఫ్యాన్ గుడిపడి విద్యార్థులు గాయాలయ్యాయన్నారు. ఇలా తరచూ సంఘటనలు చోటు చేసుకోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. జరిగిన సంఘటనలపై విద్యాశాఖ సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని అన్ని గురుకులాల పాఠశాలల్లో భవనాల భద్రత ఫ్యాన్లు విద్యుత్ వ్యవస్థ ఆహార నాణ్యత తాగునీరు పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని బీసీ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కార్ల నిరంజన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక సుధాకర్ శ్రీనివాసులు గంగోజి రాజు శిరీష జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### జలసిరిపై అవగాహన కల్పించిన
## సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి , (నినాదం)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జలసిరి కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తలకొండపల్లి ఎంపీడీవో సీతారామమ్మ మాట్లాడుతూ, వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, భూగర్భ జలాల సంరక్షణకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులు ఫార్మ్ పాండ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ త్రిలోక్య మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేసే ఆకుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ జిల్ల నాయకులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాఘవేందర్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌వోలు,బీఎల్ఏలు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


### మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ వెంకటరమణారెడ్డి



**గద్వాల ప్రతినిధి జులై 27 (నినాదం)** రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని గద్వాల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. సోమవారం అయిజ పట్టణంలోని (రాయచూరు రోడ్డు) ఉత్తనూర్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మార్గంలో వెళ్తున్న అన్ని వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల్లో ఏ వస్తువులు తీసుకెళ్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, తదితర వివరాల తెలుసుకొని అందుకు సంబంధించిన పర్మిట్ పత్రాలు పరిశీలించారు. అలాగే వాహనాలకు సంబంధించిన ఆర్సీ, ఇన్సూరెన్స్, పర్మిట్ల తోపాటు డ్రైవింగ్ లైసెన్స్ ను పరిశీలించారు. నిషేధిత వస్తువులు రవాణా చేయరాదని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలు వాహనంలో ఉండాలని సూచించారు. పత్రాలు సరిగా లేని 4 వాహనాలకు ఫైన్ విధించినట్లు తెలిపారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది నరసన్న గౌడ్ ఉన్నారు.

### అభివృద్ధి పనులకు నిధులు
## మంజూరు చేయండి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 27 (నినాదం) :** నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభి వృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సోమవారం హైదరాబాద్ లోని సచివాలయంలో కలిసి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందే వాడ వంతెన ( ఆర్ వోబీ) పొడిగింపు (అదనపు పనులు) చేయాలని కోరడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ రైల్వే లైను దాటడానికి విజయ థియేటర్, నాందేవాడ వంతెన వద్ద కేవలం రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయని ఈ నేపథ్యంలో సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద మరొక రైల్వే రన్వే ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రూ. 170 కోట్లు మంజూరు కావాలన్నారు. అలాగే నిజామాబాద్ లోని రేడియో స్టేషన్ నుంచి ముదక్ పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ. 30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగింది. అలాగే వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్ పల్లి, ఇందల్వాయి, భీంగల్ మీదుగా కమ్మర్ పల్లి వరకు 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను అందజేశారు.

### పాలమూర్ యూనివర్సిటీ
## వీసీపై ఫిర్యాదు



**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 27 (నినాదం):** విజన్ ఇండియా 2047ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పాలమూర్ యూనివర్సిటీకి నిధులు కేటా యించి , ఆదేశాలు జారీ చేసిన కూడా పట్టించుకోకుండా పాలమూర్ యూనివర్సిటీ ప్రాంగణం లో కాకుండా ఒక ప్రైవేటు ప్రాపర్టీ అయిన కన్హా శాంతివ నంకు మార్చడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తూ యుజిసి చైర్మన్, కేంద్ర విద్యా శాఖ మంత్రి లకు సోమవారం ఫిర్యాదు చేశారు. మహబూబ్ నగర్ కు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాన్హా శాంతివనానికి విజన్ ఇండియా కార్యక్రమాన్ని మార్చడం పట్ల అందుకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొంటూ ఆయన సోమవారం మెయిల్ ద్వారా జాతీయ స్థాయి అధికారులకు మంత్రులకు ఫిర్యాదులు అందించారు. విజన్ ఇండియా కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి తరలించడం , పాలమూరు యూనివర్సిటీ వీసీ వారి బృందం నిర్ణయం తీసుకోవడం వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లా యావత్తు ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్ని యుజిసి (యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్) చైర్మన్, కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహల్లాద జోషి కి ఈమెయిల్ ద్వారా పంపుతూ పాలమూరు ప్రజల నిరసనను తెలియ జేశారు. విజన్ ఇండియా కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లో పాలమూరు యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించాలని హర్షవర్ధన్ రెడ్డి పట్టుపట్టారు. లేకుంటే న్యాయ పోరాటం చేసేందుకైనా తాను సిద్ధమని ఆయన సూచించారు.

### ప్రతి ఇంట్లో ఇంకుడు
## గుంతలు నిర్మించుకోవాలి



**బోధన్ ప్రతినిధి, జులై 27: (నినాదం ):** బోధన్ మండలం ఏరాజ్ పల్లి గ్రామంలో బోధన్ డి ఎల్ పి ఓ నాగరాజు సోమవారం పర్యటించారు. గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ సోక్ పిట్(ఇంకుడు గుంతలు), బోరువెల్ రీఛార్జ్ పీట్స్, రైతుల పొలాలలో ఫారం పాండ్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలంటే నీటి సంరక్షణే ఏకైక మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ దాస్ గౌడ్, ఉప సర్పంచ్ పవన్, గ్రామ సెక్రటరీ సతీష్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 52 ఫిర్యాదులు: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.



**గద్వాల బ్యూరో (నినాదం):** ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహిం చిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం 52 ఫిర్యాదులు ప్రజల నుంచి వచ్చాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజావాణితో పాటు సీఎం ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల్లో పూర్తిస్థాయిలో పరిష్కారం కానందున సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అర్జీలు పెండింగ్ ఉండకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రహదారి అభివృద్ధి పనుల్లో భూ నిర్వాసితులకు

# ముందుగా నష్టపరిహారం చెల్లించండి

**రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి... గడువులోగా పూర్తి చేయండి: ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

మేడ్చల్ కలెక్టరేట్ జులై 27 (నినాదం): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొంపల్లి–బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్–గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు. సోమవారం కుత్బుల్లాపూర్ మండలంలోని కొంపల్లి–బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్–గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనులను పరిశీలించేందుకు విచ్చేసిన మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులలో భూనిర్వాసితులకు ముందుగా నష్టపరిహారం అందించాలని సైబరాబాదు కమీషనర్ సృజనకు



సూచించారు. అటవీ శాఖ అనుమతులు సాధించి, ప్రజల ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్తుశాఖ వారి పనులలో భాగంగా ఎలక్ట్రిక్ పోల్ షిఫ్టింగ్ ఎంత వరకు అయ్యాయని, మిగిలినవి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు పనుల నిరంతరాయ అమలుకు వీలు కల్పించేం



దుకు, దూలపల్లి, బహదూర్పల్లి గ్రామాలలో భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో వేగవంతం చేసి పూర్తి చేయాలని కొంపల్లి, దుండిగల్ డిప్యూటీ కమిషనర్ను ఆదేశించారు. అటవీ ప్రాంతంలో ఉన్న అన్ని విద్యుత్ స్తంభాలను ఆగస్టు 15వ తేదీలోగా తరలించే పనిని, హెచ్ఎండిఏ సహకారంతో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని టిజిఎస్పిడిసిఎల్ కు సూచించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి పూర్తయిన వెంటనే మిగిలిన రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి, సెప్టెంబర్ నెలాఖరులోగా మొత్తం రోడ్డు పని పూర్తయ్యేలా చూడాలని హెచ్ఎండిఏ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్ట్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవడం కోసం, ప్రతిపాదిత తుఫాను నీటి కాలువ యొక్క అలైన్మెంట్తో సహా వివరణాత్మక ప్రతిపాదనను సిద్ధం చేసి, వీలైనంత త్వరగా పరిశీలన నిమిత్తం సిఎంసి కమీషనర్ కు సమర్పించాలని హెచ్ఎండిఏ ఆదేశాలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకెష్ కుమార్, డిసిలు , ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, హెచ్ఎండిఎ, టిజిఎస్పిడిసిఎల్, అటవీ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాలను సోమ, శని, వారాలలో

# తప్పనిసరిగా తనిఖీ చేయాలి

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ జులై 27 (నినాదం): ప్రతి సోమవారం, శనివారం జిల్లా అధికారులు సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించాలి తనిఖీ వివరాలను 'ఎక్స్' సోషల్ మీడియా వేదికలో అప్‌లోడ్ చేసి శాఖలో ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ట్యాగ్ చేయాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు నాణ్యతతో అందేలా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. వసతి గృహాల తనిఖీలను కేవలం అధికారిక కార్యక్రమంగా కాకుండా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతి సోమవారం, శనివారం తప్పనిసరిగా ఆయా శాఖలకు కేటాయించిన వసతి గృహాలను జిల్లా అధికారులు స్వయంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, భోజనం, పరిశుభ్రత, భద్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల తనిఖీలపై జిల్లా అధికారులు సమర్పించిన నివేదికలను కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నివసిస్తున్న ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను పూర్తిస్థాయిలో పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం, విద్యాభివృద్ధి దృష్ట్యా వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని హెచ్చరించారు. వసతి గృహాల్లో ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందుతున్నదా లేదా అనే విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. వంటశాలల పరిశుభ్రత, నిల్వ ఉంచిన ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి స్వచ్ఛత, వంట చేసే సిబ్బంది పరిశుభ్రత, భోజన శాల నిర్వహణ వంటి అంశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు, పడకలు, పరుపులు, కిటికీలు, భద్రతా ఏర్పాట్లు, ప్రహరీ గోడలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అన్ని మౌలిక సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వాటిని వెంటనే సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి తనిఖీ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. చదువుకు అనుకూలమైన వాతావరణం, రాత్రి వేళల్లో విద్యుత్ సౌకర్యం, గ్రంథాలయం, అధ్యయన గదులు, క్రీడా సామగ్రి, ఆరోగ్య సేవలు, అత్యవసర వైద్య సౌకర్యాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా అధికారులకు తెలియజేసే విధంగా విశ్వాసాన్ని కల్పించాలని కలెక్టర్ అన్నారు. వసతి గృహాల తనిఖీలు నిర్వహించిన అనంతరం సంబంధిత జిల్లా అధికారులు సందర్శనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోటోలు, గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను ప్రతి జిల్లా అధికారి తమ అధికారిక 'ఎక్స్' (X) సోషల్ మీడియా ఖాతాలో తప్పనిసరిగా అప్‌లోడ్ చేసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్ అధికారిక ఖాతాకు ట్యాగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనివల్ల తనిఖీల్లో పారదర్శకత పెరగడమే కాకుండా, ప్రతి వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. తనిఖీలను కేవలం రికార్డులకే పరిమితం చేయకుండా, ప్రతి సందర్శన ఫలితాలు విద్యార్థుల జీవితాల్లో కనిపించేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. సమస్యలను గుర్తించి నివేదికలు సమర్పించడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారం జరిగే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం జిల్లా యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చిన్నయ్య, దేవ సహాయం , జిల్లా రెవిన్యూ అధికారి పాండు ,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజి మార్కెట్‌లో భారీ వృక్షం కూల్చివేత

యాదాద్రి భువనగిరి జూలై 27 నినాదం : రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం కోసం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రతిష్టాత్మంగా ప్రభుత్వ స్థలాలలో మొక్కల పెంపకం ప్రాధాన్యత కల్పిస్తున్న పట్టణంలో మాత్రం పెరిగిన చెట్లకు రక్షణ లేకుండా పోతుంది. భువనగిరి మునిసిపాలిటీ లోని గంజి మార్కెట్ లో రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ప్రత్యేక మార్కెట్ వ్యవస్థను సుమారు ఐదు ఎకరాలు స్థలంలో పశువులకు నీళ్ల తొట్లు, రైతులకు, హమాలిలకు విశ్రాంతి గదులు, మార్కెట్ వచ్చే రైతులకు నీడ చెట్లు నాటి ప్రభుత్వాలు ప్రత్యేకంగా పర్యావరణం కాపాడడం కోసం చెట్ల పెంపకం చేసింది. రైతులకు మరియు పశువులకు నీడనిచ్చే వేప చెట్లు పెంపకం చేసింది. నాడు పెట్టిన చెట్లు మహా వృక్షాలు గా పెరిగి నేడు ఎండ నుండి ఉపశమనానికి చెట్లు నీడతో పాటు గాలినిస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్ యార్డ్ చెట్లను కాపాడాల్సిన అధికారులు చూసి చూడనట్లుగా వదిలివేయడం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. గంజి మార్కెట్లో ఉన్న ఆనవాలు ఒక్కొక్కటి కనుమరుగవుతున్నాయి. ఇంటి యజమానులు మరియు కమిషన్ ఏజెంట్లు రాజకీయ నాయకుల అండదండలతో చెట్లను కూల్చే పనిగా పెట్టుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజ్ ఏరియాలో 50 సంవత్సరాల పైబడి చల్లని నీడనిచ్చే వేప చెట్టు గొడ్డలి కాటుకు రంపం కోతకు కన్నీరు తప్పలేదు. గంజ్ ఏరియాలో చెట్టు అనేది భవిష్యత్ తరాలకు చెట్టు చూడడం అనేది ఇక గతమే. అసలు కూల్చిన వేపచెట్టు ప్రైవేటు వ్యక్తి చెందినదా....? మార్కెట్ కమిటీ ప్రభుత్వానికి చెందినదా...? అనే సంశయము గంజిలో అనుమానం వ్యక్తపరుస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వ చెట్టు అయి ఉండి విద్యుత్తు సరఫరా గృహానికి ప్రజలకు అంతరాయాలు గురిచేస్తే వాల్టా చట్టం ప్రకారం సంబంధిత శాఖల ద్వారా విచారణ జరిపి పత్రిక ప్రకటనలో టెండర్ ప్రక్రియ ద్వారా చేపట్టి చెట్టును తొలగించాల్సి ఉంటుంది. టెండర్ లో పాల్గొన్న వ్యక్తులకు ఎవ్వరికి అలాట్ అవుతుందో ప్రభుత్వానికి టెండర్ పాడిన పాట మొత్తం పూర్తిగా డబ్బులు ప్రభుత్వానికి చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కూల్చి వేసే సమయంలో ఎలాంటి సంఘటనలు





జరగకుండా పూర్తి బాధ్యత టెండర్ దారుడే చూసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ వృక్షాలకు అమ్ముకోవడానికి ప్రవేట్ వ్యక్తులకు ఎలాంటి హక్కులు కలిగి ఉండరని ఇప్పటికైనా మార్కెట్ యార్డ్ లో వృక్ష సంపదను కాపాడాలని పట్టణ పౌరులు డిమాండ్ చేస్తున్నారు.



## పర్యవేక్షణతో అభివృద్ధి పనులు

# నాణ్యతతో పూర్తి చేయాలి

**రూ.61.50 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**

ఖమ్మం, జూలై 27(నినాదం): నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.ఖమ్మం నగర పాలక సంస్థ పరిధి లోని 43వ డివిజన్‌లో రూ.61.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ ఖమ్మం నగర అభివృద్ధికి వందల కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు. ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి

# ప్రజావాణి కార్యక్రమం

**ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న అదనపు ఎస్పీ.**

**ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు .. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి**

సంగారెడ్డి బ్యూరో, జులై 27 (నినాదం): జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో తమ సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అదనపు ఎస్పీ తెలియజేశారు.

## మాదకద్రవ్యాల నియంత్రణపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**ఎన్‌డీపీఎస్ కేసుల పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష..**
**పరారీలో ఉన్న నిందితుల అరెస్టుకు ప్రత్యేక బృందాలకు ఆదేశం**




కొత్తగూడెం, జూలై 27 (నినాదం): జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, పకడ్బందీగా సాక్ష్యాధారాలు సేకరించి త్వరితగతిన ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పరారీలో ఉన్న నిందితులను ప్రత్యేక బృందాల ద్వారా గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని, వారి కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో పాల్గొనే వ్యక్తుల ఆర్థిక లావాదేవీలు, అక్రమంగా సంపాదించిన ఆస్తులపై సమగ్ర ఆర్థిక దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ అందించడంతో పాటు డీ–అడిక్షన్ కేంద్రాలకు పంపించే ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్, ప్రతి సబ్‌డివిజన్ పరిధిలో డీ–అడిక్షన్ కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి పోలీసు అధికారి బాధ్యతతో పనిచేయాలని, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్

**వరి సాగుకు వర్షగండం!... ఖరీఫ్ పై నీలినీడలు**

**వెలవెలబోతున్న చెరువులు, కుంటలు**

**చినుకు కోసం చకోరుల్లా రైతన్నలు..**

**ఖరీఫ్ భవితవ్యంపై ఆందోళన**



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం): తెలంగాణ రైతాంగాన్ని వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావం చూపుతోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జూన్ జూలై నెలలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో వరి సాగుపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చెరువులు, కుంటలు, చిన్న నీటి వనరుల్లోకి నీరు చేరక పోవడం, అనేక ప్రాంతాల్లో సాగునీటి వనరులు నిండకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాల కదలికలు మందగించడం, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణంగా వానాకాలంలో వరిపంట సుమారు 65 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగవు తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు విస్తీర్ణం ఎంతమేరకు ఉంటుందన్న దానిపై అనిశ్చితి నెలకొంది. జూలై మధ్య నాటికి రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం సాధారణ స్థాయితో పోలిస్తే చాలా తక్కువగా ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**35 శాతం లోటు వర్షపాతం..**

తెలంగాణలో తాజాగా 158.8 మిల్లీమీటర్లు వర్షపాతం కాగా, సాధారణంగా ఈ కాలంలో 243.2 మిల్లీమీటర్లు వర్షపాతం ఉండాలి. అంటే 84.4 మిల్లీమీటర్ల లోటు, సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 35 శాతం లోటు నమోదైంది. వర్షపాతం లోటు రైతాంగంలో ఆందోళన పెంచుతోంది.

**చెరువులు, కుంటల్లోకి నీరేది?**

వర్షాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, చిన్న నీటి వనరుల్లోకి వరద



నీరు చేరడం తగ్గిపోయింది. రిజర్వాయర్లలోనూ ఆశించిన స్థాయిలోకి నీటి నిల్వలు చేరకపోతే కాలువల ద్వారా సాగునీరు అందించే పరిస్థితులు క్లిష్టంగా మారే ప్రమాదం ఉంది. దీంతో వరి నాట్లు ఆలస్యం కావడం, ఇప్పటికే నారుమడులు వేసిన రైతులకు నీటి సమస్యలు ఎదురుకావడం, సాగు ఖర్చులు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

**ప్రత్యామ్నాయ పంటలపై ప్రభుత్వ దృష్టి**

నీటి వనరుల లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో వైవిధ్యాన్ని పెంచాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. నీటి అవసరం అధికంగా ఉండే వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, పెసర తదితర ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే దిశగా వ్యవసాయ శాఖ చర్యలు చేపడుతోంది.

అయితే వరి సాగుపై ఆధారపడే రైతులు మాత్రం ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు, సాగునీటి భరోసా, పంటల ఎంపికపై సమగ్ర సూచనలు కోరుతున్నారు.

**రైతన్నకు రెండింతల భారం..**

వర్షాలు ఆలస్యం కావడంతో ఒకవైపు సాగు పనులు ముందుకు సాగకపోగా.. మరోవైపు విత్తనాలు,



ఎరువులు, దుక్కులు, నారుమడుల కోసం రైతులు పెట్టిన పెట్టుబడులు వృథా అయ్యే భయం నెలకొంది. వర్షాలు మరింత ఆలస్యమైతే వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మళ్లాల్సిన పరిస్థితి రావచ్చు. ఇప్పటికే అప్పులు చేసి సాగుకు సిద్ధమైన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తుండటంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడే ప్రమాదం ఉంది.

**చినుకు పడితేనే.. పంట నిలిచేది!**

వ్యవసాయ రంగం రాష్ట్ర సాధారణ వార్షిక వర్షపాతంలో సుమారు 79 శాతం నైరుతి రుతుపవనాల కాలమైన జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యే నమోదవుతుంది. దీంతో రాబోయే వారాల్లో కురిసే వర్షాలు ఖరీఫ్ సాగు భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి. ప్రభుత్వం జిల్లాల వారీగా వర్షపాతం, భూగర్భజలాలు, రిజర్వాయర్లు, చెరువుల నీటి నిల్వలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు తక్షణమే అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. వరి నాట్లు వేసిన ప్రాంతాల్లో సాగునీటి సరఫరా, వర్షాభావం కారణంగా పంట నష్టపోయే రైతులకు పరిహారం, విత్తనాలు–ఎరువుల విషయంలో ప్రత్యేక సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సంపాదకీయం

## జవాబుదారీతనం కోల్పోవడంతోనే..
# ప్రజా ఉద్యమాలు!

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జీఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జీఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మ ల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మ ల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వండ లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్దతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకలు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్మకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉధీథంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

## బంగాఖాతంలో
# అల్పపీడన ప్రభావం

### తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్ :**
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్దిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా`పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్`సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.వి కురువాల్సి ఉండగా, 109.7 మి.వి కురిసిందని తెలిపింది.

# ఒక్క ఉద్యోగి... ఎన్నో బాధ్యతలు!

**జనాభా పెరిగింది.. ప్రభుత్వ సేవలు విస్తరించాయి.. కానీ క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత**
**డిజిటల్ పాలన పేరుతో 24 గంటల ఒత్తిడి —— ఆరోగ్యం, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం**
**శాఖల వారీగా శాస్త్రీయ పనిభారం—మానవ వనరుల అధ్యయనం నిర్వహించాలని డిమాండ్**



ప్రభుత్వ ఉద్యోగి అంటే ఉదయం కార్యాలయానికి వచ్చి కొన్ని ఫైళ్లు పరిశీలించి, సాయంత్రానికి ఇంటికి వెళ్లిపోయే ఉద్యోగి అనే పాత భావన ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరవేసే ప్రధాన యంత్రాంగంగా ఉన్న ఉద్యోగులు ప్రస్తుతం ఒకేసారి అనేక రకాల బాధ్యతలను నిర్వర్తించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జనాభా పెరుగుదల, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, డిజిటల్ పరిపాలన, ప్రజల నుంచి పెరుగుతున్న అంచనాలు, నిరంతర సమీక్షలు, గడువులతో కూడిన పనుల కారణంగా ప్రభుత్వ ఉద్యోగులపై పనిభారం గతంతో పోలిస్తే అనేక రెట్లు పెరిగిందనే అభిప్రాయం బలపడుతోంది.

స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో ప్రభుత్వ వ్యవస్థ ప్రధానంగా శాంతిభద్రతలు, రెవెన్యూ వసూళ్లు, విద్య, ఆరోగ్యం వంటి పరిమిత బాధ్యతలకే కేంద్రీకృతమై ఉండేది. బ్రిటిష్ పాలన నుంచి వారసత్వంగా వచ్చిన పరిపాలనా వ్యవస్థను రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పునర్వ్యవస్థీకరించారు. అప్పట్లో ప్రభుత్వ లక్ష్యం ప్రధానంగా పరిపాలన నిర్వహణ, ఆదాయ సేకరణ, ప్రజలకు ప్రాథమిక సేవల అందజేత వరకే పరిమితమైంది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 1951 నుంచి 2025 మధ్య దేశ జనాభా నాలుగు రెట్లకు పైగా పెరిగింది. అదే సమయంలో ప్రభుత్వ బాధ్యతలు మాత్రం జనాభా పెరుగుదలకు అనుగుణంగా నాలుగు రెట్లు మాత్రమే కాకుండా అనేక రెట్లు విస్తరించాయి. సంక్షేమ పథకాల అమలు నుంచి ఆధార్ అనుసంధానం వరకు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం నుంచి కోర్టు కేసుల సమాచారం వరకు, ఎన్నికల విధుల నుంచి విపత్తు నిర్వహణ వరకు ప్రతి దశలోనూ ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకంగా మారింది.

ఫైళ్ల పాలన నుంచి 24×7 డిజిటల్ పాలన వరకు గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానంగా ఫైళ్ల ఆధారంగా పరిపాలన జరిగేది. ఇప్పుడు ఈ–ఆఫీస్, ఆన్‌లైన్ సేవలు, రియల్‌టైమ్ మానిటరింగ్, డేటా అప్‌లోడ్లు, వీడియో కాన్ఫరెన్సులు, సోషల్ మీడియా స్పందనలు, డిజిటల్ నివేదికలు, ఆన్‌లైన్ సమీక్షలు పరిపాలనా వ్యవస్థలో ప్రధాన భాగంగా మారాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆధార్ అనుసంధానం, ఆన్‌లైన్ సేవలు, ఈ–ఆఫీస్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, సమాచార హక్కు దరఖాస్తులకు సమాధానాలు, కోర్టు కేసుల వివరాల సమర్పణ, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఫిర్యాదులకు స్పందన, వీడియో కాన్ఫరెన్సుల్లో పాల్గొనడం, డేటా అప్‌లోడ్ చేయడం, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ధృవీకరణ, ఎన్నికల విధులు, విపత్తు నిర్వహణ వంటి అనేక పనులను ఒకేసారి చేయాల్సి వస్తోంది.

సాంకేతికత ద్వారా పని సులభమవుతుందని భావించినప్పటికీ, అనేక శాఖల్లో సాంకేతికత పాత పనులను తొలగించకుండా వాటికి అదనంగా కొత్త బాధ్యతలను చేర్చిందనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా ఒకే సమాచారాన్ని వేర్వేరు పోర్టల్లలో పలుమార్లు అప్‌లోడ్ చేయడం, కార్యాలయ రికార్డుల్లో నమోదు చేయడం, పై అధికారులకు ప్రత్యేక నివేదికలు పంపడం వంటి పునరావృత పనులు పెరుగుతున్నాయి.

తెలంగాణలో ప్రతి 75 మందికి ఒక ఉద్యోగి!

తెలంగాణ రాష్ట్ర జనాభా సుమారు 4.1 కోట్లకు చేరువలో ఉండగా, వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, విద్య, ఆరోగ్యం, పోలీస్, కార్పొరేషన్లు తదితర రంగాలను కలిపి సుమారు 5.2 లక్షల నుంచి 5.8 లక్షల మధ్య ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు వివిధ గణాంకాలు సూచిస్తున్నాయి.

సగటున 5.5 లక్షల మంది ఉద్యోగులను పరిగణనలోకి తీసుకుంటే ప్రతి 75 మంది ప్రజలకు ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉన్నట్లు కనిపిస్తుంది. అయితే ఈ సగటు గణాంకం క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదనే అభిప్రాయం ఉంది. అన్ని శాఖల్లో ఉద్యోగుల పంపిణీ ఒకే విధంగా లేదు. కొన్ని కార్యాలయాల్లో అవసరానికి అనుగుణంగా సిబ్బంది ఉన్నప్పటికీ, మరికొన్ని శాఖల్లో తీవ్రమైన ఖాళీలు కొనసాగుతున్నాయి.

జనాభా, భౌగోళిక విస్తీర్ణం, ప్రజలకు అందించాల్సిన సేవల సంఖ్య, సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ఆన్‌లైన్ లావాదేవీలు, పెండింగ్ దరఖాస్తులు, కోర్టు కేసులు, ఫిర్యాదుల ఆధారంగా పనిభారం మారుతున్నప్పటికీ, పోస్టుల కేటాయింపు మాత్రం అనేక చోట్ల పాత ప్రమాణాల ఆధారంగానే కొనసాగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్షేత్రస్థాయిలో ఒక ఉద్యోగి.. రెండు మూడు హోదాలు

జిల్లా, మండల, గ్రామస్థాయి కార్యాలయాల్లో ఒకే ఉద్యోగి రెండు లేదా మూడు హోదాలకు సంబంధించిన బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఉదాహరణలు అనేకం కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ పరిపాలన, సంక్షేమ శాఖలు, డేటా నిర్వహణ విభాగాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

కొన్ని కార్యాలయాల్లో ఉద్యోగి తన అసలు బాధ్యతలతో పాటు ఖాళీగా ఉన్న మరో పోస్టుకు సంబంధించిన పనిని కూడా నిర్వహించాల్సి వస్తోంది. సిబ్బంది సెలవులో ఉన్నప్పుడు, బదిలీ అయినప్పుడు లేదా పోస్టు దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్నప్పుడు ఆ బాధ్యతలు కూడా అందుబాటులో ఉన్న ఉద్యోగుల పైనే పడుతున్నాయి.

ఫలితంగా ఉద్యోగుల సంఖ్య ఎంత ఉన్నదనే ప్రశ్నకంటే, అందుబాటులో ఉన్న ఉద్యోగులతో ఎంత పని చేయిస్తున్నారన్న ప్రశ్న ప్రధానంగా మారుతోంది.

ఒక ఉద్యోగి.. ఏడు పాత్రలు

నేటి ప్రభుత్వ ఉద్యోగి కేవలం పరిపాలనా సిబ్బంది మాత్రమే కాదు. ఒకేసారి పరిపాలకుడిగా, డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా, ఐటీ వినియోగదారుడిగా, ప్రజా సంబంధాల అధికారిగా, సంక్షేమ పథకాల సమన్వయకర్తగా, ఆడిట్ బాధ్యుడిగా, న్యాయపరమైన సమాచారం సమర్పించే అధికారిగా పనిచేయాల్సి వస్తోంది.

ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తు, ఫిర్యాదు, ధృవీకరణ, సర్టిఫికెట్, సంక్షేమ పథకం, ఆన్‌లైన్ సేవ వెనుక ఒక ప్రభుత్వ ఉద్యోగి శ్రమ ఉంటుంది. కానీ ఉద్యోగి నిర్వహించే వివిధ బాధ్యతలకు తగిన శిక్షణ, సాంకేతిక సహాయం, అదనపు సిబ్బంది, సముచిత సమయం అందుబాటులో ఉన్నాయా అనే అంశంపై సమగ్ర సమీక్ష జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి.

డిజిటల్ గడువులు.. రాత్రివేళ సమీక్షలు

ప్రభుత్వ శాఖల్లో ప్రస్తుతం ప్రతి కార్యక్రమానికి గడువులు నిర్ణయించడం సాధారణమైంది. పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, సర్వేలు, డేటా అప్‌లోడ్లు, నివేదికల సమర్పణ, వీడియో సమావేశాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి పనులన్నీ నిర్ణీత గడువులో పూర్తి చేయాల్సి ఉంటుంది.

పైస్థాయి అధికారుల నుంచి ఎప్పటికప్పుడు జరిగే సమీక్షలు, రాత్రివేళ వీడియో కాన్ఫరెన్సులు, సెలవు రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాలు, అత్యవసర నివేదికలు ఉద్యోగులపై అదనపు ఒత్తిడిని పెంచుతున్నాయి. పని సమయం ముగిసిన తర్వాత కూడా వాట్సాప్ గ్రూపులు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ నివేదికల ద్వారా విధులు కొనసాగుతున్నాయని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యంపై కనిపించని దెబ్బ

ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా వైద్యపరంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి, ఎక్కువ పని గంటలు, కంప్యూటర్ ముందు ఎక్కువ సేపు కూర్చోవడం, వ్యాయామానికి సమయం లేకపోవడం, అసమయ ఆహారం, నిద్రలేమి వంటి కారణాలు ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి.

రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు, నడుము నొప్పి, కంటి సమస్యలు, నిద్రలేమి, మానసిక ఆందోళన వంటి అనారోగ్య పరిస్థితులకు పని ఒత్తిడి కూడా ఒక ప్రమాద కారకంగా మారుతోంది.

అయితే ఈ సమస్య ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పరిమితం కాదని, ఆధునిక పని సంస్కృతిలో ఐటీ, ప్రైవేట్, మీడియా, బ్యాంకింగ్, వైద్య రంగాలతో సహా అనేక వర్గాలు ఇలాంటి ఒత్తిడినే ఎదుర్కొంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ప్రజా సేవలతో నేరుగా ముడిపడిన ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యం ప్రభావితమైతే దాని ప్రభావం ప్రజలకు అందే సేవలపైనా పడుతుంది.

కుటుంబానికి సమయం ఎక్కడ?

ఎన్నికల విధులు, ప్రభుత్వ సర్వేలు, ప్రత్యేక కార్యక్రమాలు, అత్యవసర విధులు, పండుగలు–సెలవు రోజుల పనులు, రాత్రి సమీక్షలు, విపత్తుల సమయంలో విధులు వంటి కారణాల వల్ల కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతున్నదనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

కార్యాలయ ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లడం, రాత్రివేళ కూడా ఫోన్ కాల్స్‌కు స్పందించాల్సి రావడం, పిల్లలతో గడపలేకపోవడం, కుటుంబ కార్యక్రమాలకు హాజరు కాలేకపోవడం ఉద్యోగుల వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపుతోంది. మంచి కుటుంబ వాతావరణం ఉద్యోగి మానసిక ఆరోగ్యానికి, పనితీరుకు, ఉత్పాదకతకు కీలకమన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉంది.

కొత్త నియామకాల డిమాండ్ మాత్రమే కాదు

ప్రభుత్వ ఉద్యోగుల పనిభారంపై జరుగుతున్న చర్చను కేవలం కొత్త నియామకాల కోసం చేస్తున్న డిమాండ్‌గా చూడకూడదు. అదే సమయంలో ఉద్యోగుల సంఖ్య తగ్గించాలనే వాదనగా కూడా పరిగణించకూడదు.

అసలు అవసరం రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ మానవ వనరుల అధ్యయనం నిర్వహించడం. ప్రతి శాఖలో, ప్రతి జిల్లాలో, ప్రతి మండలంలో, ప్రతి కార్యాలయంలో వాస్తవంగా ఎంత పని జరుగుతోంది, ఎంతమంది ఉద్యోగులు అవసరం, ఎక్కడ అదనపు పోస్టులు ఉన్నాయి, ఎక్కడ తీవ్రమైన కొరత ఉంది, సాంకేతికత వల్ల ఎక్కడ పని తగ్గింది, డిజిటల్ వ్యవస్థల వల్ల ఎక్కడ కొత్త పని పెరిగింది అనే అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి.

ప్రభుత్వం తెలుసుకోవాల్సిన వాస్తవాలు

ప్రతి కార్యాలయంలో ఉద్యోగుల వాస్తవ పనిభారం ఎంత ఉంది? ఒక్కో ఉద్యోగి రోజుకు ఎన్ని దరఖాస్తులు, ఫైళ్లు, ఆన్‌లైన్ సేవలు, ఫిర్యాదులు, నివేదికలు నిర్వహిస్తున్నాడు? ఎక్కడ అదనపు బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయి? ఎక్కడ పోస్టులు ఖాళీగా ఉన్నాయి? ఎక్కడ సాంకేతికత పని తగ్గించింది? ఎక్కడ కొత్త డిజిటల్ బాధ్యతలు పెరిగాయి? అనే అంశాలపై జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమగ్ర నివేదిక రూపొందించాలి.

కేవలం మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, ఖాళీల సంఖ్య వంటి గణాంకాలతోనే మానవ వనరుల అవసరాలను అంచనా వేయడం సరిపోదు. ప్రజలకు అందుతున్న సేవల పరిమాణం, జనాభా, భౌగోళిక విస్తీర్ణం, సంక్షేమ పథకాల సంఖ్య, డిజిటల్ లావాదేవీలు, కార్యాలయానికి వచ్చే ప్రజల సంఖ్య వంటి ప్రమాణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

పనిభారం ఆధారంగా పోస్టుల పునర్విభజన

ప్రభుత్వ శాఖల్లో పోస్టుల పంపిణీని జనాభా, సేవల పరిమాణం, డిజిటల్ లావాదేవీలు, దరఖాస్తుల సంఖ్య, ప్రజా అవసరాల ఆధారంగా పునర్వ్యవస్థీకరించాలి. అవసరానికి మించి సిబ్బంది ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న కార్యాలయాలకు పోస్టులను మార్చే విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలి.

ఆరోగ్యం, విద్య, రెవెన్యూ, మున్సిపల్ పరిపాలన, గ్రామీణాభివృద్ధి, డిజిటల్ ప్రజాసేవల వంటి ప్రజలకు నేరుగా సంబంధించిన శాఖల్లోని కీలక ఖాళీలను ప్రాధాన్యంగా భర్తీ చేయాలి. ప్రతి ఖాళీని ఒకే కోణంలో కాకుండా, ఆ పోస్టు భర్తీ కాకపోవడం వల్ల ప్రజా సేవలపై పడుతున్న ప్రభావాన్ని పరిశీలించాలి.

ప్రతి శాఖకు 'వర్క్‌లోడ్ ఇండెక్స్'

ప్రతి ప్రభుత్వ శాఖకు ప్రత్యేకంగా 'వర్క్‌లోడ్ ఇండెక్స్' రూపొందించాలనే సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక ఉద్యోగి నిర్వహించే ఫైళ్ల సంఖ్య, దరఖాస్తులు, డిజిటల్ లావాదేవీలు, క్షేత్రస్థాయి పర్యటనలు, ప్రజా ఫిర్యాదులు, సమావేశాలు, కోర్టు కేసులు, ప్రత్యేక విధులు వంటి అంశాలకు శాస్త్రీయంగా విలువ కట్టి పనిభారాన్ని లెక్కించాలి.

ఈ వర్క్‌లోడ్ ఇండెక్స్‌ను కనీసం ఐదు సంవత్సరాలకు ఒకసారి సమీక్షించాలి. జనాభా పెరుగుదల, కొత్త జిల్లాలు, మండలాలు, మున్సిపాలిటీల ఏర్పాటు, కొత్త సంక్షేమ పథకాలు, సాంకేతిక మార్పులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా పోస్టులను సవరించాలి.

ఉద్యోగుల ఆరోగ్యానికి ప్రత్యేక విధానం

ప్రభుత్వ ఉద్యోగులకు వార్షిక ఆరోగ్య పరీక్షలు, ఒత్తిడి నిర్వహణ కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య సహాయ వ్యవస్థలు, కౌన్సెలింగ్, కార్యాలయాల్లో ఆరోగ్యకరమైన పని వాతావరణం కల్పించాలి.

దీర్ఘకాలం కంప్యూటర్ ముందు పనిచేసే ఉద్యోగులకు కంటి పరీక్షలు, ఎర్గోనామిక్ కుర్చీలు, తగిన విరామాలు, వ్యాయామ కార్యక్రమాలు, పని గంటల నియంత్రణ వంటి చర్యలు అమలు చేయాలి. ఆరోగ్యవంతమైన ఉద్యోగి మాత్రమే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించగలడనే విషయాన్ని పరిపాలనా విధానంలో భాగం చేయాలి.

ఒకే సమాచారాన్ని ఎన్నిసార్లు?

ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకే సమాచారాన్ని పలుమార్లు సమర్పించాల్సిన పరిస్థితిని తగ్గించాలి. వేర్వేరు శాఖలు, పోర్టల్లు, నివేదికల కోసం ఒకే డేటాను మళ్లీ మళ్లీ సేకరించడం వల్ల ఉద్యోగుల సమయం వృథా కావడమే కాకుండా పొరపాట్లకు కూడా అవకాశం పెరుగుతోంది.

సమగ్ర డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకసారి నమోదు చేసిన సమాచారాన్ని అవసరమైన అన్ని శాఖలు వినియోగించుకునేలా చేయాలి. డిజిటల్ వ్యవస్థలు ఉద్యోగులపై అదనపు భారంగా కాకుండా పనిని సులభతరం చేసే సాధనాలుగా మారాలి.

అసలు ప్రశ్న ఇదే!

ప్రస్తుతం ప్రభుత్వాలు “ఎంతమంది ఉద్యోగులు ఉన్నారు?” అనే ప్రశ్నకే పరిమితం కాకుండా, “ఎంతమంది ఉద్యోగులతో ఎంత పని జరుగుతోంది?” అనే ప్రశ్నకు సమాధానం వెతకాలి.

ఉద్యోగుల సంఖ్య ఎక్కువా, తక్కువా అనే సాధారణ చర్చ కన్నా, క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించేందుకు అవసరమైన మానవ వనరులు ఉన్నాయా? ఉద్యోగుల మధ్య పనిభారం సమానంగా పంపిణీ అవుతోందా? ఖాళీల కారణంగా సేవలు ఆలస్యమవుతున్నాయా? అనవసరమైన పునరావృత పనులను తగ్గించవచ్చా? అనే అంశాలపై దృష్టి పెట్టాలి.

జనాభా పెరుగుదల, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, డిజిటల్ పరిపాలన, ప్రజల పెరుగుతున్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని కాలానుగుణంగా పునఃసమీక్షించడం మంచి పాలనలో భాగం.

ఉద్యోగి సంక్షేమమే ప్రజాసేవకు పెట్టుబడి

ప్రభుత్వ ఉద్యోగి సంక్షేమం అనేది కేవలం ఉద్యోగుల ప్రయోజనానికి సంబంధించిన అంశం కాదు. అది ప్రజలకు అందే సేవల నాణ్యతకు పెట్టుబడి. ఆరోగ్యవంతమైన, శిక్షణ పొందిన, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన, పనిభారం సమతుల్యంగా ఉన్న ఉద్యోగులే ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలను అందించగలరు.

అధిక పనిభారం, సిబ్బంది కొరత, అనవసరమైన పునరావృత విధులు, నిరంతర సమీక్షలు, ఆరోగ్య సమస్యల మధ్య ఉద్యోగులు పనిచేస్తే పరిపాలనా వ్యవస్థ సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఉద్యోగులపై ఒత్తిడి పెరగడం చివరకు ప్రజలకు అందే సేవల ఆలస్యం, తప్పిదాలు, అసంతృప్తికి కారణమవుతుంది.

అందుకే ప్రభుత్వం జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు సమగ్ర పనిభారం—మానవ వనరుల అధ్యయనం నిర్వహించాలి. వాస్తవ అవసరాల ఆధారంగా పోస్టులను పునర్వ్యవస్థీకరించాలి. కీలక ఖాళీలను భర్తీ చేయాలి. డిజిటల్ వ్యవస్థలను సమీకరించాలి. ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక విధానాన్ని అమలు చేయాలి.

సమర్థవంతమైన ఉద్యోగి... సమర్థవంతమైన పాలనకు పునాది.

సమర్థవంతమైన పాలన... ప్రజల విశ్వాసానికి పునాది.

**నాగులపల్లి వెంకటేశ్వరరావు,**
**కార్యదర్శి, మీడియా అకాడమి ఆఫ్ తెలంగాణ, హైదరాబాద్.**



# తెలుగు రాష్ట్రాల విమానయాన చరిత్రకు సాక్షి...బేగంపేట్ ఎయిర్‌పోర్ట్



హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న బేగంపేట్ విమానాశ్రయం కేవలం ఒక ఎయిర్‌పోర్ట్ కాదు. ఇది తెలుగు రాష్ట్రాల విమానయాన చరిత్రకు సాక్షి. 1930లో నిజాం హయాంలో ప్రారంభమైన ఈ ఎయిర్‌పోర్ట్, ఒకప్పుడు దక్షిణాసియాలోనే అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఒకటి.

చరిత్ర – "దక్కన్ నుండి ప్రపంచానికి"

బేగంపేట్ నుండి 1947లోనే దక్కన్ ఎయిర్వేస్ ప్రారంభమైంది. ఇదే తర్వాత ఎయిర్ ఇండియా అయ్యింది. పీవీ. నరసింహారావు, ఎన్ టి ఆర్, ఏ పీ జే. అబ్దుల్ కలాం లాంటి ప్రముఖులు ఇక్కడి నుండే ప్రయాణించారు. ఇక్కడి టెర్మినల్ ఆర్ట్ డెకో శైలిలో నిర్మించబడింది. ఇది హెరిటేజ్ భవనంగా ఇప్పటికీ ఉంది.

### 2008 తర్వాత ఏమైంది?
### - "పాత్ర మార్పు"

2008 మార్చి 23న శంషాబాద్ ఆర్ జీ ఐ ఏ ప్రారంభమైన తర్వాత బేగంపేట్ నుండి కమర్షియల్ విమానాలు పూర్తిగా ఆగిపోయాయి.

కారణం: ఆర్ జీ ఐ ఏకి 4000 ఎకరాలు, 24 గంటల ఆపరేషన్, కార్గో సౌకర్యం ఉండటం. కానీ బేగంపేట్ పూర్తిగా మూతపడలేదు. దాని పాత్ర పూర్తిగా మారింది.

ప్రస్తుతం దేనికి వాడుతున్నారు?

బేగంపేట్ ఇప్పుడు 4 ప్రధాన ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది.

వి ఐ పీ విమానాలు: రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, గవర్నర్ విమానాలు ఇక్కడే ల్యాండ్ అవుతాయి. నగరానికి దగ్గరగా ఉండటం వల్ల ఇది వి ఐ పీలకు అనుకూలం.

ట్రైనింగ్ & ప్రైవేట్ జెట్స్: రాజీవ్ గాంధీ ఏవియేషన్ అకాడమీ ఇక్కడే ఉంది. పైలట్ శిక్షణకు ఇది ప్రధాన కేంద్రం. ప్రైవేట్ చార్టర్ విమానాలు, బిజినెస్ జెట్స్ కూడా ఇక్కడే ఆపరేట్ అవుతాయి.

హెలికాప్టర్ సర్వీసులు: నగరంలోపల హెలి–టాక్సీ, అత్యవసర వైద్య సేవలకు ఉపయోగిస్తారు.

ఏరోస్పేస్ & MRO: ఇక్కడ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, రిపేర్ సౌకర్యాలు ఉన్నాయి.

బేగంపేట్ భవిష్యత్తు – "సమస్యలు vs అవకాశాలు"

సమస్యలు:

రన్‌వే పొడవు: 3000 మీటర్లు మాత్రమే. పెద్ద బోయింగ్ 777, A380 లాంటి విమానాలు రాలేవు.

నగరం మధ్యలో ఉండటం: చుట్టూ భవనాలు ఎక్కువ. రాత్రి 10 తర్వాత విమానాలు నడపడానికి పరిమితులు.

ఆర్ జీ ఐ ఏ పోటీ: శంషాబాద్ అన్ని సౌకర్యాలతో ఉండటం వల్ల కమర్షియల్ ఎయిర్‌లైన్స్ తిరిగి వచ్చే అవకాశం తక్కువ.

అవకాశాలు:

బిజినెస్ ఏవియేషన్ హబ్: ముంబై జుహు ఎయిర్‌పోర్ట్ లాగా బేగంపేట్ ను ప్రైవేట్ జెట్స్, కార్పొరేట్ ఫ్లైట్స్ కు ప్రత్యేక హబ్ గా మార్చవచ్చు. హైదరాబాద్ ఐటీ కంపెనీలకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

ఏవియేషన్ స్కిల్ సెంటర్: పైలట్ ట్రైనింగ్, ఇంజనీరింగ్, గ్రౌండ్ స్టాఫ్ శిక్షణకు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సెంటర్ గా డెవలప్ చేయవచ్చు.

హెరిటేజ్ టూరిజం: పాత టెర్మినల్ ను ఏవియేషన్ మ్యూజియంగా మార్చితే పర్యాటకులను ఆకర్షిస్తుంది.

బేగంపేట్ మూతపడలేదు, అది "రిటైర్" అయ్యింది. శంషాబాద్ మాస్ ట్రాఫిక్ ని చూసుకుంటే, బేగంపేట్ నాణ్యమైన, ప్రత్యేకమైన విమానయాన సేవలకు కేంద్రంగా మారింది.

హైదరాబాద్ లాంటి మెట్రో సిటీకి 2 ఎయిర్‌పోర్ట్ లు ఉండటం వరమే. బేగంపేట్ ను సరిగ్గా వాడుకుంటే అది "సిటీ ఎయిర్‌పోర్ట్" గా, "ఏవియేషన్ స్కిల్ క్యాపిటల్" గా నిలుస్తుంది. కీ పాయింట్ దూరం కాదు, దగ్గరితనమే బేగంపేట్ యొక్క అతిపెద్ద బలం.



**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# వారానికి ఒక్కసారి తిన్నా చాలు..!



ఈ కూర మేక లేదా గొర్రె పేగులతో బోటి కూరను అద్భుతంగా తయారు చేస్తారు.. తరతరాలుగా మన పెద్దలు ఆరోగ్యం కోసం దీనిని తమ ఆహారంలో భాగంగా చేసుకున్నారు. బోటి కూరను క్రమం తప్పకుండా లేదా.. వారానికి ఒకసారి ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరం దృఢంగా మారుతుంది.. భీముడిలాంటి బలాన్ని పొందవచ్చని పెద్దలు చెబుతుంటారు.

**పోషకాల గని బోటి కూర:**

బోటి కూరలో శరీరానికి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రోటీన్, ఐరన్, విటమిన్ బి12 అధిక మొత్తంలో లభిస్తాయి. వీటితో పాటు విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ కె, ఫైబర్ కూడా బోటి కూరలో ఉంటాయి. మటన్, మటన్ మరాగ్, మటన్ పాయా సూప్ వంటి వంటకాలతో పాటు బోటి కూర కూడా తనకంటూ ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంది. అందుకే.. నాన్ వెజ్ ప్రియులు బోటి కూరను ఇష్టంగా తింటారు.

**కండరాల వృద్ధి – రోగనిరోధక శక్తి:**

బోటి కూర ప్రోటీన్‌కు అద్భుతమైన మూలం. మన శరీర కండరాల వృద్ధికి ప్రోటీన్ అత్యవసరం. కండరాలను బలంగా ఉంచడమే కాకుండా, శరీరంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. రోజువారీ ప్రోటీన్ అవసరాలను తీర్చడానికి బోటి కూర ఒక సమర్థవంతమైన మార్గం. అంతేకాకుండా, ఇది ఆరోగ్యకరమైన చర్మం, జుట్టును నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది.

**రక్తహీనత నివారణ – నాడీ వ్యవస్థ ఆరోగ్యం:**

బోటీలో ఐరన్, విటమిన్ బి12 వంటి కీలక పోషకాలు ఉన్నాయి. రక్తంలో ఆక్సిజన్ సరఫరాకు ఐరన్ అవసరం కాగా, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి విటమిన్ బి12 తప్పనిసరి. రక్తహీనతతో బాధపడే వారికి, అలాగే నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలు ఉన్నవారికి బోటి కూర చాలా ప్రయోజనకారిగా ఉంటుంది. ఇది శరీరంలోని ముఖ్యమైన జీవక్రియలకు మద్దతు ఇస్తుంది.

జీర్ణక్రియ – బరువు నియంత్రణ:

బోటి కూరలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి.



ఇది బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి అనుకూలమైన ఆహారం. అలాగే, డయాబెటిస్ ఉన్నవారికి కూడా బోటి కూర అనేక ప్రయోజనాలను అందిస్తుంది. దీనిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. మలద్ధకాన్ని నివారించి.. గట్ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ మొత్తం శరీర ఆరోగ్యానికి కీలకం.



**చర్మం – ఎముకల ఆరోగ్యం:**

బోటి కూరలో కొల్లాజెన్ అధికంగా ఉంటుంది. కొల్లాజెన్ చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది ఎముకలకు దృఢత్వాన్ని అందించి, కీళ్ల ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

బోటి కూర అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నప్పటికీ, దీనిలో కొవ్వు, కొలెస్ట్రాల్ కూడా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్న వారు దీనిని ఎక్కువగా తినకుండా మితంగా తీసుకోవడం మంచిది.

మొత్తంగా, బోటి కూర మన సాంప్రదాయ ఆహారంలో ఒక విలువైన భాగం. దీనిని సరైన పద్ధతిలో, మితంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం.. అపారమైన బలాన్ని పొందవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు.

### చిటికెలో రక్తాన్ని పెంచే

# కొండ ప్రాంతపు నువ్వుల పచ్చడి..

### తిన్నవాళ్లు మళ్లీ అడగడం ఖాయం!

**కావలసిన పదార్థాలు :** ఒక కప్పు నువ్వుల గింజలు, రుచికి తగినంత ఉప్పు, రెండు టేబుల్ స్పూన్స్ ఆవాలు, అర టేబుల్ స్పూన్ పసుపు పొడి , అర టేబుల్ స్పూన్ అల్లం పేస్ట్, మూడు టేబుల్ స్పూన్స్ కారం పొడి, అర టేబుల్ స్పూన్ మెంతులు, ఇంకా సరిపడా వంట నూనెను తీసుకోవాలి.

**దీనిని సరైన కొలతలతో చేస్తే టేస్ట్ అద్భుతం**

కొండ ప్రాంతపు నువ్వుల పచ్చడి తయారుచేసే విధానం: మీరు ముందుగా నువ్వులను తీసుకుని వాటిని బాగా కడిగి కొద్దీ సేపు ఆరనిచ్చి ఆ తర్వాత ఒక పాన్ లో ఆయిల్ వేసి వేయించాలి. అది బాగా వేడయ్యాక ఆవాలు వేసి వేయించి ఆ తర్వాత నాలుగు మెంతులు, ఇంకా కొద్దిగా అల్లం కూడా వేసి కొద్ది సేపు వేయించండి.

**కొండ ప్రాంతపు నువ్వుల పచ్చడి తయారుచేసే విధానం స్టెప్ 1** : ఇక ఇప్పుడు దీనిలో నువ్వులను వేసి కొద్దీ సేపు అయ్యాక కొద్దిగా పసుపు, రుచికి సరిపడా ఉప్పు, కారం కూడా



వేసి అన్నింటినీ బాగా కలుపుకోవాలి. ఇంకా మీరు ఈ రసాన్ని కూడా వేస్తే పచ్చడి రుచి డబుల్ అవుతుంది. ఇంకా దీనిని మీడియం ఉడికిస్తే నువ్వుల పచ్చడి రెడీ

బలహీనంగా ఉన్న వాళ్లు, రక్తం తక్కువగా ఉన్న వాళ్ళు కూడా దీనిని తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. దీని కోసం ఎక్కువ సమయం కూడా అవసరం లేదు 15 నిమిషాల్లో నువ్వుల పచ్చడి రెడీ అవుతుంది అన్నంలో మీరు ఒక్కసారి దీనిని కలుపుకుని తింటే కూర రుచి అదిరిపోద్ది. పక్కగా దీనిని ట్రై చేయండి.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**– రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**లక్ష్మీదేవిపల్లి, జూలై 27 (నినాదం):** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వైద్యాధికారితో మాట్లాడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదవుతున్న ఓపీ వివరాలు, రోజువారీ రోగుల సంఖ్య, గత పది రోజులుగా నమోదైన జ్వర కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జ్వరాలపై ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, జ్వర లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి తక్షణమే చికిత్స అందించాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను కూడా విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. మందుల నిల్వ గదిని సందర్శించిన జిల్లా కలెక్టర్ అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, వాటి గడువు తేదీలు, అవసరమైన





మందుల లభ్యతను పరిశీలించారు. మందుల కొరత ఏర్పడకుండా ముందస్తుగా ఇండెంట్లు పంపించి అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పాము కాటుకు గురైన బాధితులకు అత్యవసరంగా వినియోగించే యాంటీ స్నేక్ వెనం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, నిల్వలో ఉన్న ఆయుష్ ఔషధాలను పరిశీలించారు. ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను కూడా సమర్థవంతంగా అందించాలని సూచించారు. తనిఖీ అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల అభిప్రాయాలను తెలుసుకొని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట లక్ష్మీదేవి పల్లి తాసిల్దార్ శిరీష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరుస నష్టాలకు బ్రేక్..
# సెన్సెక్స్ 776, నిఫ్టీ 228

నినాదం మార్కెట్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం రాణించాయి. పశ్చిమాసియా ఘర్షణలు తాత్కాలికంగా చల్లబడటంతో చమురు ధరలు దిగొచ్చాయి. దీంతో వరుసగా ఐదు సెషన్లలో సూచీల నష్టాలకు బ్రేక్ పడింది. ఐటీ, బ్యాంక్స్, కన్జ్యూమర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది.

సెన్సెక్స్ 776.01 పాయింట్లు లాభపడి 76,835.78 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 228.50 పాయింట్లు ఎగబాకి 23,995.95 వద్ద ముగిసింది. సెన్సెక్ 30లో హెచ్‌డీఎఫ్‌సీ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మాత్రమే నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.90వద్ద ఉంది.

అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 87.93 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ ధర




4,089.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**లాభాలకు కారణాలు ఇవీ..**

పశ్చిమాసియాలో దాడులకు తాత్కాలికంగా బ్రేక్ పడటంతో చమురు మంటలు చల్లారాయి. దీంతో ఇంధన దిగుమతులు, ద్రవ్యోల్బణ ఆందోళనలు తగ్గాయి. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు లాభాలబాట పట్టాయి. టాటా కన్జ్యూమర్, ఎన్‌టీపీసీ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేర్లలో ర్యాలీ మార్కెట్లకు కలిసొచ్చింది. ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథంగా కొనసాగుతాయన్న అంచనాలు కూడా సూచీలను బలపరిచింది

## డార్క్ వెబ్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా డేటా




ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) తీవ్రమైన సైబర్ భద్రతా సవాళ్లను ఎదుర్కొంటోంది. బ్యాంక్ సర్వర్ల నుంచి సుమారు 1 టెరాబైట్ (1టీబీ) సమాచారాన్ని దొంగిలించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని ఒక హ్యాకర్ ప్రకటించడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ డేటాలో లక్షలాది మంది కస్టమర్ల పేర్లు, మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, సేవింగ్స్, కరెంట్ అకౌంట్ల సమాచారం, లోన్ రికార్డులతో పాటు బ్యాంక్ అంతర్గత ఆడిట్ నివేదికలు ఉన్నట్లు సైబర్ సెక్యూరిటీ పరిశోధకులు తెలిపారు. అయితే పాస్‌వర్డ్‌లు, పిన్‌లు, యూపీఐ కోడ్‌లు లేదా ఓటీపీలు లీక్ అయినట్లు ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ, కస్టమర్ వివరాలు బహిర్గతం కావడం పెద్ద చర్చకు దారితీసింది.

ఈ నివేదికలపై స్పందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా యాజమాన్యం, తమ వద్ద అత్యంత భద్రమైన సైబర్ ప్రోటోకాల్స్ ఉన్నాయని స్పష్టం చేసింది. ఒక ఉద్యోగికి చెందిన ఈమెయిల్ అకౌంట్ హ్యాక్ కావడం వల్ల మాత్రమే కొంత సమాచారం అనధికారికంగా యాక్సెస్ అయ్యిందని, ఆ ముప్పును వెంటనే పసిగట్టి నిరోధక చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. అత్యంత కీలకమైన 'కోర్ బ్యాంకింగ్ సిస్టమ్స్' సురక్షితంగా ఉన్నాయని, ప్రధాన సర్వర్లలోకి హ్యాకర్లు ప్రవేశించలేదని బ్యాంక్ భరోసా ఇచ్చింది. ఈ ఘటనపై సమగ్ర ఫోరెన్సిక్ విచారణ ప్రారంభించడమే కాకుండా, ఆర్‌బీఐ, సెర్ట్–ఇన్ వంటి నియంత్రణ సంస్థల మార్గదర్శకాలను పాటిస్తూ దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలిపింది.

అధికారికంగా 1 టీబీ డేటా లీక్ వ్యవహారంపై పూర్తి స్థాయిలో ఇంకా ధృవీకరించనప్పటికీ, కస్టమర్ల వ్యక్తిగత వివరాలు సైబర్ కేటుగాళ్ల చేతికి చిక్కితే 'టార్గెటెడ్ ఫిషింగ్' దాడులు పెరిగే ముప్పు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్యాంక్ ప్రతినిధులుగా నమ్మిస్తూ నకిలీ ఎస్సెమ్మెస్‌లు, ఇ–మెయిళ్లు లేదా ఫోన్ కాల్స్ చేసి ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు రాబట్టడానికి మోసగాళ్లు ప్రయత్నించవచ్చు. అంతేకాకుండా ఆధార్, బ్యాంక్ వివరాలతో నకిలీ లోన్ దరఖాస్తులు లేదా ఫోర్జరీ కేవైసీల రూపంలో 'ఐడెంటిటీ థెఫ్ట్' జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా కస్టమర్లు ఎవరితోనూ వ్యక్తిగత పిన్, ఓటీపీ వివరాలను పంచుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

### ఇన్ఫోసిస్‌కు రూ. 2 కోట్ల
## జరిమానా విధించిన ఫ్రాన్స్




దేశీయ ఐటీ సేవల కంపెనీ ఇన్ఫోసిస్‌కు ఫ్రాన్స్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉద్యోగుల పని వేళలను నమోదు చేసే వ్యవస్థ అక్కడి కార్మిక చట్టాలకు పూర్తిగా అనుగుణంగా లేదని తేలడంతో, ఫ్రెంచ్ కార్మిక శాఖ విభాగం సంస్థపై 1,75,000 యూరోల(మన కరెన్సీలో రూ. 2 కోట్ల) జరిమానా విధించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఇన్ఫోసిస్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ, కొన్ని వర్గాల టైమ్ రికార్డింగ్‌లో విశ్వసనీయత, ఆడిట్ చేయగల సామర్థ్యం, పర్యవేక్షణ వంటి అంశాల్లో లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని తెలిపింది. అయితే ఈ జరిమానా తమ ఆర్థిక పరిస్థితి, వ్యాపార కార్యకలాపాలు లేదా మొత్తం పనితీరుపై ప్రభావం ఉం డదని కంపెనీ స్పష్టం చేసింది. ఇదే సమయంలో వ్యాపార పనితీరుకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఇన్ఫోసిస్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 12.2 శాతం పెరిగి రూ. 7,769 కోట్లకు చేరగా, కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 14 శాతం పెరిగి రూ. 48,211 కోట్లకు చేరింది.

## నేటి గ్యాస్ సిలిండర్ ధరలు

గత నెలలో గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదలపై ప్రజలు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల(జులై) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ. 183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతం(జులై 27) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.



**గ్యాస్ సిలిండర్ ధరలు..**

హైదరాబాద్: రూ. 994.00
వరంగల్: రూ. 1013.00
విశాఖపట్నం: రూ. 950.00
విజయవాడ: రూ. 966.50
గుంటూరు: రూ. 966.50

### తెలంగాణలో గ్రామీణ
# నీటి సరఫరా, పారిశుద్ధ్యం



21వ శతాబ్దంలో అభివృద్ధి చెందుతున్న దేశంలో రక్షిత మంచినీటి సరఫరా అనేది ఒక ముఖ్యమైన అవసరం. 2005 నుండి ఈ దిశగా మందంజ వేస్తూ జీవించడానికి నీరు అనే నినాదంతో 2017 వ సంవత్సరానికి ప్రతి ఒక్కరికి సురక్షిత తాగునీరు అందించాలనే దిశగా తెలంగాణ రాష్ట్రంలో మిలీనియం అభివృద్ధి యొక్క లక్ష్యం. ఈ దిశగా తెలంగాణ రాష్ట్రం ముందుకు పోతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ యూనిసెఫ్ ల సర్వే ప్రకారం 1.1 మిలియన్ల ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు 2.6 బిలియన్ల ప్రజలకు పారిశుద్ధ్యం అందుబాటులో లేదని తేలింది. దీనికి కలుషిత ఆహారం నీటి సంబంధమైన వ్యాధుల బారిన పడిన వారిని 6 నుండి 20% శుద్ధిచేసి త్రాగునీరు 32 శాతం మందికి పారిశుద్ధ్య వసతులు కల్పించినా వారి ఆరోగ్య పరిస్థితులను జీవన ప్రమాణాలను మెరుగవుతున్నాయని తేలింది.

జిల్లాల వారీగా పారిశుద్ధ్య స్థితి:
తెలంగాణలోని జిల్లాల వారీగా చూస్తే పారిశుద్ధ్య పరిస్థితిని హైదరాబాద్ నగరంలో 96%తో అగ్రస్థానంలో కలదు. జిల్లాలో త్రాగునీటిపరంగా 13 మండలాలలో 90 శాతానికి పైగా గృహాలలో నీటి లభ్యత గలదు. హైదరాబాదులోని తిరుమలగిరి మండలం 64% త్రాగునీటి లభ్యతలో దిగువ స్థానంలో కలదు. రంగారెడ్డి జిల్లాలో 81.3% పారిశుద్ధ్య టాయిలెట్లు కలవు. ఉప్పల్ కుత్బుల్లాపూర్ బాలానగర్ రాజేంద్రనగర్ షేర్ లింగంపల్లి మరియు ఘట్కేసర్ల లో 90 శాతం మందికి టాయిలెట్ సౌకర్యం గలదు. 8 మండలాలలో 25% మందికి మాత్రమే టాయిలెట్ సౌకర్యం కలదు. ఐదు మండలాలలో 75.90 ప్రజలకు మరుగుదొడ్లు కలవు. కరీంనగర్ జిల్లాలో 46.18 మందికి మాత్రమే టాయిలెట్ సౌకర్యం కలదు. కరీంనగర్ రామగుండం మండలాలలో మాత్రం 70 శాతం మందికి గృహాలలో టాయిలెట్ సౌకర్యం కలదు. ఖమ్మం జిల్లాలో 48.23 శాతం మంది గృహములలో టాయిలెట్ సౌకర్యం కలదు. ఖమ్మం నగరంలో 75% గృహములలో ఈ సదుపాయం కలదు. మిగతా అన్ని మండలాలలో రాష్ట్ర సగటు కన్నా తక్కువగా టాయిలెట్స్ ఉన్నాయి. మెదక్ జిల్లాలో 44.07% మందికి మాత్రమే గృహాలలో టాయిలెట్ సౌకర్యం కలదు .రామచంద్రపురం పటాన్చెరువు మరియు సిద్దిపేటలలో 77% కంటే గృహాలలో చాలామందికి టాయిలెట్ సౌకర్యం కలదు. నిజామాబాద్ జిల్లాలో 41.56% కుటుంబాలకు టాయిలెట్ సౌకర్యం ఉంది. నిజామాబాద్ మండలంలోని 78% కుటుంబాలలో ఈ సౌకర్యం ఉంది . 12 మండలాలలో 25 శాతం కంటే తక్కువ కుటుంబాలలో ఈ సౌకర్యం ఉంది .అదిలాబాద్ జిల్లాలో 39.31 మంది గృహాల్లో మరుగుదొడ్ల సౌకర్యం ఉంది .మంచిర్యాల మందమర్రి మండలాల్లో 65.2 శాతం మందికి గృహాల్లో ఈ వసతి ఉంది. మహబూబ్నగర్ జిల్లాలో అతి తక్కువగా 26.44 శాతం మందికి మాత్రమే గృహాలలో టాయిలెట్స్ సౌకర్యం గలదు. మహబూబ్నగర్



ఫరూక్నగర్లో 60% కంటే ఎక్కువ గృహాలలో టాయిలెట్ సౌకర్యం ఉంది. వనపర్తి మండలంలో రాష్ట్ర సగటు కన్న తక్కువగా ఉన్నాయి. త్రాగునీటిలో 33.23% గృహాలకు త్రాగునీటి వసతి కలిగి ఉంది.

త్రాగునీటి వసతులలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలైన జాతీయ గ్రామీణ త్రాగునీటి కార్యక్రమం 13వ ఫైనాన్స్ కమిషన్, నిర్మల్ భారత్ అభియాన్, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఎన్నో త్రాగునీరు మరుగుదొడ్ల నిర్మాణానికి సహాయం అందించి పరిస్థితులను మెరుగుపరచుట కృషి చేస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు, హడ్కో సంస్థల నుండి అప్పు సేకరించి ఈ రంగం అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి . తెలంగాణ త్రాగునీటి గ్రిడ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నీటిపారుదల ప్రాజెక్టు నుండి పది శాతం నీటిని తీసుకొని త్రాగునీటి అవసరాలకు కేటాయించడానికి రాష్ట్ర త్రాగునీటి గ్రిడ్ ను మిషన్ భగీరథ పేరు మీదుగా ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి వారి వారి గృహములోనే త్రాగునీరు అందించే దిశగా పథకాన్ని ప్రారంభించింది. వచ్చే ముందు సంవత్సరాలలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి సంకల్పించింది. రాష్ట్రంలో 1279 గ్రామాలలో త్రాగునీరు రసాయనాలతో కలుషితం అయ్యాయి. వాటిలో 1138 గ్రామాలలో ఫ్లోరైడ్ సమస్య 107 గ్రామాలలో ఉప్పునీటి సమస్య నాలుగు గ్రామాలలో ఇనుము 29 గ్రామాలలో నైట్రేట్లు ఉండడం వల్ల ఈ గ్రామాలకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి త్వరగా మంచినీరు అందించే దిశగా ఏర్పాటు చేసింది.

తెలంగాణ ప్రభుత్వ పాత్ర: త్రాగునీటి విషయంలో తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ దానికి తగిన ప్రణాళికను తయారుచేసి గ్రామాలలో ప్రతి ఒక్కరికి వంద లీటర్లు, నగరాలలో 135 లీటర్ల ఇవ్వడమే లక్ష్యంగా నీటి పంపుల ద్వారా 2019 నుండి వారి వారి గృహాలకు అందించడానికి కృత నిశ్చయంతో పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య ఉద్దేశం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రోజుకు 100 లీటర్లు, నగర ప్రజలకు 150 లీటర్ల నీటిని అందించేందుకు ఉద్దేశించింది. హైదరాబాద్ నగరంలో ఇది రోజుకు 175 లీటర్లు అందించడానికి ప్రత్యేక ప్రణాళికను తయారు చేశారు. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం ముందు వరసలో ఉందనడంలో సందేహం లేదు.

**పందిరి శ్రీనివాసులు ఎంఏ (జాగ్రఫీ), బీఈడీ, ఎంసీజే (జర్నలిజం), పిజిడిసిజే (జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**



## ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, జులై 27 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు అందజేశారు. అనంతరం గాజుల రామారం డివిజన్ బిఆర్ఎస్ నాయకులు శ్రావణ్ తన పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలవగా, ఎమ్మెల్యే శ్రావణ్ ను శాలువాతో సత్కరించి పుట్టినరోజు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా, ప్రతినిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలతో మమేకమై ఉండడమే తన జీవిత లక్ష్యం అని వివరించారు.

## శెట్టిపల్లిలో పచ్చదనానికి శ్రీకారం

- మొక్కలు నాటిన సర్పంచ్



**ఆమనగల్లు, జూలై 27(నినాదం):** అమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ తెల్లమల్ల జంగమ్మ-వెంకటయ్య ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. అనంతరం కేశ ఎల్లయ్య పొలంలో ఫార్మ్ పండ్‌కు ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్ము కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌లో నమోదు చేయించుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి



**వికారాబాద్, జూలై 27(నినాదం):** ప్రతి ఓటరు ఎస్ ఐ ఆర్ లో నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నవాబు పేట మండల అధ్యక్షుడు రావుగారి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పలు గ్రామాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పలువురు నాయకులతో కలిసి నవాబు పేట మండలంలోని ఏక్ మామిడి, మూలమాడ, మామదాన్ పల్లి,కుమ్మరి గూడ గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సీనియర్ నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్ తో కలిసి పరిశీలించారు. ముందుగా ఎస్ఐఆర్ ఫారాల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియపై బీఎల్‌వోలు, బీఎల్ఏలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, ఏ ఒక్క అర్హుడైన పౌరుడు కూడా జాబితా నుంచి విడిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏక్ మామిడి గ్రామపంచాయతీలో 6,7,8 పోలింగ్ కేంద్రాలల్లో 96 శాతం పూర్తి చేసినట్లు బీఎల్ఓలు వెల్లడించారు. అదే విధంగా మూలమాడ బూత్ నెంబర్ 09లో 100 శాతం, మామ్మదాన్ పల్లి బూత్ నెంబర్ 04 లో 100 శాతం, కుమ్మరి గూడ బూత్ నెంబర్ 05 లో 100 శాతం పూర్తి అయిందని బీఎల్‌వోలు తెలిపారని చెప్పారు. గ్రామసభలో మరణించిన ఓటర్లు, గ్రామం విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు, వివాహం కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళా ఓటర్ల జాబితాలను బీఎల్‌వోలు వారికీ వివరించారు. ఈ జాబితాల పై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత బీఎల్ఓలకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస్, బీఎల్ఏలు కుమ్మరి గూడ ప్రభాకర్ రెడ్డి, మూలమాడ వెంకటేష్, ఏక్ మామిడి బర్ల ప్రభు, ఎం.డి. షకిల్ పాల్గొన్నారు.

### ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను

## సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, జూలై 27(నినాదం ):** కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తూ పై సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. ప్రజావాణి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇ.వెంకటా చారి, ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, డీఆర్ఓ స్వర్ణలత, డిప్యూటీ కలెక్టర్(ట్రైనీ)పూజ, జడ్పీ సీఈఓ సుధీర్, లతో కలిసి ప్రజల నుండి (165)ప్రజా ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట స్థాయి లో సి ఎం ప్రజావాణికి వచ్చిన ప్రజా వాణి ఫిర్యాదుల రిపోర్ట్ ను జిల్లా కు పంపించారని, జిల్లాకు సంబంధించి వచ్చిన దరఖా స్తులను జిల్లా అధికారులు ప్రత్యేక ద్రుష్టి సారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తు లను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వచ్చిన ఫిర్యాదును మీ స్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలనీ ఆయన అన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించే దిశగా అధికారులు పని చేయాలన్నారు. ప్రజావాణిలో ఆరోగ్యం, వ్యవసాయం, గిరిజన సంక్షేమం ,గ్రామీణ అభివృద్ధి, గ్రామ పంచాయతి, హౌసింగ్, పెన్షన్, విద్యుత్తు, విద్యా, శిశు సంక్షేమ శాఖ, మిషన్ భగీరథ, గురుకులాలు తదితర అంశాలపై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

## పట్నం మహేందర్ రెడ్డి కుటుంబానికి పరామర్శ



**కుత్బుల్లాపూర్, జూలై 27 (నినాదం) :** మాతృ యోగానికి గురైన శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలాను హనుమంత రెడ్డి పట్నం మహేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మహేందర్ రెడ్డి తల్లి రుక్కమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో షాబాద్ లోని ఆయన నివాసానికి వెళ్లి రుక్కమ్మ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ కొలను రాజశేఖర్ రెడ్డి , బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, అంజలి యాదవ్ ఆలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గనుల తవ్వకాలు ఆపాలి



**ఆమనగల్లు, జూలై 27(నినాదం):** ఆకుతోటపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 304లో జరుగుతున్న మైనింగ్, క్వారీ పనులను నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 302, 304 పరిధిలోని స్టోన్ క్రషర్ల వల్ల పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. దుమ్ము, శబ్ద కాలుష్యం కారణంగా విద్యార్థుల ఆరోగ్యం క్షీణిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు పై స్పందించిన అదనపు కలెక్టర్, తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించిన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సమగ్రంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 27 (నినాదం):** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదు, వినతిని అత్యంత బాధ్యతతో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో, సమగ్రంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా జిల్లాకు వచ్చిన ఫిర్యాదులతో పాటు జిల్లా ప్రజావాణిలో అందిన వినతులను కూడా సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. నేటి ప్రజావాణిలో మొత్తం 99 వినతులు అందాయి. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 14, నారాయణఖేడ్ డివిజన్‌కు 5, జహీరాబాద్ డివిజన్‌కు 39, కలెక్టరేట్‌కు 41 వినతులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయం, పెన్షన్లు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఎస్సీ సంక్షేమం, బీసీ సంక్షేమం, పంచాయతీరాజ్, నీటిపారుదల, పోలీసు, రిజిస్ట్రేషన్, కార్మిక, విద్య, ఆర్టీసీ, పౌరసరఫరాలు, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలు, పురపాలక సంస్థలకు సంబంధించినవి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట మండలానికి ఇద్దరు పార్టీ అధ్యక్షులు

**ఇద్దరు సర్పంచ్ సంఘాల అధ్యక్షులు**

**గెలిచిన ఓడిన వారి మధ్య కోల్డ్ వార్ అయోమయంలో కార్యకర్తలు**





**వికారాబాద్, జూలై 27(నినాదం):** వికారాబాద్ జిల్లాలోనే నవాబుపేట మండలంలో కొంత రాజకీయ చైతన్యం అధికమని చెప్పవచ్చు. ఈ మండలం నుండి ఇద్దరు ఎమ్మెల్యే లు, ఒక ఎమ్మెల్సీ, ఒక రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవిని అలంకరించిన ఉద్దండులు ఈ మండలానికి చెందిన వారుకావడం విశేషం. అంతే కాకుండా వికారాబాద్ రాజకీయాలను నాటినుండి నేటి వరకు ప్రభావితం చేయడంలో ఈ మండలం నాయకులకు చెల్లింది. నాటి సమితి పాలన నుండి నేటి అసెంబ్లీ స్థానం రాజకీయాల వరకు ఎందరో నాయకులు నవాబుపేట మండలం నుండి ఉన్నత మైన ప్రాతినిధ్యం వహించారు. అయితే ప్రస్తుతం చేవెళ్ళ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఈ మండలం జిల్లా వికారాబాద్ పరిధిలో ఉండటంతో వికారాబాద్ రాజకీయాలపై కొంత ప్రభావం తగ్గుముఖం పట్టిన నేపథ్యం కొనసాగుతున్నది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ నుండి కాలె యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నుండి పమేన భీమ్ భరత్, బీజేపీ నుండి మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, తదితరులు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ పడ్డారు స్వల్ప మెజారిటీ తో కాంగ్రెస్ అభ్యర్థి పై బీ ఆర్ ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య విజయం సాధించారు. కొన్నాళ్లకు ఆయన అధికార పార్టీ కాంగ్రెస్ లో చేరారు. దీంతో యాదయ్య స్వంత మండలమైన నవాబుపేట లో అసలు రాజకీయం మొదలైయింది. ఇక్కడే సానుభూతి సంపాదించాలని ఓడినా అభ్యర్థులు వారి అనుచరఘనాన్ని ఒడిసి పట్టుకుని పరోక్షంగా ప్రత్యక్షంగా ఎమ్మెల్యే యాదయ్య పై యుద్ధం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్యే వర్గీయులు ఒక వర్గంగా, ఓటమి చెందిన భీమ్ భరత్ అనుచరులు ఒక వర్గంగా మారారు. ఒకరిపై ఒకరు పరోక్ష, ప్రత్యక్ష దూషణలు, దాడులు చేసుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి ఆశం ముందుకు వచ్చింది. దీంతో అధ్యక్షునిగా ఉన్న మేడి పల్లి వెంకటయ్య స్థానంలో మరొకరిని నియమించే యత్నం జరుగుతుందని తెలుసుకున్న వెంకటయ్య ఆయన ఆరాధ్యుడు మండలానికి చెందిన నాయకుడు ఎమ్మెల్సీ కొంపల్లి యాదవరెడ్డి వరకు విషయం చేరింది. దీంతో ఎమ్మెల్యే యాదయ్య అనుకున్న వ్యక్తికి కాకుండా వెంకటయ్యనే కొనసాగించడానికి నిర్ణయం తీసుకున్నారు. దీంతో కొన్నాళ్ళు ఈ విషయం సద్దు మణిగింది. మే 12, 26 న టీ పి సిసి నుండి సీనియర్ నాయకుడు సామ వెంకట్ రెడ్డిని మండల అధ్యక్షునిగా నియమిస్తూ ఆర్డర్ విడుదలైయింది. అప్పటి నుండి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా సామ వెంకట్రెడ్డి కొనసాగుతున్న తరుణంలో ఈ నెల 20 అదే పి సీ సీ నుండి ఎమ్మెల్యే యాదయ్య వర్గానికి చెందిన రావుగారి వెంకట్ రెడ్డి ని మండల అధ్యక్షునిగా నియమిస్తూ మరో ఆర్డర్ విడుదల చేసింది. దీంతో యాదయ్య కు వ్యతిరేకంగా ఏకంగా గాంధీ భవన్ ముందు నిరసన తెలిపారు. అప్పటి నుండి ఇద్దరు అధ్యక్షులుగా కొనసాగుతున్న తీరు కార్యకర్తలను, ప్రజలను అయోమయానికి గురి చేస్తుంది. అంతేకాకుండా ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా గ్రూప్ ఒకటి ఉండేది. అది కూడా రెండు గ్రూపులుగా మారాయి. రెండు గ్రూపుల్లో ఇరువర్గాల నాయకులు కార్యకర్తలు ఉన్నారు. ఇదిలా ఉండగా మండల సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షునిగా ఎమ్మెల్యే యాదయ్య వర్గీయుడు దాతపూర్ సర్పంచ్ బల్వంత్ రెడ్డి ని కొందరు సర్పంచులు ఎన్నుకొన్నారు. అప్పటి నుండి ఆయన సంఘం పెద్దగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇటీవల భీమ్ భరత్ వర్గీయులైన సర్పంచ్ లు ఎల్ల కొండ సర్పంచ్ కొండల్ యాదవ్ ను సర్పంచ్ ల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకుని ప్రకటించుకున్నారు. ఆయన సంఘం పెద్దగా వ్యవహరిస్తున్నారు. మరో అడుగు ముందుకు వేసి ఒక వర్గం వారు ఆదివారం ఉప సర్పంచ్ ల సంఘాన్ని ఎన్నుకున్నారు. మరో వర్గం కూడా రేపో మాపో మరో సంఘం ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం రెండు వర్గాలుగా కొనసాగుతున్న వారిలో అధికులు ఎమ్మెల్యే యాదయ్య అనుచరులే ఉండటం కోసమేరుపు. ఈ పరిణామం ఇతర పార్టీలకు అలుసుగా మారే ప్రమాదాన్ని అధిష్టానం గుర్తించాలని క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని లేదంటే పార్టీకి జరిగే నష్టం స్వీయంకృపరాదం కాక తప్పదని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.



## ఘనంగా వరుణ యాగం



**కొమురవెల్లి జూలై 27 (నినాదం):** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో సోమవారం నాడు వరుణ యాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. యాగంలో భాగంగా వేద పండితులు ముందుగా మహాగణపతి పూజ, గౌరీ పూజ, రక్షాబంధనం, స్వస్తి పుణ్యాహవాచనం, నాంది సమారాధన తదితర వైదిక క్రతువులను ప్రారంభించారు. అనంతరం నవగ్రహ, దిక్పాలక, ఏకాదశ రుద్ర, ఋష్యశృంగ పంచాచార్య కలశ స్థాపన, వరుణ కలశ స్థాపన మరియు ప్రధాన రుద్ర కలశ స్థాపన చేసి ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు అటు పిమ్మట మహాగణపతి హోమం, ఆవాహిత మండపదేవతా హవనం, రుద్ర హోమం, వరుణ మూలమంత్ర మరియు జయాది హోమాలతో పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. పూర్ణాహుతి అనంతరం స్వామివారికి అష్టోత్తర శత (108) ఘటాలతో మహా స్నపనం, మహా మంగళహారతి నిర్వహించి, మహామంత్ర పుష్ప సమర్పణ చేశారు. ఈ పూజా కార్యక్రమాలన్నీ వీరశైవ ఆగమోక్త ప్రకారంగా శాస్త్రోక్తంగా కొనసాగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ మరియు పండితులచే మహాదాశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి కట్టా సుధాకర్ రెడ్డి, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లిఖార్జున్, సహాయ కార్యనిర్వహణాధికారి బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు, అర్చక బృందం మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లుట్ల నరసవ్వకు ఉమెన్ లీడర్‌షిప్ డాక్టర్ నేషనల్ అవార్డు

- సామాజిక సేవలకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు
- అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయి
- బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ



**దుబ్బాక,, జూలై 27 (నినాదం):** మహిళా సాధికారత, సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, మహిళల్లో చైతన్యం కల్పించడం, ప్రజా సేవా కార్యక్రమాల అమలులో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ సామాజిక కార్యకర్త నెల్లుట్ల నరసవ్వకు ప్రతిష్ఠాత్మకమైన "ఉమెన్ లీడర్‌షిప్ డాక్టర్ నేషనల్ అవార్డు--2026" ఘనంగా ప్రదానం చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 19వ పశ్చిమ భారతదేశ సదస్సు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ జాతీయ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందని, నిస్వార్థ సేవాభావంతో ప్రజల కోసం పనిచేస్తున్న మహిళలను గుర్తించి జాతీయ స్థాయిలో సత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి పురస్కారాలు సమాజానికి సేవ చేస్తున్న మహిళలకు మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను కల్పిస్తాయని అన్నారు. బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో నిశ్శబ్దంగా సేవలందిస్తున్న వ్యక్తులను వెలుగులోకి తీసుకువచ్చి గౌరవించడం ప్రతి సంస్థ బాధ్యత అని అన్నారు. అవార్డులు కేవలం గౌరవ సూచికలు మాత్రమే కాకుండా, మరింత సేవ చేయాలనే బాధ్యతను పెంచే ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సేవాభావాన్ని సమాజంలో విస్తరించడం బీఎస్ఏ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, నేటి మహిళలు విద్య, వైద్యం, పరిపాలన, సామాజిక సేవ, రాజకీయాలు, వ్యాపారం వంటి అన్నిరంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. అలాంటి మహిళలను జాతీయ స్థాయిలో సత్కరించడం ద్వారా మరెందరో మహిళలకు స్ఫూర్తి లభిస్తుందని, మహిళా సాధికారత ద్వారానే సమాజ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, మహిళల నాయకత్వం కుటుంబానికే కాకుండా సమాజ నిర్మాణానికి కూడా బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి జాతీయ అవార్డులు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, మరింత సేవా దృక్పథంతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, సేవాభావంతో ప్రజల మధ్య పనిచేస్తున్న మహిళలను గుర్తించి గౌరవించడం గొప్ప విషయమని అన్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం నెల్లుట్ల నరసవ్వ మాట్లాడుతూ, ఈ జాతీయ పురస్కారం తన ఒక్కరికే దక్కిన గౌరవం కాదని, తనతో కలిసి పనిచేసిన సహచరులు, మహిళా సంఘాలు, గ్రామ ప్రజలు, తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా మహిళా సాధికారత, సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజా సేవా కార్యక్రమాల్లో మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా విద్య, వైద్యం, సాహిత్యం, సామాజిక సేవ, మహిళా సాధికారత, మానవ హక్కులు, ప్రజా సంక్షేమం తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులకు జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. వారి సేవలు సమాజాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని, భావితరాలకు స్ఫూర్తినిస్తాయని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, బీఎస్ఏ రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గుర్రాల శ్రీనివాస్, కుంబాల రవి, జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యావేత్తలు, యువజన నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నృత్య నాటకాలు సంస్కృతికి పట్టుకొమ్మలు

- కళారత్న నరసింహ మూర్తి



**అల్వాల్, జులై27 (నినాదం):** రంగస్థలం పై నవరసాలను పండించే కళ నృత్య నాటక కళారూపాలు అవి మన సంస్కృతికి సంప్రదాయాలకు పట్టుకొమ్మ అని కళారత్న బి నరసింహమూర్తి అన్నారు, ఆదివారం మల్కాజ్ గిరి సఫిల్ గూడ లో లయన్స్ క్లబ్ హాల్ లో నల్లగొండ జిల్లాకు చెందిన నల్గొండవాసి సంగీత కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డా పురుషోత్తమా చార్యులురచించిన స్వర నృత్య కేళిక నృత్య నాటక సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమం మల్కాజ్ గిరి ప్రాంతానికి చెందిన భావనలయ నృత్య అకాడమీ వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బి నరసింహ మూర్తి మాట్లాడుతూ సంగీత విద్వాంసుడి దృష్టి సాహిత్యానికి రాగం ఎలా ప్రాణం పోస్తుందో,తాళం ఎలా నడకలు నేర్పుతుందో ,స్వరం ఎలా భావాన్ని పండిస్తుందో పురుషోత్తమా చార్య కు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు,నృత్యానికి సంగీత స్వర మాధుర్యం చేరితే ఆ నృత్యం ఎంత రక్తి కడుతుందో దాన్ని చక్కగా వివరించారని అన్నారు. భావనలయ నృత్య అకాడమీ వ్యవస్థాపకులు డా. వట్టికోట యాదగిరా చార్యులు మాట్లాడుతూ స్వర నృత్య కేళిక అనే ద్వాదశ నృత్య నాటికల సంపుటి అందరికి అర్థమయ్యే రీతిలో సరళతరంగా ముద్రణ రూపంలో గ్రంథం వెలువడడం అభినందనీయం అని అన్నారు, ఆత్మీయ అతిథులుగా నృత్య గురువులు విచ్చేసిన డా సీహెచ్ మల్లికార్జున చారి ,డా కల్లూరి వెంకటేశ్వర్లు ,సునీలా ప్రకాష్, పేరిణి నృత్య గురువు డా రంజిత్ కుమార్,డా రవళి రమేష్,మాట్లాడుతూ సాహిత్యం ,కళ, సంస్కృతి, అనే ప్రవాహాలు ఒకేచోట సంగమించి నప్పుడు కాలాతీతమైన సృజన జనిస్తుందని అన్నారు, ఆ విధంగా రూపుదిద్దుకున్న గొప్ప గ్రంథమే ఈ స్వర నృత్య కేళిక అని అన్నారు, కథారచయిత డా పురుషోత్తమా చార్యులు మాట్లాడుతూ లలిత కళలు మన జీవన గమనానికి ఒక దిక్సూచి అని అన్నారు,నాటి నుండి నేటివరకు నృత్య నాటక రంగంలో ఎన్నో మార్పులు చేర్పులు వచ్చాయి , భాష ఏదైనా భావ స్ఫూర్తి ప్రధానం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భావనా లయ నృత్య విద్యార్థులు పలు ప్రదర్శనలు ప్రదర్శి ఆహుతులను ఆకట్టుకున్నారు, అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా నాట్య విదార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది, ఈ కార్యక్రమ వ్యాఖ్యాతగా కవి రచయిత అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు వ్యవహరించారు, ప్రార్థన గీతం కె రుక్మిణి ఆలపించారు.

## విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి


### వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, జూలై 27(నినాదం):** ఆమనగల్లు మండల రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక విత్తన మేళాను ఏర్పాటు చేశారు. ఈ మేళాలో కందులు, పెసర, మినుము, ఆముదాలు, కూరగాయల విత్తనాలు వంటి తక్కువ నీటి వసతితో పండే స్వల్పకాలిక విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండనున్నాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు నికితా, మీనాక్షితో పాటు స్థానిక రైతులు మరియు డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు

## ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



**అల్వాల్, జులై 27 (నినాదం):** అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోనిమచ్చ బొల్లారం లో మౌలిక వసతులు కల్పన కోసం ప్రేమ్ నగర్ కాలనీలో 30 లక్షల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టిన స్థానిక మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్. ఈ కార్యక్రమంలో నాయకులు డివిజన్ ప్రెసిడెంట్ లడ్డు రెడ్డి,సురేందర్ రెడ్డి బొబ్బిలి, వెంకటేష్ గౌడ్, సర్వేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, సురేందర్, కెసిఆర్, దేవేందర్, కాలనీ వారు గిరి, రాజ్,సంతోష్, మనీ కుమార్, రవి, సాయి, ఎస్, వి రావు, విజయ్, భాస్కర్,నాయుడు, మంజుల, రాజ్యలక్ష్మి,వసుధ, అరుణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దుకు జన జాగరణ, ఎమ్మెల్యే గంగులకు వినతిపత్రం

**పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం అసెంబ్లీలో గళం విప్పుతామని గంగుల కమలాకర్ హామీ**



**కరీంనగర్, జూలై27(నినాదం):** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జన జాగరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సంఘం ప్రతినిధులు కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను ఆయన శిబిర కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను విన్న గంగుల కమలాకర్.. సీపీఎస్ ఉద్యోగుల తరఫున అసెంబ్లీలో గళం విప్పుతామని, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ, జూలై 11న ప్రారంభమైన జన జాగరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటిస్తూ 119 మంది ఎమ్మెల్యేలను కలుస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 2.60 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రధాన ఆకాంక్ష పాత పెన్షన్ విధానం పునరుద్ధరణేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం వల్ల పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నెలకు కేవలం 3,000 నుంచి 4,000 వరకు మాత్రమే పెన్షన్ అందుతోందని, ఈ మొత్తంతో కుటుంబ పోషణ కూడా కష్టసాధ్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ ఈయూ ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్,జూలై27(నినాదం):** చొప్పదండి ప్రధాన రహదారిపై తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతి, మిగిలిన నిర్మాణం, సర్వీస్ రోడ్లు, భూసేకరణ, డ్రైనేజీ తదితర అనుబంధ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. నిర్మాణ ప్రాంతంలో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణతో పాటు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, సంబంధిత రెవెన్యూ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఓవర్‌బ్రిడ్జి పూర్తయితే కరీంనగర్--చొప్పదండి మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రైల్వే గేటు వద్ద ఎదురయ్యే నిరీక్షణకు ముగింపు లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో రహదారులు--భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కుమారస్వామి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కిరణ్, సహాయ ఇంజనీర్ మధు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పారమిత విద్యార్థుల ప్రతిభకు హనుమ అవార్డులు

**తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఆకట్టుకున్న విద్యార్థులను అభినందించిన పారమిత యాజమాన్యం**



**కరీంనగర్,జూలై27(నినాదం):** స్థానిక మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు తిరుపతి మహతి కళాక్షేత్రంలో జూలై 18 నుంచి 26 వరకు నిర్వహించిన 26వ వార్షిక జాతీయ స్థాయి కూచిపూడి నృత్యోత్సవంలో ప్రతిభ కనబర్చి "హనుమ అవార్డులు" అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత–సాంస్కృతిక శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 8వ తరగతి విద్యార్థిని ఎం. శాన్వి, 7వ తరగతి విద్యార్థినులు హెచ్. లాస్యశ్రీ, సీహెచ్. దేవాన్షి, ఎం. ఆరాధ్య, 6వ తరగతి విద్యార్థులు ఏ. వైష్వి, కె. శ్రీనిధి, ప్రథమ్ మోక్షిత్, బి. ఐశ్వర్య పాల్గొని విశిష్ట ప్రదర్శన ఇచ్చారు. వారి ప్రతిభను గుర్తించి అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపకులు బి.ఎన్. రెడ్డి హనుమ అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు అభినందించారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.యం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు, నాట్య గురువు నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేష్ కుమార్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సేవాకు వారధి జయన్న ఫౌండేషన్

**పాఠశాల లో స్వచ్ఛమైన నీరు అందించడం అభినందనీయం .. వాటర్ ప్యూరిఫైయర్లు, వాటర్ ప్లాంట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే**





**జమ్మికుంట, జూలై 27 (నినాదం)** హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం, విద్యార్థుల ఆరోగ్యం వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ మండలం లోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధునిక వాటర్ ప్యూరిఫైర్లను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. అలాగే రాజపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిస్వార్ధంగా పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో వారికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని సంకల్పంతో జయన్న ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్లు వాటర్ ప్లాంట్లను ప్రారంభించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని సుమారు పది ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే సంకల్పంతో లక్షల రూపాయల విలువచేసే వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జయన్న ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. "విద్యార్థులే దేశ భవిష్యత్తు వారికి నాణ్యమైన విద్యతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం మనందరి బాధ్యత అని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఆత్మవి శ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించేలా అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు నేను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తులో పెట్టే ప్రతి అడుగు సమాజ అభివృద్ధికి బలమైన పునాది అవు తుందని తెలిపా రు. చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని దశలవారీగా అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రకటించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాభ్యాస వాతావరణం కల్పించేందుకు అవసరమైన తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ గందె శ్రీనివాస్, తిరుమల్, ముత్యం రాజు, సర్పంచ్ మల్ల రెడ్డి, రాజు, స్థానిక నాయకులు, జయన్న ఫౌం డేషన్ ప్రతినిధులు గుడిపాటి సరిత జైపాల్ రెడ్డి ఉపా ధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ నిధులతో పాఠశాలకు శౌచాలయాలు విద్యార్థుల సమస్యకు పరిష్కారం

**చొప్పదండి జడ్పీ పాఠశాలలో ఐదు శౌచాలయాల నిర్మాణానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చొరవ**



**కరీంనగర్, జులై 27(నినాదం):** చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శౌచాలయాల కొరతతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే స్పందించారు. పాఠశాలలో 227 మంది బాలురకు ఒకే శౌచాలయం ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిధులతో నిర్మాణ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో, సంస్థల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా శౌచాలయాలు నిర్మించాలని నిర్ణయించారు. మంత్రి ఆదేశాల మేరకు మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులు హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధులతో పాఠశాల ఆవరణలో ఐదు శౌచాలయాల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల సమస్యను గుర్తించి తక్షణమే స్పందించిన మంత్రి బండి సంజయ్‌కు, నిర్మాణానికి సహకరిస్తున్న సంస్థకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులు ఆరుతడి పంటలవైపు దృష్టి సారించాలి

**మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ ... అందుబాటులో ఆరుతడి పంటల విత్తనాలు**



**జమ్మికుంట, జూలై 27 (నినాదం):** ప్రస్తుతం నెలకొన్న ఎల్నినో వాతావరణ పరిస్థుల కు అనుగుణంగా రైతాంగం ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని సూచిస్తూ మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతు వేదికల్లో ఈనెల 27 నుండి 29 వరకు రైతులకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశించడం జరిగిందని జమ్మికుంట మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వఆదేశాలు అనుసరించి జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆబాది జమ్మికుంట రైతువేదిక నందు కంది, పెసర, మొక్కజొన్న, నువ్వులు, కూరగాయ విత్తనాలనుఅందుబాటులో ఉంచడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ తెలిపారు. అందుబాటులో ఉన్న విత్తనాలే కాకుండా ఆముదం, వేరుశెనగ, మినుములు మరే ఇతర పంటలను సాగు చేయదలచిన రైతులు ఆబాది జమ్మికుంట రైతువేదిక నందు ఉన్న స్టాల్ యజమానికి గాని, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి కి గానీ తెలియపరిస్తే, వాటిని సమకూర్చడానికి ప్రయత్నం చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. ఎల్ నీనో ప్రభావం తో వర్షలోటు నవంబర్ నెల వరకు ఉండే అవకాశం ఉన్నందున, తక్కువ నీటితో సాగు అయ్యే ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నేరుగా రైతులకే వారి మొబైల్ నంబర్లపై వాతావరణ సూచనలు అందిస్తూ ఆరుతడి పంటలను సాగు చేయాలని అప్రమత్తం చేయడం జరిగింది. గ్రామాలలో ఉన్న వ్యవసాయ శాఖ అనుబంధ వాట్సప్ గ్రూపులలో కూడా ఇట్టి వాతావరణ పరిస్థితులలో సాగు చేయవలసిన పంటలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు పంచుకోవడం జరుగుతుందని, రైతు సోదరులు ప్రభుత్వ సూచనలననుసరించి పంటల సాగు చేసుకుని వర్షాభావ పరిస్థితులను అధిగమించగలరని కోరడం జరిగింది.
పత్తి పంట బెట్ట పరిస్థితులకు లోనట్టయితే 19–19–19 లేదా 13–0–45 ఎరువులను ఎకరాకి ఒక కిలో చొప్పున నానో యూరియాతో కలుపుకొని పిచికారి చేయవచ్చును, తద్వారా పంట బెట్టను తట్టుకుంటుంది అని తెలిపారు.

## మున్సిపల్ ఉద్యోగులకు ఈపీఎఫ్‌పై అవగాహన సదస్సు



**జమ్మికుంట, జూలై 27 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ సప్లై సిబ్బంది కార్యాలయ సిబ్బందికి ఈపీఎఫ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్‌లో ఉద్యోగి నుంచి 12 శాతం, యాజమాన్యం (మున్సిపాలిటీ) నుంచి 12 శాతం చొప్పున జమ అవుతుందని వివరించారు. ఈపీఎఫ్ సభ్యుడు మరణించినట్లయితే నామినీకి సుమారు ?2.5 లక్షల నుంచి ?7 లక్షల వరకు బీమా ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని, అర్హత మేరకు భార్యకు పెన్షన్, పిల్లలకు విద్యా సహాయం (స్టైపెండ్) వంటి ప్రయోజనాలు కూడా అందుతాయని తెలిపారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా ఈపీఎఫ్ నామినేషన్ పూర్తి చేసి, భార్య, పిల్లల వివరాలను నమోదు చేసుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజేటి రమేష్ (సెక్షన్ సూపరింటెండెంట్), జి. అనిల్ (సీనియర్ అసిస్టెంట్), జి. రాజిరెడ్డి (మున్సిపల్ మేనేజర్), ఐ రమేష్ (శానిటరీ ఇన్‌స్పెక్టర్), మున్సిపల్ కార్మికులు, వాటర్ సప్లై సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో కలాంకు ఘన నివాళి

**కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు డాక్టర్ నరేందర్ రెడ్డి పిలుపు**



**కరీంనగర్, జులై27(నినాదం):** కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ కలాం భారతదేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, అంతరిక్ష, రక్షణ రంగాల అభివృద్ధికి విశేషకృషి చేసి దేశానికి గర్వకారణంగా నిలిచారని అన్నారు. పోఖ్రాన్--2 అణు పరీక్షల్లో ఆయన పోషించిన పాత్ర చారిత్రాత్మకమని, ఆ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారం ప్రదానం చేసిందని పేర్కొన్నారు. 2002 నుంచి 2007 వరకు రాష్ట్రపతిగా ప్రజల మనసులు గెలుచుకున్న కలాం, చివరి క్షణం వరకు విద్యార్థులకు బోధిస్తూ యువతకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థులు కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, దేశభక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, రెండు నిమిషాల మౌనం పాటించి డాక్టర్ కలాంకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

**యువతలో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందాలి: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**


**కలాం వర్ధంతి సందర్భంగా అమరవీరులకు ఘన నివాళి:**



**కరీంనగర్, జులై27(నినాదం):** దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్న భారత సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని, యువత వారిని ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కార్గిల్ విజయ్ దివస్, భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ సరిహద్దుల్లో తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో దేశ భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న జవాన్ల సేవలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తాను 2009లో శ్రీనగర్, కార్గిల్ ప్రాంతాలను సందర్శించిన సందర్భంగా భద్రతా దళాలు ఎదుర్కొన్న పరిస్థితులను ప్రత్యక్షంగా చూశానని గుర్తు చేశారు. అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ--కాశ్మీర్‌లో శాంతి, అభివృద్ధి నెలకొన్నాయని పేర్కొన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశ రక్షణ రంగ బలోపేతానికి విశేష కృషి చేశారని, పోఖ్రాన్ అణు పరీక్షలతో భారత్ ప్రపంచ వేదికపై తన సామర్థ్యాన్ని చాటిందని తెలిపారు. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం సాంకేతికంగా మరింత బలోపేతమైందని అన్నారు. అలాగే వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశాభివృద్ధికి బాధ్యతాయుతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ సభ్యులు, నిర్వాహకులను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మి ప్రకాశ్, కర్రె పద్మ అనిల్, గాజా రమా శివరాం, పదవీ విరమణ పొందిన సైనికులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## గాజుల శ్రీనివాస్ మృతి బాధాకరం

**అంతిమయాత్రలో పాల్గొన్న పింగిలి రమేష్**



**జమ్మికుంట, జూలై 27 (నినాదం) :** జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్ సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ తనుగుల గ్రామానికి చేరుకుని గాజుల శ్రీనివాస్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, గాజుల శ్రీనివాస్ ఆకస్మిక మృతి ఆ కుటుంబానికి తీరనిలోటు అని చిన్ననాటి నుండి శ్రీనివాస్ తనకు మంచి స్నేహితుడు అని తెలిపారు. శ్రీనివాస్ ఆకస్మిక మృతి తో ఆ కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయిందని ఆ భగవంతుడు ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డి తోపాటు పలువురు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## జమ్మికుంట--భూపాలపల్లి బస్సు సర్వీసులు ప్రారంభం

**ప్రయాణికులకు తగ్గనున్న ప్రయాణ దూరం**




**జమ్మికుంట, జూలై 27 ( నినాదం ):** జమ్మికుంట నుంచి భూపాలపల్లికి కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ బస్సులు ప్రతిరోజూ జమ్మికుంట నుంచి ఉ.7.30, 9.45లకు, మ. 12.30, 2.45 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. జమ్మికుంట బస్టాండ్ నుండి ఇల్లంతకుంట సిరిసేడు మొగుళ్ళపల్లి, చిట్యాల, జడలపేట మీదుగా భూపాలపల్లి చేరుకుంటాయని పేర్కొన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఈ రవాణా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

# యువతపై దమనకాండకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత

**యువతపై కేసులు ఎత్తివేసి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, బండి సంజయ్ స్పందించాలని డిమాండ్**

**మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**కరీంనగర్, జులై27(నినాదం):** నీట్ పరీక్షా పత్రాల లీక్ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేసిన యువతపై పోలీసులు బాష్పవాయువు, లాఠీచార్జి, పెల్లెట్ గన్స్‌తో దాడి చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మౌనం వీడి యువతకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆవేశపూరిత ప్రసంగాలతో యువతను రెచ్చగొట్టడం కాకుండా, వారి హక్కుల కోసం పోరాడిన సమయంలో చిత్తశుద్ధితో స్పందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. నీట్ అంశంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, నిరసనల్లో పాల్గొన్న యువతపై నమోదైన క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన విధంగా యువతకు 21 ఏళ్ల వయస్సులోనే చట్టసభలకు పోటీ చేసే అవకాశం కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రశ్నాపత్రాల లీకులు, పోటీ పరీక్షల రద్దులు జరిగినప్పటికీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా గ్రూప్–1తో పాటు పలు పోటీ పరీక్షలు నిర్వహించి సుమారు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడీ రమేష్, ఎల్లారెడ్డి, మిర్యాల శ్రీధర్ రెడ్డి, షబానా మహ్మద్ షెహన్షా, సాయిరాం, ముల్కల యోన, మాసుం ఖాన్, జిలుకర రమేష్, బత్తుల రాజ్‌కుమార్, ఇమామ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులుగా పల్లె మహేష్ గౌడ్

**నియామక పత్రం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు**



**జమ్మికుంట, జూలై 27 (నినాదం):** బీసీ అజాది స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా పల్లె మహేష్ గౌడ్ ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్య పల్లె గ్రామానికి చెందిన పల్లె మహేష్ గౌడ్ విద్యార్థుల సమస్యల పరిష్కారం, బీసీ విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా రంగ అభివృద్ధి సంస్థ బలోపేతానికి కృషి చేయాలి అని రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్ తెలిపారు.
పల్లె మహేష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ కి, రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్ కి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, బీసీ అజాది స్టూడెంట్ ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



**ధర్మపురి జూలై 27( నినాదం ):** డీఏపీ ఎరువులను గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే ఎక్కువ ధరలకు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మపురి మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండ లంలోని పలు ఎరువుల దుకాణా లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వివిధ రకాల ఎరువుల నిల్వలు, కొనుగోలు రసీదులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన మేర ఎరువులను అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. ప్రస్తుతం డీఏపీకి అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఎంఆర్పీ ధరలకే విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్‌లను ప్రతిరోజూ నవీకరించడంతో పాటు ప్రతి దుకాణం ముందు ఎరువుల లభ్యత, ధరలను తెలిపే బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. యూరియా నిల్వలను కూడా పరిశీలించిన అధికా రులు, ప్రస్తుత వానాకాల సీజన్‌కు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలంలో యూరియా కొరత తలెత్తకుండా తగిన నిల్వలు ఉంచాలని, యూరియా విక్రయాలు తప్పనిసరిగా యూరియా బుకింగ్ యాప్ ద్వారానే నిర్వహించాలని డీలర్లకు సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జులై 27 (నినాదం):** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే



పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 60 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 11,డిపిఓ 6, డి ఏం అండ్ హెచ్ ఓ 5, మిగిలిన 16 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఎ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, సిపిఓ కిషన్, డిఇఓ అశోక్ జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ భర్త జోక్యంతో విధులు చేయలేకపోతున్నా..

ఎంపీడీవోకు పంచాయతీ కార్మికురాలి ఫిర్యాదు



**మహాముత్తారం, జులై 27 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని కొర్లకుంట గ్రామ పంచాయతీ కార్మికురాలు బొబ్బిలి సారక్క తనకు విధుల్లో ఆటంకాలు కల్పిస్తున్నారని ఆరోపిస్తూ ఎంపీడీవో ప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కోట రజిత భర్త అధికారిక హోదా లేకపోయినా తనను విధులకు రావద్దని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తన కుమారుడు సర్పంచ్ ఎన్నికల్లో వారికి వ్యతిరేకంగా పనిచేసినందుకే కక్ష సాధిస్తున్నారని పేర్కొన్నారు. చెత్త సేకరణ వాహనంలో విధులకు వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు హాజరు నమోదు చేయనివ్వడం లేదన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుని ఎలాంటి ఆటంకాలు లేకుండా విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని ఎంపీడీవోను కోరారు.

## పీహెచ్ సీలో సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం



**నూతనకల్,జులై 27(నినాదం):** ప్రభుత్వ దావఖానలో సురక్షితమైన సాధారణ ప్రసవాలు చేస్తున్నట్లు డాక్టర్ నగేష్ తెలిపారు. మండల కేంద్రం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన హిమబిందు కు పీహెచ్ సీ లో సోమవారం సాధారణ ప్రసవం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ..సర్కార్ దావఖానల్లో సురక్షితమైన కాన్పులు జరుగుతాయని..అనవసరంగా ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి డబ్బులతోపాటు ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. ప్రైవేట్ లో అవసరం లేకుండా సిజేరియన్ చేసి డబ్బులు దండుకుంటున్నారన్నారు. ప్రభుత్వ దవఖానల్లో అనుభవజ్ఞులైన సిబ్బంది ఉండడంతో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈనాటి కార్యక్రమంలో సిహెచ్ఓ చరణ్, నర్సింగ్ శైలజ,ప్రియాంక,మౌనిక,శైలజ, ఆఫీసర్ బిక్షమమ్మ,రజిని,సీతారాంరెడ్డి, వెంకటమ్మ,ఆశా కార్యకర్తలు,పాల్గొన్నారు.

## ఎస్సీ కమ్యూనిటీ హాల్‌పై వివక్ష.. దళితుల ఆగ్రహం

2023లో హామీ ఇచ్చి అమీనాబాద్ దళితులను మోసం చేశారని ఆరోపణ?

కమ్యూనిటీ హాల్ నిర్మించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



**కోదాడ, జులై 27(నినాదం):** అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను వెంటనే మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అంబేద్కర్ యువజన గ్రామ సంఘం అధ్యక్షుడు దేవపంగు రవి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, 2023లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరైందని చెప్పి దళితులను నమ్మించి చివరకు నిర్మాణం చేపట్టకుండా మోసం చేశారని ఆరోపించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తగిన స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. బీసీ కమ్యూనిటీ హాల్‌కు స్థలం లేకపోయినా వేగంగా చర్యలు తీసుకున్న అధికారులు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ విషయంలో మాత్రం వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. అభివృద్ధి కార్యక్రమాల్లో దళితులను పక్కన పెట్టడం, వారి హక్కులను కాలరాయడం సరికాదన్నారు. దళితులకు సంబంధించిన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో దళితులంతా ఏకమై తమకు జరిగిన అన్యాయానికి ప్రజాస్వామ్యబద్ధంగా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, దళిత యువకులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులు నిలిపివేయాలి

- యూజీడీ టెండర్‌పై మాజీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు
- నాసిరకం పనులతో ప్రజాధనం వృథా అవుతోందని విమర్శ
- టెండర్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తేవాలని డిమాండ్

**కోదాడ, జులై 27(నినాదం):** కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి ముసుగులో మంత్రి ఉత్తం పద్మావతి దంపతులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కమిషన్ల పేరిట కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు... ఇందులో భాగంగానే కోదాడ పట్టణంలోఅండర్ డ్రైనేజీ పనులలో కమిషన్ల కోసం కే ఎల్ ఎస్ ఆర్ పేరుతో బ్లాక్ లిస్టులో ఉన్న ఓ కాంట్రాక్టర్కు కట్టబెట్టిన విషయాన్ని ఆయన ఆధారాలతో స్పష్టం చేశారు.. సదరు కాంట్రాక్టర్ ది చీకటి చరిత్ర అని, ఆయనపై ఇప్పటికీ కోర్టులో కేసులు ఉన్నాయని , డ్రైనేజీ పనులను ఆయనకు కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులుని గ్గు తేల్చాలన్నారు.... వాస్తవ టెండర్ లో 182 కోట్లు కోడ్ చేస్తే ప్రకటనలో మాత్రం 258కోట్లు గా



ఉండడం ఆశ్చర్యంగా ఉందని, తేడాగా ఉన్న 72 కోట్ల మతల బెంటో ప్రభుత్వం నిగ్గు తేల్చాలని , బ్లాక్ లిస్ట్ లో ఉన్న కాంట్రాక్టర్ కు టెండర్ ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటో స్పష్టం చేయాలనిఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..... డ్రైనేజీ నిర్వహణ పనులకు తాము వ్యతిరేకం కాదని.. నాసిరికం పైపులతో నిర్మాణం చేస్తే పారిశుద్ధ లోపంతో అస్తవ్యస్తమై పట్టణ ప్రజలు ఇబ్బందుల గురవుతారనే మా ఆవేదనని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైయస్ సింగారం ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే.. కాంట్రాక్టర్. నాసిరకం పైపులైను వేయటం వల్ల ఒక గ్రామానికి కూడా చుక్కనీరు అందని విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ ఎవరి హయాంలో జరిగిందో అందరికీ తెలిసిందే అన్నారు... మాధవరం రిజర్వాయర్ పరిస్థితి కూడా అదేనని ఇందుకు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి బాధ్యుడు కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులు నాసిరకం నిర్మాణంతో జరుగుతున్నందున భవిష్యత్తులో ప్రజలకు లాభం కంటే నష్టమే ఎక్కువగా వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే బ్లాక్ లిస్టులో ఉన్న కాంట్రాక్టర్ను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... ప్రస్తుతం పట్టణ అభివృద్ధి కొంటుపడిందని నాటిన మొక్కలకు నీళ్లు పోసే పరిస్థితి లేదని.. పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తుందని బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 70 మంది తాత్కాలిక సిబ్బందిని నియమిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వారిని తొలగించడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు.. అవకాశం ఉన్న ప్రతి చోట నియోజకవర్గంలో అవినీతి చోటు చేసుకుంటుందని, అవినీతిని అరికట్టడమే ప్రతిపక్షంగా తన బాధ్యత అని బొల్లం స్పష్టం చేశారు.. పట్టణ ప్రముఖులు, మేధావులు సాంకేతిక నిపుణుల సమక్షంలో నాణ్యత ప్రమాణాలతో డ్రైనేజీ పనులు పునః ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు నయీమ్ కౌన్సిలర్ చీమ నరేష్ సీనియర్ నాయకులు పైడిమర్రి సత్యబాబు పట్టణ నాయకులు కుక్కడ పు బాబు ఉపేందర్ గౌడ్కరీముల్లా గొర్రె రాజేష్ చలిగంటి వెంకట్ సంగిశెట్టి గోపాల్ ఉపేందర్ పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం ఆశయాలు యువతకు ఆదర్శం

- రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి

**ఆలేరు, జులై 27(నినాదం):** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతిని పురస్కరించుకుని రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆలేరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మారక సభలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ భారతదేశాన్ని విజ్ఞాన శక్తిగా తీర్చిదిద్దేందుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విశేష కృషి చేశారని కొనియాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా, గొప్ప ఉపాధ్యాయుడిగా కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. కలలు కనండి, ఆ కలలను



లక్ష్యాలుగా మార్చుకుని కష్టపడి సాధించండి అనే ఆయన సందేశం నేటి విద్యార్థులు, యువతకు మార్గదర్శకమని అన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, విద్య, క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు సాగితేనే కలాం కలల భారతాన్ని నిర్మించగలమని అభిప్రాయపడ్డారు. అబ్దుల్ కలాం ఆశయస్ఫూర్తితో ఎందరో ఈనాడు అన్ని రంగాలలో అద్భుతాలు సృష్టిస్తున్నారని, ఇటీవల స్కైరూటు అంతరిక్ష వాహనం రూపొందించిన వారు కూడా ఆయన స్ఫూర్తిగా తీసుకున్న విద్యార్థులేనని గుర్తు చేశారు. అనంతరం రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణకు భూమిపూజ నిర్వహించారు. అక్టోబర్ 10న జరిగే కలాం జయంతి నాటికి విగ్రహ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ విగ్రహం యువతకు స్ఫూర్తి కేంద్రంగా నిలిచేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్, మంగ నరసింహులు, మూడో వార్డు కౌన్సిలర్ యాట శివ, నాలుగో వార్డు కౌన్సిలర్ బీజని కళ్యాణి, మాజీ వార్డు సభ్యులు పంతం కృష్ణ, జింకల రామకృష్ణ, మోతి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ కట్టే గుమ్ముల సాగర్ రెడ్డి, జర్నలిస్టులు ఎండి కుర్షద్ పాషా, ఎర్ర జాన్సన్, ప్రజా సంఘాల నాయకులు కంతుల శంకర్, ఏలుగుల వెంకటేష్, ఎండి ఫయాజ్, పడగంటి చందు, మైదము భాస్కర్, పేరపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

- రూ.5 కోట్ల7 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూరు, జులై 27(నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు మండలంలోని నాంచారి మడూరు,గుడిబండ తండ, వెలకట్ట, పెద్ద మంగ్య తండా, వెంకటాపురం,అమర్ సింగ్ తండా,దుబ్బ తండ, చీకటియపాలెం,ఫతేపురం, పోలేపల్లి,ఎస్వికె తండా, గుర్తూరు,ఖానాపురం,హచ్చు తండా, కొమ్మనపల్లి తండా గ్రామాలలో సుమారు రూ. 5 కోట్ల 7 లక్షల నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం పనులకు సోమవారం ఆయా శాఖల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతాయన్నారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు,అధికారుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి





చేసేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులు ఏర్పాటు చేసి పల్లెల ప్రగతికి బాటలు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాలు ప్రజా ప్రభుత్వంలో అందుతున్నట్లు తెలిపారు. పేదలకు సన్న బియ్యం అందించి వారి కడుపు నింపుతున్నామని తెలిపారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులు సైతం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూణం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,పట్టణ పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్,కాంగ్రెస్ నాయకులు జాటోత్ హమ్యా నాయక్,డాక్టర్ పి. సోమేశ్వరరావు,గంజి విజయపాల్ రెడ్డి,చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి,మేకల కుమార్, వెంకన్న యాదవ్,చెవిటి సదాకర్,మహబూబ్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి,విక్రమ్ రెడ్డి,పింగిలి ఉష,రవి నాయక్, మిత్తింటి హరీష్, వెంకటాచారి,బిక్షం గౌడ్, దేవేందర్ రాజు,ప్రవీణ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు,రమేష్,సాయి కిరణ్, నరేష్, సర్పంచ్ లు బంగారు రమేష్, అభిరామ్, బందు శ్రీనివాస్, జాటోత్ రాం లాల్,విజయ రవి, గంగా నరేష్,విజయ లింబ, కృష్ణమూర్తి,మాధవరెడ్డి, పి. కళావతి,బానోత్ సాగర్, కవిత బాలకృష్ణ, ఎండి. మహిపాషా, బానోత్ బిక్షపతి, బానోత్ శ్రీను నాయక్,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడ పరిధిలోని తండాలలో ఉచిత వైద్య శిబిరాలు

**డోర్నకల్ /మరిపెడ జులై 27(నినాదం ):** మరిపెడ మండల పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తండాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించినట్లు మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి తెలిపారు. సోమవారం తానంచెర్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని అజ్మీరా తండా గ్రామపంచాయతీలో,మరియు వీరారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని దంట కుంట తండా గ్రామపంచాయతీలో డాక్టర్ రవి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపులు జరిగాయి. ఈ శిబిరాలలో మొత్తం 155 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ముఖ్యంగా బీపీ (రక్తపోటు), షుగర్ (మధుమేహం), మరియు జ్వరంతో బాధపడుతున్న వారికి తగిన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రవి మాట్లాడుతూ..వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల



అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారానే దోమల నివారణ మరియు వ్యాధుల అదుపు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వామి, హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు,ఎం ఎల్ హెచ్ పి ఝాన్సీ, ఏఎన్ఎంలు రోజమణి, శ్రీలత, ఆశా కార్యకర్తలు, మరియు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని శిబిరాలను విజయవంతం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల హామీలు వెంటనే అమలు చేయాలి



- కేకే కమిటీ నివేదికపై జాప్యం చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**భూపాలపల్లి, జులై 27 ( నినాదం):** తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇకపై ఆలస్యం చేయకుండా అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. భూపాలపల్లి లోని కాకతీయ ప్రెస్ క్లబ్ లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఫోరం నాయకులు మాట్లాడుతూ, ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం గత తొమ్మిదేళ్లుగా ఫోరం నిరంతరం కృషి చేస్తున్న అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారు లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని ఆ హామీ అమలుకు ప్రభుత్వం ఏర్పాటు చేసి కేకే కమిటీ ఇప్పటికే ఉద్యమకారుల అభిప్రాయాలు సూచనలు సేకరించిందని తెలిపారు. అయితే కమిటీ నివేదికను డిసెంబర్ వరకు వాయిదా వేయకుండా వీలైనంత త్వరగా ప్రభుత్వ నికి సమర్పించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవానికి ముందే మేనిఫెస్టో హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేసి చర్యలు ప్రారంభించాలని కోరారు. ఉద్యమకారులు ప్రభుత్వంపై విశ్వాసంతో ఎదురుచూస్తున్నారని వారి నమ్మకాన్ని నిలబెట్టేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీ తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్, రాష్ట్ర నాయకులు రాష్ట్ర నాయకులు మేకల సంపత్,కత్తి సంపత్, రాష్ట్ర మహిళా కార్యదర్శి బందెల ప్రసన్న,పొన్నం రవి,భార్గవ్,సాంబమూర్తి,సురేందర్ తదితర ఉద్యమకారుల ఫోరం నాయకులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి



- ఏడిఏ స్పెషల్ ఆఫీసర్ రవి నాయక్

**హుజుర్నగర్( మఠంపల్లి) జులై 27 (నినాదం ):** మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ , ఎంపీడీవో, మరియు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగినటువంటి సర్వసభ్య సమావేశం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఏడిఏ స్పెషల్ ఆఫీసర్ రవి నాయక్ మాట్లాడుతూ ఎల్ నీనో లో ప్రభావం వల్ల వర్ష భావ పరిస్థితుల్లో దృష్ట్యా వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా అరుతడి పంటలైన కందులు పెసలు, మినుములు ,జొన్నలు వేరుశనగలు మరియు ఉద్యాన పంటలైనటువంటి కూరగాయలు పండ్లు పూల తోటలు మునగ తోటలో మరియు ఆయిల్ పామ్ పంటలు వేసుకోవాల్సిందిగా కోరడం జరిగింది. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఈ ప్రత్యామ్నాయ పంటలకు ఉద్యానవన శాఖ నుంచి అందిస్తున్నటువంటి వివిధ రకాల రాయితీ పథకాల గురించి వివరించడం జరిగింది. కూరగాయ పందిరిలకు , డ్రిప్పు, స్ప్రింక్లర్స్ కు మరియు కూరగాయ విత్తనాలకు మరియు నారుకు అందిస్తున్న వివిధ రకాల రాయితీలను ఉపయోగించుకొని అధిక దిగుబడులు పొందవలసిందిగా కోరడం జరిగింది, అలాగే వి. బి. జి రామ్జి పథకంలో భాగంగా ఇంకుడు గుంతలు , ఫామ్ పాంట్స్, బోర్ వెల్స్, ఓ పెన్ వెల్స్ లకు సంబంధించిన పథకాలను గ్రామస్థాయిలో తీర్మానం చేసి ఉపయోగించుకోవాల్సిందిగా కోరడం జరిగింది. అలాగే విత్తన మేళాలో భాగంగా ప్రభుత్వ అందిస్తున్న విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎంపీడీవో సుమంత్ రెడ్డి తాసిల్దార్ హిమ బిందు శ్రీనివాస్ ఉద్యానవన విస్తరణ అధికారి షేక్ ఇస్మాయిల్ ఏపిఎం స్వరూప ఏపీవో ఉమ ఎంపీ ఓ నవీన్, సిసి సందీప్, ఏ ఈ ఓ లు, పంచాయతీరాజ్, నీటిపారుదల ఏఈ వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి, జులై 27 (నినాదం):** ప్రజావాణిలో జిల్లా ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 134 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 64 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 17, సర్వే ల్యాండ్స్ 8, మున్సిపాలిటీ 8, డి.పి. ఓ 6, మైనింగ్ 4, ఉపాధి కల్పన 3, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య 2, ఇరిగేషన్ 2, జిల్లా పరిషత్ 2, వ్యవసాయ 2, విద్య శాఖ 2, సివిల్ సప్లై, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,విద్యుత్,ఎల్.డి. ఎం, డి. సి. ఓ, టి జి ఎస్ డబ్ల్యు ఆర్ ఈ ఐ, ఆర్టీసీ, హౌసింగ్, చేనేత మరియు జౌళి, కోపరేటివ్, పౌర సంబంధాలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.... స్టేట్ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి కి బదులు ప్రత్యామ్నాయ (తక్కువ నీటి ) పంటలు వేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎల్ ని నో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సాగునీటి వినియోగం తదితర అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల స్పెషల్ అధికారులకు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి. ఆర్. ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

**సూర్యాపేట ప్రతినిధి, జులై 27(నినాదం):** డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన 11 మంది వాహనదారులకు సోమవారం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గోపు రజిత జైలు శిక్ష విధించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తెలిపారు . ఇద్దరికీ 2000 రూపాయల జరిమానా రెండు రోజుల జైలు శిక్ష మరొకరికి కమ్యూనిటీ సర్వీస్ పనిష్మెంట్ 8 మందికి 7900 జరిమానా విధించారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు పట్టణంలో తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.



# ప్రజావాణి.. సమస్యల పరిష్కారానికి భరోసా

## ప్రతి అర్జీపై క్షేత్రస్థాయి విచారణ చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, జూలై 27 (నినాదం): ప్రజావాణిలో ప్రజలు అందజేసే ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన ప్రజలు విద్య, భూ సమస్యలు, గురుకుల ఉద్యోగాల రెన్యువల్, దివ్యాంగుల సంక్షేమం, గృహాల మంజూరు, అంత్యోదయ కార్డులు, కారుణ్య నియామకాలు, ఆన్‌లైన్ భూ వివరాల సవరణ తదితర అంశాలపై వినతులు సమర్పించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణి ప్రజలకు ప్రభుత్వాన్ని నేరుగా ఆశ్రయించే వేదిక అని పేర్కొన్న కలెక్టర్, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిపై పారదర్శకంగా స్పందించి, నిర్ణీత గడువులో పరిష్కారం అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



## సేవలతో ముద్ర వేసిన దామోదర్ రావు

మంచిర్యాల, జూలై 27 (నినాదం): సింగరేణి కార్పొరేట్ సెంట్రల్ వర్క్ షాప్ జీఎం (ఈ&ఎం) ఎన్. దామోదర్ రావు సంస్థలో అందించిన సేవలు మరువలేనివని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలో ఈ&ఎం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం దామోదర్ రావుకు శాలువా కప్పి, పూల మొక్క అందజేసి సన్మానించారు. సింగరేణిలో వివిధ హోదాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కృష్ణప్రసాద్, ఏజీఎంలు రమణరావు, సుమలతతో పాటు వివిధ విభాగాల డీజీఎంలు, ప్రాజెక్టు ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఖరీఫ్‌కు అత్యవసర కార్యాచరణ ప్రణాళిక

**రైతులు ప్రత్యామ్నాయ పంటలు, జల సంరక్షణ చర్యలు చేపట్టాలి: అధికారులు**



చింతలమానేపల్లి, జూలై 27 (నినాదం ): ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు చింతలమానేపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాధార పరిస్థితులు మారే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. బోరు బావులు, భూగర్భ జలాలు, కాలువలు, చెరువులపై ఆధారపడి వరి సాగు చేస్తున్న రైతులు అత్యవసర కార్యాచరణ ప్రణాళికను అనుసరించాలని సూచించారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత, వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంటలు, ప్రతి గ్రామానికి ఒక ఊట కుంట, ప్రతి బోరుబావికి రీఛార్జ్ స్ట్రక్చర్లు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు చేపట్టాలని వివరించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హౌసింగ్ వేణుగోపాల్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి, ఏపీఓ ఈజీఎస్ షోయబ్ , ఏవో కీర్తిసా,ఏఈ ఇరిగేషన్, సబ్ ఇంజనీర్ ఎలక్ట్రిసిటీ ప్రశాంత్ కుమార్, ఏఈఓలు అర్జున్, మనోజ్ మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచు మేకల పోషక , ఉపసర్పంచు తోంబ్రి శ్రీనివాస్ , కార్యదర్శులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాతో దొంగకు చెక్!



మంచిర్యాల, జూలై 27 (నినాదం): జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో ఓ ఇంటర్నెట్ సెంటర్‌లో కంప్యూటర్ మానిటర్‌ను దొంగిలించిన వ్యక్తిని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 25న రాత్రి జరిగిన దొంగతనం ఘటనపై ఫిర్యాదు అందుకున్న పట్టణ ఎస్సై రమేష్ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఫుటేజీ ఆధారంగా బెల్లంపల్లికి చెందిన మహమ్మద్ మద్దంను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ, సీసీ కెమెరాల వల్లే దొంగను త్వరగా గుర్తించి పట్టుకోగలిగామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, దుకాణాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దర్యాప్తుకు సహకరించిన ఫిర్యాదుదారు మహమ్మద్ మొఇజ్‌ను కాలనీవాసుల సమక్షంలో అభినందించి సన్మానించారు.





## ఇంకుడు గుంతల నిర్మాణంలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేయాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత

కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 27 (నినాదం): జిల్లాలో భూగర్భ జలాల మట్టం పెంపు కోసం చేపట్టనున్న ఇంకుడు గుంతలు, ఫారం పాండ్లు, సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి సెర్ప్ ఏపీఎంలు, సామాజిక సమన్వయకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వి.బి.జి.–ఆర్‌జీఎం పథకం కింద ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు, పప్పుధాన్యాలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగుతో నష్టాలు ఎదుర్కొనే పరిస్థితుల కంటే ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 15లోగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులందరికీ రెండు జతల యూనిఫాంలు అందించాలని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వీఓ పరిధిలో కనీసం 15 స్వయం సహాయక సంఘాలు ఉండేలా కొత్త సభ్యులను చేర్చి నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన విత్తనమేళాను కలెక్టర్ పరిశీలించి విత్తన ప్యాకెట్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి మిలింద్, సెర్ప్ ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మంచిర్యాల, జూలై 27 (నినాదం): మంచిర్యాల పట్టణంలోని గోదావరి నదిపై ఉన్న రైల్వే బ్రిడ్జి 17వ నంబర్ పిల్లర్ సమీపంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ రమేష్ తెలిపారు. మున్సిపల్ కార్మికుడు శనిగారపు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకోగా మృతుడు బండరాళ్లపై బోర్లా పడి, శరీరం కుళ్లిపోయిన స్థితిలో కనిపించారని తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, బ్లాక్ కలర్ టీ–షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంటు, బ్రౌన్ రంగు అండర్‌వేర్ ధరించి ఉన్నాడని వెల్లడించారు. అతడి ఎత్తు సుమారు 5 అడుగుల 7 అంగుళాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

## మర్యాదలో మరోసారి ముద్రవేసిన కౌన్సిలర్ బాకం సాయి కిరణ్

**కొత్త సబ్ రిజిస్ట్రార్‌కు ప్రత్యేక సత్కారం**



సుల్తానాబాద్, జూలై 27 (నినాదం): సుల్తానాబాద్ మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ్‌ను 6వ వార్డు కౌన్సి లర్ బాకం సాయికిరణ్ మర్యాదపూర్వకం గా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజే సి ఘనంగా అభినందించారు.కొత్త బాధ్యతల్లో వి జయవంతంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. సబ్ రిజిస్ట్రార్ శ్రీరా మ్ సైతం కౌన్సిలర్ సాయికిరణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు పారదర్శకంగా, వేగవంత మైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పే ర్కొన్నారు.

## మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



మంథని జూలై 27(నినాదం): మహిళలు ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కాపాడుకోవచ్చని హెల్త్ సూపర్వైజర్ ఎన్జీవో సుబ్రహ్మణ్యం ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వేల్పుల వనిత,దేవల్ల మమత అన్నారు.మహిళా ఆరోగ్య వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై సోమవారం మండల ప్రజా పరిషత్ ఆవరణలో శ్రీ శక్తి భవనంలో నిర్వహించిన గ్రామీణ అభివృద్ధి శాఖ మహిళా సమాఖ్య సంఘం కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు రోజువారి సమతుల్య ఆహారం తీసుకోవడం, పరిశుభ్రత పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవడం మంచిదన్నారు. కుటుంబ ఆరోగ్యం పై కూడా మహిళల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఏపీ రమాదేవి,మంజుల, సీసీలు రాజ్యలక్ష్మి ,సౌమ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



**పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా**

## వివిధ వార్డుల సందర్శన

నిర్మల్ ప్రతినిధి, జూలై 27 (నినాదం): నిర్మల్ డిసిసి (DCC) అధ్యక్షులు బొజ్జు పటేల్ MLA ఖానాపూర్ గారి ఆదేశాల మేరకు సోమవారం నిర్మల్ లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల హరీష్ నాయకత్వంలో SIR కార్యక్రమంలో భాగంగా గాంధీ నగర్,నాయడివాడ, బంగల్ పెట్,వెంకటాద్రిపెట్,బ్రాహ్మణ పూరి, చింతకుంటావాడ, మదిన కాలనీ వివిధ వార్డులలో పర్యటించడం జరిగింది. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ లను సూపర్వైజర్ లను ఎప్పటికప్పుడు అడిగి వార్డుల వారీగా నమోదవుతున్న పురోగతిని సమీక్షించి రోజువారీ పట్టణంలో ఉన్న వివిధ బూతులలో చేపట్టిన పనులు వచ్చిన దరఖాస్తులు ఇతర సమస్యలను నివేదిక రూపంలో డిసిసి కార్యాలయానికి సమర్పిస్తానని పట్టణ అధ్యక్షులు ఆకుల హరీష్ గారు తెలియజేయడం జరిగింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు జరిగిన పురోగతిని తెలుసుకోవడం జరిగింది.దాదాపు 100% నమోదు కోసం కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ (BLA) లు అందరూ తప్పకుండా ప్రతీ ఇంటికీ వెళ్లి విషయాలు తెలియజేయాలని సూచించారు. కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే సంక్షేమ పథకాలు ఆగిపోకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అంబడి రాజేశ్వర్,మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లూరి కృష్ణవేణి, EX జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి దశరథ్ రాజేశ్వర్, SC డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్,డీసీసీ జెనరల్ సెక్రటరీ జునైద్, మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ మతీన్, కిజర్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అహ్మద్ ముక్తార్,యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులుసాయి ప్రతాప్ నాయుడు ఓబీసీ ప్రధాన కార్యదర్శి సంతోష్, ఆకుల నర్సయ్య , అంబాజి రాథోడ్,అమెడ శ్రీధర్, వాసవి, లక్ష్మి , గీత,వార్డ్ కౌన్సిలర్ లు ,వార్డ్ మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ పై అధికారుల అలసత్వం

**హాస్టల్ కు తాళం వేసిన వార్డెన్.. చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల డిమాండ్**



మంథని జూలై 27 (నినాదం): నిరంతరం విద్యార్థులను పరిశీలిస్తూ వారి మంచి చెడ్డలు చూడాల్సిన హాస్టల్ వార్డెన్ ఏకంగా వసతి గృహానికి తాళం వేసి విద్యార్థులకు సెలవులు ఇచ్చింది.వివరాల్లోకి వెళ్తే ....మంథని పట్టణంలోనీ బాలికల కళాశాల వసతి గృహాలలో పది మంది కి పైగా విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. గురుకులాలను పెంచిన నేపద్యం లో వందల సంఖ్యలో ఉండాల్సిన విద్యార్థుల పది కి పడిపోయారు.అప్పుడే అంత అంత మాత్రంగా ఉన్న హాస్టల్ ఇలాంటి వార్డెన్ వ్యవహారం వల్ల మూసివేసే పరిస్థితి నెలకొంది. హాస్టల్ లో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా సంఘాల నాయకులు సోమవారం హాస్టల్ ను సందర్శించారు. ప్రధాన గేటుకు తాళం వేసి ఉండడంతో ప్రజాసంఘాల నాయకులు అవాక్కయ్యారు. మంథనిలో వరుసగా హాస్టల్లో మూతపడడానికి కారణం హాస్టల్ వార్డెన్లు జిల్లా అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందని మండిపడ్డారు. ప్రభుత్వం నుండి వేతనాలు తీసుకుంటూ విధులు సక్రమంగా నిర్వహించకుండా హాస్టల్ లు మూతపడడానికి అధికారులు కారణమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే మంథని లో విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని అన్నారు. మంథనిలో కాలేజీలు పాఠశాలలు నడుస్తున్న క్రమంలో హాస్టల్ లు మూతపడి ఉండడం ఏంటని మండిపడ్డారు. అడ్మిషన్లు అవుతున్న క్రమంలో హాస్టల్ లు తలుపులు వేసి తాళాలు ఉంటే మరి అడ్మిషన్లు ఏ విధంగా జరుగుతాయని అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా మంథని లోని ఎస్సీ బాలికల హాస్టల్ కూడా అదే పరిస్థితిలో తలుపులకు తాళాలు వేసి కొనసాగుతుంది అన్నారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నియోజకవర్గ కేంద్రంలోనే హాస్టల్ కాలేజీల పరిస్థితి ఇలా కొనసాగడం విచారకరమని అన్నారు. మంత్రి వెంటనే స్పందించి మంథని నియోజకవర్గ లో ఉన్న హాస్టల్ లు సాంఘిక సంక్షేమ హాస్టల్ గురుకుల పాఠశాలలు ప్రభుత్వ కాలేజీలు ప్రభుత్వ పాఠశాలలో సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్ కుమార్,అఖిల్,మహేందర్, కిరణ్,చరణ్ పాల్గొన్నారు.





## వార్డు అభివృద్ధికి మరో అడుగు

**14వ వార్డులో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు**

**విజ్జన్న ఆశీస్సులతో వేగంగా అభివృద్ధి కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్**


సుల్తానాబాద్, జూలై 27 (నినాదం): సుల్తానాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డులో ప్రజ లకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించే దిశ గా నూతన కరెంటు స్తంభాలను ఏర్పాటు చేసిన ట్లు వార్డు కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆశీస్సులతో వార్డులో విద్యుత్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపట్టామని, దీంతో విద్యుత్ సరఫరా మరింత మెరుగు పడటంతో పాటు స్థానికులకు ఇబ్బందులు తగ్గనున్నాయని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. స్థానికులు ఈ పనుల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**14వ వార్డు లో కౌన్సిలర్ కార్యాలయం ప్రారంభం**

ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కౌన్సిలర్ కార్యాలయం మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత ల చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని తె లిపారు.

# ప్రతి ఇంటా ఇంకుడు గుంత

**జలసిరి'తో జలభద్రతకు శ్రీకారం.... గ్రామ సమైక్య సంఘాలకు కీలక దిశా నిర్దేశం...ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శనరావు**





సుల్తానాబాద్, జూలై 27 (నినాదం): ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల క్షీణతను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణకు ప్రాధాన్యం కల్పించాలని అధికారులు ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శనం రావు పిలుపునిచ్చారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా సోమవారం సుల్తానాబాద్ మండల మహిళా సమైక్య భవనంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులతో అవగాహన సమావేశం నిర్వహించారు.సమావేశంలో భూగర్భ జలాల పెంపుదలకు చేపట్టాల్సిన చర్యలను అధికారులు వివరించారు. వీబీ జీ–ఆర్ఎంజీ పథకం ద్వారా ప్రతి ఇంటికి ఇంకు డు గుంత, ప్రతి రైతు పొలంలో పంట కుంట, ప్రతి గ్రామానికి ఊట కుంట, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణం వంటి కార్యక్రమాలను విస్తృతంగా అమ లు చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతల ఏర్పాటుపై గ్రామైక్య సంఘాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మహిళా సం ఘాల సమావేశాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగా హన కల్పించాలని కోరారు.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీమతి దేవకీ దేవి గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు దిశానిర్దేశం చేశా రు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కనకయ్య, ఏపీఓ మల్లీశ్వరి, మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శి, వివిధ గ్రామాల గ్రామైక్య సంఘాల అ ధ్యక్షులు పాల్గొన్నారు.

## రోడ్ల పాలవుతున్న గోదావరి జలాలు

**నినాదం కథనానికి స్పందించిన జలమండలి అధికారులు**

**పగిలిన పైపుల లీకేజీ అరికట్టడానికి మరమ్మత్తులు**

కుత్బుల్లాపూర్, జూలై 27 (నినాదం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ దేవేంద్ర నగర్ శివహిల్స్ కమాన్ హెచ్ పి పెట్రోల్ బంక్ వద్ద గోదావరి జిల్లాల సరఫరా ప్రధాన పైప్ లైన్ లీకేజీ కావడంతో రోజుల తరబడి విలువైన గోదావరి జలాలు రోడ్ల పాలు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని కుత్బుల్లాపూర్ నినాదం గోదావరి జలాలు రోడ్లపాలు అనే శీర్షికతో ఈనెల 20న వార్తా కథనం ప్రచురితం కావడంతో షాపూర్ నగర్ జల మండలి అధికారులు స్పందించారు. ఎన్నో రోజులుగా పైపులు లీకేజీ కావడంతో రోడ్లపై పారుతున్న గోదావరి జలాలను వృధా కాకుండా నివారణ చర్యలు చేపట్టారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని ప్రభుత్వ నిర్ణయాలను, ప్రచారాలను జలమండలి అధికారులు, సిబ్బంది పట్టించుకోకుండా ఎంతో విలువైన ప్రజలకు ఉపయోగకరమైన గోదావరి జిల్లాలు రోడ్ల పాలు కావడంతో స్థానిక ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. జలమండలి అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అంటూ గృహ అవసరాలకు కావలసిన నీటి సరఫరాలో కావలసిన నీటి ప్రెషర్ లేకపోవడంతో అర కొరనీటితో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని నినాదం దినపత్రిక విలేఖరి రోడ్లపై పారుతున్న గోదావరి జలాల దృశ్యాలను చూపుతూ వార్తా



కథనం రాయడంతో జలమండలి అధికారులు సత్వరమే స్పందించి నీటి లీకేజీల వ్యవహారంపై నివారణ చర్యలు చేపట్టారు. దీంతో స్థానిక ప్రజలు, ఆయా పార్టీల నేతలు జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు గోదావరి జలాల సరఫరా చేసే పైపులైన్ల లీకేజీలను గుర్తిస్తూ శాశ్వత ప్రాతిపదికన నివారణ చర్యలు చేపడితే తాగునీరు రోడ్ల పాలు కాకుండా కాపాడిన వారవుతారని, ఎప్పటికప్పుడు లీకేజీల పై ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

## అంగుళం సుద్దపై అబ్దుల్ కలాం

**కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వేగ్గలం నరేష్ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని అంగుళం సుద్ద ముక్కపై ఆయన ప్రతిమను చెక్కి ప్రతిభను చాటుకున్నారు. భారతదేశ 11వ రాష్ట్రపతిగా, అంతరిక్ష–క్షిపణి రంగాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కలాం "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా గుర్తింపు పొందారు. నరేష్ రూపొందించిన ఈ సూక్ష్మ కళాకృతి స్థానికులను ఆకట్టుకుంటోంది.**

**- కోదాడ,జూలై 27(నినాదం)**




## డ్రైనేజీపైనే డ్రైనేజీ...
# ధర్మపురిలో తీరిది!

- చెప్పినా పట్టించుకోని కాంట్రాక్టర్
- ప్రజల ఆస్తులూ ధ్వంసం..
- ప్రశ్నిస్తే లేదు జవాబుదారీ తనం
- నాకందరూ తెలుసంటూ బలుపు మాటలు
- మంత్రి ప్రజాదరణకు ప్రతికూలయత్నాలు..?



**ధర్మపురి, జూలై 27 (నినాదం):** "ఆస్తులే కాదు... అడ్డొస్తే ఏదైనా ధ్వంసం చేస్తాం. నీ దిక్కున్న చోట చెప్పుకో. నాకందరూ తెలుసు... నన్నెవరూ ఏమీ చేయలేరు." ఇవి ఏ రౌడీ, గూండా మాటలు కాదు. తన వల్ల నష్టపోయిన ఓ సీనియర్ పాత్రికేయుడు ప్రశ్నించగా ఓ కాంట్రాక్టర్ ఇచ్చిన బలుపు సమాధానాలు.



ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతుంటే, మరోవైపు కొందరు కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికే చెడ్డపేరు తెస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధర్మపురి పట్టణంలోని 3వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

> **టెండర్ నిబంధనలు ఎక్కడ..?**
>
> మున్సిపల్ టెండర్ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ పనులను స్వయంగా పర్యవేక్షించాలి. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడం, వ్యక్తిగత ఆస్తులకు నష్టం జరిగితే పునరుద్ధరించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం బాధ్యత. అయితే 3వ వార్డులో ఈ నిబంధనలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అన్ని వార్డుల్లో ఒకలా... 3వ వార్డులో మరోలా..!**

ఇతర వార్డుల్లో డ్రైనేజీని రోడ్డుకు ఒక వైపున నిర్మిస్తుండగా, 3వ వార్డులో మాత్రం పాత అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని తొలగించకుండా దాని పైనే కొత్త పైపులతో నిర్మాణం చేపడుతున్నారు. ఈ విధానం భవిష్యత్తులో సమస్యలకు దారితీస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జనం చందాలతో నిర్మించుకున్న డ్రైనేజీపైనే...**

స్థానికుల కథనం ప్రకారం, 1970 దశకంలో ప్రభుత్వ సహాయం లేకపోవడంతో వార్డు ప్రజలే చందాలు వేసుకుని ధర్మపురిలో తొలి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించారు. అనంతరం దానికి ఆనుకుని తాగునీటి పైప్‌లైన్ వేశారు. ఇప్పుడు అదే పాత డ్రైనేజీపై కొత్త నిర్మాణం చేపట్టడమే వివాదానికి కారణమైంది.

**భవిష్యత్తులో తాగునీటి కనెక్షన్లకు భారీ ఇబ్బందులు..!**

కొత్త డ్రైనేజీ కారణంగా భవిష్యత్తులో కొత్త తాగునీటి కనెక్షన్లు ఇవ్వాలంటే డ్రైనేజీని పగులగొట్టి మరింత లోతుగా తవ్వాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ ధనం వృథా కావడంతో పాటు ఇంటి యజమానులపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఒక వైపునే డ్రైనేజీ నిర్మించి ఉంటే ఈ సమస్య ఉండేదే కాదని పేర్కొంటున్నారు.

**భవిష్యత్తులో కుంగిపోయే ప్రమాదం..!**

దశాబ్దాల నాటి పాత డ్రైనేజీని తొలగించకుండా దాని పైనే సిమెంట్ పైపులతో నిర్మాణం చేపట్టడం సాంకేతికంగా ప్రమాదకరమని స్థానికులు అంటున్నారు. పాత నిర్మాణం కుంగిపోతే కొత్త డ్రైనేజీ కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రారంభ దశలోనే నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అభిప్రాయపడుతున్నారు.

**ప్రజల ఆస్తుల ధ్వంసం... ప్రశ్నిస్తే దుర్భాషలా..?**


ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే జేసీబీతో పనులు ప్రారంభించి, ఓ విద్యార్థిని సైకిల్‌ను ధ్వంసం చేశారని ఆరోపణలు ఉన్నాయి. నష్టపరిహారం కోరిన ప్రజలతో కాంట్రాక్టర్ దురుసుగా ప్రవర్తిస్తూ, "ఎవరికైనా చెప్పుకో... ఏం చేసుకుంటావో చేసుకో... మీ వార్డు మెంబర్‌కు చెప్పుకో" అంటూ మాట్లాడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు."పనిని గుత్తేదారుకు ఇచ్చా... నాకేం సంబంధం లేదు" అన్నారంటూ ఆరోపణలు వార్డు ప్రజలు ప్రశ్నించగా, "పనిని గుత్తేదారుకు అప్పగించాను. ఇక నాకేం సంబంధం లేదు. నేను జగిత్యాలలో ఉంటాను. నాకు అధికారులందరూ తెలుసు. నా ఇష్టం వచ్చినట్లు పనులు చేస్తాను. నీకు చేతనైనంత చేసుకో" అంటూ సమాధానం ఇచ్చారని స్థానికులు చెబుతున్నారు. అధికారుల పేర్లు ప్రస్తావిస్తూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **మంత్రి ప్రతిష్ఠకు మచ్చ తెస్తున్నారంటూ విమర్శలు**
>
> స్థానిక ఎమ్మెల్యే, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే, క్షేత్రస్థాయిలో కొందరు కాంట్రాక్టర్ల వ్యవహారం మంత్రి ప్రతిష్ఠకు మచ్చ తెస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వ అభివృద్ధి పనులపై ప్రజల్లో వ్యతిరేక భావన పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు.

**తక్షణమే స్పందించాలని డిమాండ్**

3వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని, మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సాంకేతిక లోపాలుంటే వెంటనే సరిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ నిధులు వృథా కావడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని నాణ్యమైన నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పక్కనే తాగునీటి పైపు..
## భవిష్యత్తులో సమస్యేనంటున్న జనం



## అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్

**జైన్ కులం, మతంపై విమర్శలు.. పట్టించుకోని యువనటుడు**

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.

NINADAM CINEMA

## త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్–ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్టుకు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా



ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.

## 'మామ్' సీక్వెల్‌లో ఖుషీ
## నవంబరులో రిలీజ్?



ప్రముఖ నటి శ్రీదేవి చివరి చిత్రం 'మామ్' ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసింది. ఇప్పుడు ఆ సినిమా సీక్వెల్‌తో ఆమె చిన్న కుమార్తె ఖుషీ కపూర్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'ది ఆర్చీస్' చిత్రంతో తెరంగేట్రం చేసిన ఖుషీ.. ఆ తర్వాత, 'నాదానియాన్', 'లవ్యాపా'వంటి చిత్రాల్లో నటించారు. కానీ అవి ఆశించిన విజయాలు సాధించలేదు. తాజాగా 'మామ్ 2'తో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. గిరీశ్ కోహ్లీ దర్శకత్వంలో, బోనీ కపూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నోయిడా, గ్రీస్ ప్రాంతాల్లో అత్యంత భారీ స్థాయిలో చిత్రీకరించారు. ఈ ఏడాది నవంబరులో థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఖుషీ ప్రధాన పాత్రలో, జిషు సేన్‌గుప్తా, కరిష్మా తన్నా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక, రవి ఉద్యావార్ దర్శకత్వంలో 2017లో వచ్చిన 'మామ్' చిత్రం శ్రీదేవి సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఆఖరి చిత్రం. 2018 ఫిబ్రవరిలో ఆమె కన్నుమూసిన అనంతరం, ఈ చిత్రంలో ప్రదర్శించిన నటనకు ఉత్తమ నటి జాతీయ పురస్కారానికి లభించింది.

## ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి.. అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు.

## సెప్టెంబర్‌లో మహేంద్రగిరి వారాహి

సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసుకోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787